
వెలిగొండ టన్నెల్ వద్ద నిర్మించిన పైలాన్

కృష్ణా నదిలో నీళ్లే లేవు. ప్రారంభించాలనుకున్న ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వలేదు. పునరావాసం కల్పించలేదు. రెండో సొరంగంలో టన్నెల్ బోరింగు మిషన్ (టీబీఎం) అలాగే ఉండిపోయింది. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉన్నా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును హడావుడిగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అంతా తామే పూర్తిచేశామని చెప్పుకొనేందుకే ఇలా ఆర్భాటం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రతిపక్షాలు మండిపడుతుండగా, ముంపువాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగానే ముఖ్యమంత్రి ఇలా చేస్తున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.


అసంపూర్తిగా ఉన్న సొరంగాల నుంచి ఫీడర్ కెనాల్‌ను కలిపే అప్రోచ్ కాలువ

ఎన్నికల్లలో..

వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం వింత పోకడ

- జాతికి అంకితం పేరుతో ఆర్భాటం
- జనాన్ని మోసగించేందుకు జగన్ సిద్ధం
- చుక్కనీరు లేకుండానే సిత్రం
- పూర్తికాని టన్నెళ్లు, అప్రోచ్, ఫీడర్ కెనాల్, హెడ్ రెగ్యులేటర్ పనులు
- పరిహాసంగా మారిన పునరావాసం
- నేడు సీఎం చేతులమీదుగా ప్రారంభోత్సవం

మార్కాపురం/పెద్దదోర్నాల, మార్చి 5 : పశ్చిమ ప్రకాశంతోపాటు నెల్లూరు, కడప జిల్లాల వరప్రదాయిని అయిన వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నానంటూ ముఖ్యమంత్రి జగన్ జనాన్ని మరోమారు మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఎన్నికల హామీగా అధికారంలోకి వచ్చిన ఏడాదికి వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. అనంతరం ఆ హామీని గాలికొదిలేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా నాలుగుసార్లు తేదీలు మారుస్తూ వాయిదాలు వేశారు. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించిన పాపానపోలేదు. ప్రాజెక్టు నిర్మాణ పనులు, పునరావాస చర్యలను పరిశీలిస్తే వాటి పూర్తికి మరో రెండేళ్లు పడుతుందని ఇంజనీరింగ్ అధికారులే చెబుతున్నారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం జగన్ మాత్రం హడావుడిగా ఈనెల 6న ప్రాజెక్టు జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసగించేందుకు రెడీ అయ్యారు.

పెండింగ్ పనులున్నా ప్రారంభానికి సిద్ధం


ప్రాజెక్టు పరిధిలో రెండు సొరంగాల అంతర్భాగంలో సుమారు 7 కిలోమీటర్ల మేర సిమెంటు కాంక్రీటుతో లైనింగ్ చేయాల్సి ఉంది. రెండు సొరంగాలను కలుపుతూ ఫీడర్ కెనాల్‌కు అనుసంధానించే కాలువ పనులు పూర్తిగా చేయలేదు. టన్నెళ్ల నుంచి వచ్చే నీరు ఫీడర్ కెనాల్‌కు పోవడం మాట పక్కన పెడితే ఫీడర్ కెనాళ్ల నుంచే నీళ్లు టన్నెళ్ల లోపలికి వెళ్లే విధంగా నిర్మించారు. దీంతో సొరంగాల నుంచి వచ్చే ఊట నీటిని మోటార్లతో బయటకు పంప్ చేస్తున్నారు. అయితే అప్రోచ్ కాలువ అసంపూర్తిగా ఉండటంతో ఆ నీరు సొరంగాల్లోకి వస్తుండటంతో అడ్డుగా కట్ట వేశారు. ఈ పనులన్నీ పూర్తి చేయకుండానే ప్రారంభానికి సిద్ధమయ్యారు.

దశాబ్దం క్రితం నిర్మించిన ఫీడర్ కెనాల్

ఫీడర్ కెనాల్‌ను దశాబ్దం క్రితం నిర్మించారు. అప్పట్లో కట్టలు మట్టితో వేయడం, నిర్వహణ లేకపోవడంతో అవి బలహీనపడ్డాయి. ఎక్కడచూసినా కోతలు కనిపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షాలకు వచ్చే వరద నీటినే ఈ కట్టలు తట్టుకునే పరిస్థితిలో లేదు. కడపరాజుపల్లె, కటకానిపల్లె సమీపంలో గండ్లు పడి కట్టలు తెగి సమీప పంట పొలాల్లోకి నీరు ప్రవహించిన ఘటనలు ఉన్నాయి. గతంలో ఏకంగా కడపరాజుపల్లెలోకి వరదనీరు చేరింది. రెండు హెడ్ రెగ్యులేటర్ల వద్ద కూడా కొంత పనులు పెండింగులో ఉన్నాయి. ఫీడర్ కెనాల్‌పై బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది.

ఎక్కడి పనులు అక్కడే

ప్రస్తుతం తీగలేరు కాలువలో చిల్లకంప పెరిగి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మొదటి విడతలో భాగంగా కేవలం నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించాలన్నా, రెండు సొరంగాలు పటిష్ఠంగా నిర్మించాల్సి ఉంది. మొదటి సొరంగంలో కిలో మీటరుకుపైగా, రెండో సొరంగంలో 6కిలో మీటర్లకు పైగా లైనింగ్ చేయాలి. ఈ పనులు చేయాలన్నా కనీసం ఏడాదిన్నర పడుతుందని ఆ శాఖాధికారులే తెలిపారు. రెండో సొరంగంలోని టీబీఎంను బయటకు తరలించాలంటే కుదరని పనిగా చెబుతున్నారు. అప్పటి కోస్టల్ కాంట్రాక్టర్లను అర్ధంతరంగా నిర్మాణం నుంచి తొలగించారు. దీంతో తమకు నష్టం వాటిల్లిందని ఆ సొమ్మును ఇప్పించాలని వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ సమస్య కోర్టులోనే పెండింగ్‌లో ఉంది. వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు రెండో సొరంగంలో తవ్విన మట్టి రాళ్లను మొదటి సొరంగం పొడవునా రెండు, మూడు అడుగుల మేర నింపేశారు. తొలగింపు చర్యలు చేపట్టలేదు. దీంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతుంది. సొరంగాల నిర్మాణాలు ప్రభుత్వం ఒప్పందం ప్రకారం గుండ్రంగా ఉండాలి. ప్రస్తుతం 'డీ' ఆకారంలో నిర్మించినట్లు తెలిసింది. దీంతో ఖర్చు, సొరంగం వ్యాసం, సమయం తగ్గుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆ విధంగా పనులు పూర్తికావాలన్నా రెండేళ్లు పట్టే అవకాశం ఉంది. గతంలో ఇనుము, సిమెంటుతో తయారుచేసిన సెగ్మెంట్లను ఎప్పటికప్పుడు టీబీఎంతో లైనింగు చేసేవారు. ప్రస్తుతం మాన్యువల్‌గా బాంబులతో పేల్చి సొరంగాలను తవ్వారు. లైనింగ్ చేయకుండా నీళ్లు ఇచ్చే అవకాశం లేదని ఇంజనీరింగ్ అధికారులే చెబుతున్నారు. ఇన్ని పెండింగు పనులున్నా సీఎం ప్రారంభానికి సిద్ధం కావడం జనాన్ని మోసం చేయడమేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.


కటకానిపల్లె వద్ద ఫీడర్ కెనాల్‌కు పడ్డ గండి (ఫైల్)


వెలిగొండపై జగన్ హామీలు ఇవీ..

- **2021 అక్టోబరు 7న ఒంగోలులో :** వెలిగొండ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే విధంగా అడుగులు వేస్తున్నాం. మొదటి టన్నెల్‌ను 2022 ఆగస్టు నాటికి పూర్తి చేసి దాని ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తాం. 2023 ఫిబ్రవరి నాటికి రెండో టన్నెల్‌ను కూడా పూర్తి చేసి 9000 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టుకు అందిస్తాం.
- **2022 ఆగస్టు 23న చీమకుర్తిలో :** 2023 సెప్టెంబరు నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తాం. నీళ్లిచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళతాం.
- **2023 ఏప్రిల్ 12న మార్కాపురంలో :** వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన మొదటి టన్నెల్ తవ్వకం ఇప్పటికే పూర్తయింది. రెండో టన్నెల్‌ను సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి పూర్తిచేస్తాం. మళ్లీ జిల్లాకు వచ్చి వెలిగొండకు నీటిని విడుదల చేస్తాం.
- **2023 సెప్టెంబరు 20న నంద్యాల జిల్లా లక్షవరంలో :** ఈ ఏడాది అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నాం.
- 2024 మార్చి 6న ప్రాజెక్ట్ పూర్తికాకుండానే జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారు.

సుంకేసుల డ్యాం పరిధిలో..,

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస చర్యలు 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సుంకేసుల డ్యాం ముంపు గ్రామాలైన కలనూతల, చింతలముడిపి నిర్వాసితులకు ఇడుపూరు-1లో 951, ఇడుపూరు-2లో 386 మందికి నివేశన స్థల పట్టాలు మంజూరు చేశారు. కానీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించలేదు. వీరికి సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినప్పటికీ స్పందన కరువైంది. ముంపుగ్రామమైన సుంకేసుల నిర్వాసితుల్లో తోకపల్లిలో 310 మందికి, గోగులదిన్నెలో 1,193 మందికి నివేశన స్థల పట్టాలు మంజూరు చేశారు. కానీ మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది. అదే డ్యాం పరిధిలోని గుండంచర్ల, కాటంరాజుతాండ నిర్వాసితులకు దేవరాజుగట్టు వద్ద పునరావాస కాలనీ ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. మౌలిక వసతుల కల్పన పనులు ప్రారంభం కాలేదు. గుండంచెర్లలో 1,210 మంది నిర్వాసితులకుగాను ఆర్‌అండ్‌ఆర్ కింద 634 మంది, వన్‌టైం సెటిల్మెంట్ కింద 576 మంది ఉన్నారు. కాటంరాజుతండాలో ఆర్‌అండ్‌ఆర్ కింద 19 మంది, వన్‌టైం సెటిల్మెంట్ కింద 24 మంది ఉన్నారు. ఇందుకు సంబంధించి తదుపరి చర్యల నిమిత్తం కిందిస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా కదలిక లేదు.

ప్రతిపాదనలకే పరిమితమైన పరిహారం


ముంపు గ్రామం గొట్టిపడియ

కాకర్ల డ్యాం పరిధిలో..,

అర్ధవీడు మండలం కాకర్ల డ్యాం పరిధిలోని సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం, కృష్ణానగర్, లక్ష్మీపురంలలో 341 మంది నిర్వాసితులున్నారు. వీరికి బేస్తవారపేట మండలం ఒందుట్ల వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నత స్థాయి అధికారులకు ప్రతిపాదనలు వెళ్లినా నిధులు ఎప్పుడు విడుదలవుతాయో అర్థంకాని పరిస్థితి ఉంది.

గొట్టిపడియ డ్యాం పరిధిలో...

గొట్టిపడియ డ్యాం ముంపు గ్రామాలైన గొట్టిపడియ, అక్కచెరువుతండా నిర్వాసితులకు మార్కాపురం మండలం వేములకోట సమీపంలో 83.54 ఎకరాల భూమిని పునరావాస కాలనీకి ఎంపిక చేశారు. గొట్టిపడియలో 735 మంది, అక్కచెరువులో 86 మంది నిర్వాసితులుగా గుర్తించారు. అయితే బేదాభిప్రాయాల కారణంగా అక్కడ స్థలాలు తీసుకునేందుకు లబ్ధిదారులు మొగ్గు చూపలేదు. దీంతో నేటికీ పట్టాలు తయారు చేయలేదు. పునరావాస కాలనీలో మౌలిక వసతులు పూర్తికాలేదు.

రోడ్డున పడుతున్న సర్పంచ్‌లు

- ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకోకుండా ఆంక్షలు
- ఇప్పటికే భారీగా దారిమళ్లింపు
- సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ అదే పరిస్థితి
- నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం వెనుకాడటం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఏమైనా మాకేంటి అన్న విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంతో పంచాయతీ పాలకవర్గాలు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రోడ్డు మీదకు రావాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ నిధులను రాత్రికి రాత్రే దారిమళ్లించింది. ప్రస్తుతం కూడా అదే విధానాలను అవలంబిస్తుండటంతో సర్పంచ్‌లు మళ్లీ ఆందోళన బాట పడుతున్నారు. ఇప్పటికే కేంద్రం మంజూరు చేసిన ఆర్థికసంఘం నిధులు సుమారు రూ.8,629 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించింది. అందులో మన జిల్లాలో కూడా సుమారు రూ.450 కోట్లకుపైగా ఉన్నాయి. తాజాగా కేంద్రప్రభుత్వం రెండు నెలల క్రితం 15వ ఆర్థికసంఘం నిధులను సుమారు రూ.40కోట్లు మంజూరుచేయగా, వివిధ పన్నుల రూపంలో మరో ఏడెనిమిది కోట్లు పంచాయతీ అకౌంట్లకు చేరాయి. ఆ నిధులను కూడా రాష్ట్రం ప్రభుత్వం దారిమళ్లించేందుకు ప్రయత్నం చేయడంతో పాలకవర్గాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం అవేమీ పట్టించుకోలేదు. ప్రస్తుతం కూడా పంచాయతీ నిధులను విద్యుత్ బకాయిలు, కార్మికుల జీతాల పేరుతో దారిమళ్లించేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో చేసేదేమీ లేక పంచాయతీ సర్పంచ్‌లు మరోసారి ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పంచాయతీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు.






ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

58 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 5 : జిల్లాలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజల అవసరాలను తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా 58 ఆవాసాలకు నీటిని అందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో నీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, ఏఈఈలు, ఏఈలు ఇచ్చిన నివేదికల ఆధారంగా నీటి సరఫరా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కరెంటోళ్లపై రైతుల కన్నెర్ర

- శంకరాపురం సబ్‌స్టేషన్ ముట్టడి

ముండ్లమూరు, మార్చి 5 : వ్యవసాయ విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయడం లేదంటూ రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. మంగళవారం రాత్రి మండలంలోని శంకరాపురం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ త్రీఫేజ్‌లో ఇవ్వకపోవడంతో మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం వ్యవసాయానికి కేవలం గంట మాత్రమే ఇవ్వడంపై నిరసన తెలిపారు. వ్యవసాయానికి బుధవారం నుంచి నిరంతరం తొమ్మిది గంటలపాటు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేదరమెట్ల రామాంజనేయులు, జాస్తి చిన్నా, గంగినేని సత్యం, పోలవరపు నాగేశ్వరరావు మరో 30 మంది రైతులు పాల్గొన్నారు.


సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు



అట్టహాసంగా సత్య జన్మదినోత్సవం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ (సత్య) జన్మదిన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఒంగోలులోని ఆయన స్వగృహం వద్ద, మధ్యాహ్నం నుంచి కొండపి నియోజకవర్గంలో కోలాహలం నెలకొంది. సింగరాయకొండలో ఏర్పాటు చేసిన వేడుకలకు భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పలువురు రాష్ట్ర, జిల్లా నేతలు హాజరై సత్యకు శుభాకాంక్షలు చెప్పారు. వేలాది మంది తెలుగు తమ్ముళ్ల సమక్షంలో సత్య కేక్‌ను కట్ చేశారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, వేదికపై టీడీపీ నాయకులు

బటన్ నొక్కాడని నమ్మితే రాష్ట్రం అధోగతిపాలే..!

- వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలు, బీసీలు, మైనారిటీలపై దాడులు
- శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

లోపలి పేజీల్లో..

రైతుబంద్

అమలుకు నోచని పథకం

- ఐదేళ్లుగా కర్షకులకు మొండిచేయి
- మార్కెట్ యార్డులో సోకులకు లక్షలు ఖర్చు
- విస్మయం వ్యక్తం చేస్తున్న రైతులు

దర్శి, మార్చి 5 : రైతుబంధు అన్నదాతలకు అందడం లేదు. అసలు వారు ఆ పథకం ఉందన్న విషయాన్నే మరిచిపోయేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీలు సెస్ వసూళ్లకు తప్ప వారికి ఏమాత్రం ఉపయోగపడే పనులు చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. ఆదాయం పెంచుకోవడంపై ఉన్న యావ రైతుల సంక్షేమంపై లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఈ ఐదేళ్ల నుంచి రైతుబంధు పథకాన్ని అటకెక్కించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతా మూలకే..

దర్శి మార్కెట్ యార్డులో కోట్లాది రూపాయల నిధులు ఉన్నప్పటికీ రైతుల అవసరాలకు వినియోగించే వీలులేదు. ప్రభుత్వం ఫ్రీజింగ్ పెట్టడంతో జీతాలకు కూడా ఉన్నతాధికారుల అనుమతులతో తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రైతులు పండించిన ధాన్యాన్ని గోడౌన్‌లో నిల్వ చేసుకొని రైతుబంధు పథకం కింద వడ్డీలేని రుణాలు పొందేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాగానే విక్రయించుకునేవారు. ఇలా ఆరు నెలల పాటు వడ్డీ లేకుండా రుణాలు వాడుకునే వెసులుబాటు టీడీపీ ప్రభుత్వంలో ఉండేది. దీనివల్ల ఎంతోమంది రైతులు లబ్ధిపొందారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుబంధు పథకం పూర్తిగా మూలనపడింది. గత ఐదేళ్లుగా ఒక్కరికి కూడా ఈ పథకం అమలు కాలేదు. మార్కెట్ కమిటీలో రూ.4.66 కోట్ల నిధులున్నా వాడే వీలులేదు. సీఎంఎఫ్ఎస్ ద్వారా ఉన్నతాధికారుల అనుమతులతో ఏ పనులైనా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

దాదాపు ఖాళీగానే గోడౌన్లు

రైతుబంధు అమలులో లేకపోవటంతో అధికశాతం మంది రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ముందుకురావడం లేదు. కేవలం 100 మందికి చెందిన 11,858 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉంది. రైతులు గిడ్డంగిలో పంటలను నిల్వ ఉంచుకునేందుకు అద్దె చెల్లించాల్సి ఉంది. రైతుబంధు పథకం కింద వడ్డీలు లేని రుణాలు ఇవ్వకపోవటం వలన ప్రయోజనం చేకూరకపోగా అదనంగా అద్దె చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ పాలకుల తీరుపట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

యార్డులో అతిథిగృహానికి రూ.లక్షల ఖర్చు

దర్శి మార్కెట్ యార్డులో అతిథి గృహ నిర్మాణానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పరిపాలన భవనంపైన అతిథి గృహం ఉంది. ప్రస్తుతం దానిని విస్తరించి సకల సదుపాయాలతో నిర్మిస్తున్నారు. ఇందుకుగాను రూ.24.50 లక్షలు ఖర్చుచేస్తున్నారు. రైతుల ప్రయోజనం కోసం ఎలాంటి పనులు చేపట్టకుండా పాలకుల విలాసాలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుండటంపై అన్నదాతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన పంట ద్వారా వసూలు చేసిన సొమ్ము మార్కెట్ కమిటీ చేరుతుంది. ఆ నిధులు మళ్లీ రైతు ప్రయోజనాలకే ఖర్చుచేయాల్సి ఉండగా వైసీపీ పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం శోచనీయమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న అతిథి గృహం


దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ

బటన్ నొక్కాడని మోసపోతే రాష్ట్రం అధోగతే..!

- టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం
- వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలు, బీసీలు, మైనారిటీలపై దాడులు
- శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్
- ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వాతంత్ర్య సమరయోధుల్లా పోరాడాలని పిలుపు

సింగరాయకొండ, మార్చి 5 : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బటన్ నొక్కుతున్నారని ప్రజలు మోసపోయి ఆదమరిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని శాసనమండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు మహ్మద్ షరీఫ్ అన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక దేవి సీఫుడ్స్ ఎదురుగా ఉన్న ఆవరణలో మంగళవారం నిర్వహించిన టీడీపీ కొండపి నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్యం కోసం సమరయోధులు ఏవిధంగా పోరాటం చేశారో.. అదేస్ఫూర్తితో ముందుకుసాగి దుర్మార్గపు వైసీపీను గద్దెదించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 1983కు ముందు ఎటువంటి పరిస్థితులు ఉన్నాయో ఇప్పుడు కూడా అవే పరిస్థితులు ఉన్నాయని షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సంక్షేమం ఉండేవి కాదన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖపు నిర్ణయాలతో అదే పరిస్థితిలోకి నేడు రాష్ట్రాన్ని నెట్టివేశారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నా ఎస్సీలు. నా బీసీలు, నా మైనారిటీలంటూ వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మైనారిటీల అభివృద్ధికి రూ.3వేల కోట్లు ఖర్చుచేస్తే ఈప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం 45 రోజులపాటు అకుంఠిత దీక్షతో టీడీపీ శ్రేణులు పనిచేయాలని తెలిపారు.

దళిత ద్రోహి జగన్‌రెడ్డి : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల

దళితుల ఓట్లతో గద్దెనెక్కి అధికారంలోకి వచ్చిన తరువాత వారిని దగా చేసిన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. దళితులకు మేనమామనని కల్లబొల్లిమాటలు చెప్పి కంసమామగా మరారని ఆయన ధ్వజమెత్తారు. మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపేశారన్నారు. ఇసుక అక్రమ రావాణాను ప్రశ్నిస్తే దళితుడైన వరప్రసాద్‌కు శిరోముండనం చేయించారని



స్వామి, సత్యతో కలిసి అభివాదం చేస్తున్న రామయ్య

ఆవేదన వ్యక్తం చేశారు. చీరాలలో మాస్కు పెట్టుకోలేదని కిరణ్ అనే యువకుడిపై అతిక్రూరంగా దాడిచేశారన్నారు. దళితకాలనీల్లో ఆడబిడ్డలపై అఘాత్యాలకు పాల్పడుతూ వారి జీవితాలను కాలరాస్తున్నారని రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ దొంగల పార్టీ అని దానికి ఓటు వేయవద్దని దళితులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో కృష్ణుడిలా దామచర్ల సత్య ఎన్నికల రథాన్ని తోలుతుంటే, అర్జునిడిలా స్వామి ప్రత్యర్థులపై బాణాలు సంధించి విజయ బావుటా ఎగురవేస్తారని జోస్యం చెప్పారు.

జగన్ చంపింది రెడ్లనే : ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి

వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగన్‌రెడ్డి రాష్ట్రంలో అధికంగా చంపింది రెడ్లనేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. రెడ్లపై ఉక్కుపాదం మోపి, ఊచకోత కోసి వారి రక్తపు ఏరులపై రాజకీయ సౌధాన్ని నిర్మించుకున్న నరరూప రాక్షసుడు జగన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతారని, వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఎర్రచందనం స్మగ్లర్, తుడా నిధులను దోచుకున్న దుర్మార్గుడు, టీటీడీ టికెట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్న నీచుడైన చెవిరెడ్డిని ప్రశాంతంగా ఉండే ప్రకాశం జిల్లా నుంచి తరిమికొట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే స్థానికేతరుడైన సురేష్‌ను కాకుండా నియోజకవర్గ ప్రజల సాదక బాధలు తెలిసిన స్థానికుడైన స్వామిని గెలిపించాలని కోరారు.

కుల, మత రాజకీయాలు కొండపిలో చెల్లవు : ఎమ్మెల్యే స్వామి

ఎన్నికల సమయంలో వలసవచ్చి కొండపి నియోజకవర్గంలో మంత్రి సురేష్ చేస్తున్న కుల, మత రాజకీయాలు ఇక్కడ చెల్లవని ఎమ్మెల్యే స్వామి అన్నారు. గత ఎన్నికల్లో గెలిపించిన యర్రగొండపాలెం ప్రజలను గాలికొదిలేసి ఇక్కడికి వచ్చి రెండు నెలల్లో అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ఐదేళ్లు మంత్రిగా వెలగబెట్టి ఏంసాధించావని స్వామి ప్రశ్నించారు. రూ.40 కోట్ల అవినీతి కేసులు కోర్టు నుంచి స్టేలు తీసుకొని తిరుగుతున్న నీవు ఏదో రోజు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రజలను మభ్యపెట్టడానికి సీఎం జగన్ ప్రారంభోత్సవం చేస్తున్నారని స్వామి మండిపడ్డారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిసి ముందుగా తన పేరుతో శిలాఫలకం వేసుకోవడానికి జగన్ వస్తున్నారని ఎద్దేవా చేశారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : దామచర్ల సత్య

కొండపి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో టీడీపీని ఎదుర్కొనేందుకు వైసీపీ ఇప్పటికే నలుగురు అభ్యర్థులను మార్చిందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అన్నింటికీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని సత్య తెలిపారు.

వచ్చే 45 రోజులు అప్రమత్తంగా ఉండాలి : ఉగ్ర నరసింహారెడ్డి

టీడీపీ శ్రేణులు వచ్చే 45 రోజులు అప్రమత్తంగా ఉండాలని కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. ఓటమి తప్పదని భావించిన వైసీపీ నేతలు దొంగ ఓట్లను చేరుస్తున్నారన్నారు. వాటిని బూత్ స్థాయిలో గుర్తించాలన్నారు. వైసీపీ నాయకులు ఓటమి భయంలో ఇప్పుడే జిల్లాలోని గనులను లీజుకు రాయించుకుంటున్నారని మండిపడ్డారు.

ఓటమి భయంతోనే నేతల బదిలీలు : బీఎన్

వైసీపీ ఓటమి భయంతోనే వేమూరు నుంచి మంత్రి మేరుగు నాగార్జునను సంతనూతలపాడుకు, యర్రగొండపాలెం నుంచి సురేష్‌ను కొండపికి బదిలీ చేసిందని టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆనియోజకవర్గాలలో చెల్లని వారు ఇక్కడ ఎలా చెల్లుతారని ఆయన ప్రశ్నించారు. ఏళ్ల తరబడి స్థానికంగా రాజకీయం చేసే తమను ప్రజలు ఆశీర్వదించాలన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు, గిఫ్టలను అందజేస్తున్న బాలినేని దంపతులు

మోడల్ టౌన్‌షిప్‌గా మార్చుతాం

వచ్చే ఎన్నికల్లో గెలిపించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆ ప్రాంతాలను మోడల్ టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని పలు సచివాలయాల్లో మంగళవారం ప్రభుత్వ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల పత్రాలతో పాటు గిఫ్ట్ ప్యాకెట్లను బాలినేని ఆయన సతీమణి శచీదేవితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే మనస్తత్వం తనదన్నారు. పేదలకు ఇంటి స్థలాలు ఇస్తేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పానన్నారు. పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలపై తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే జనార్దన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ప్రచారంపై పరువునష్టం దావా వేస్తా

తాను చెవిరెడ్డిని ఓడించేందుకు కుట్ర చేస్తున్నానంటూ కరపత్రాలను ముద్రించి అసత్య ప్రచారాలు చేయడంపై ఎమ్మెల్యే బాలినేని మండిపడ్డారు. దీనిపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు బాలినేని తెలిపారు. ఒంగోలులో మంగళవారం జరిగిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు, గిఫ్ట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డికి, తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

మహిళా సాధికారతే ధ్యేయం



మాట్లాడుతున్న సునీత

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని శాసన మండలి సభ్యులు, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసీపీ మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి అధ్యక్షత వహించారు. ఈసమావేశంలో ముఖ్యఅతిథిగా సునీత మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ప్రధానంగా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశాలకే పరిమితం కాకుండా నియోజకవర్గ, మండల స్థాయిలో కూడా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, మహిళా విభాగం ప్రతినిధులు కంది ప్రమీలారెడ్డి, చింతగుంట్ల సువర్ణ, తమ్మినేని సుజాత, బైరెడ్డి అరుణ, నక్కల లీలాకుమారి ఉన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి



ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఒంగోలు (రూరల్), మార్చి 5 : టెన్త్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని త్రోవగుంట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ ఎం.చల్లా బ్రహ్మయ్య సూచించారు. ఒంగోలు నగరం త్రోవగుంటలోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ప్రతిరోజూ నెమరు వేసుకోవాలన్నారు. సబ్జెక్టులవారీగా క్షుణ్ణంగా చదువుకోవాలన్నారు. టెన్త్‌లో వచ్చే మార్కులు భవిష్యత్ చదువులకు ప్రాముఖ్యత ఉంటుందన్నారు. మార్కులు బాగా వస్తే కొన్ని ఉద్యోగాలు కూడా పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

10వ తరగతి హాల్ టికెట్లు సిద్ధం

ఒంగోలు(విద్య), మార్చి 5 : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని పరీక్షల డైరెక్టర్ డీ దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న పరీక్షల కు పాఠశాలల హెచ్ఎంలు స్కూలు లాగిన్ ద్వారా వెబ్‌సైట్ నుంచి హాల్ టి కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు స్ట్రీమ్, జిల్లా, పాఠశాల పేరు, వి ద్యార్థి పేరు, పుట్టిన తేదీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

మహిళా సంక్షేమంపై టీడీపీ ప్రత్యేక దృష్టి

- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్
- టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 5 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీడీపీ ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరంలోని 3వ డివిజన్‌కు చెందిన వైసీపీ సానుభూతిపరులు షేక్ సుల్తాన్, షేక్‌హాజీ, గుల్జార్, సబీరా మరో ఇరవై కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దామచర్ల వారికి పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని అన్నారు. మహిళల కోసం మహానాడులో స్త్రీ శక్తి పేరుతో ప్రత్యేక పథకాలు అందించే విధంగా మ్యానిఫెస్టోలో చేర్చారని అన్నారు. గతంలో ఒంగోలు నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించి ఎమ్మెల్యేగా చేశారని, మరో అవకాశం ఇచ్చి తనను గెలిపిస్తే ఒంగోలు నగరాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దుతానని దామచర్ల తెలిపారు.



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనార్దన్

ఈ కార్యక్రమంలో పలువురు నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ ఒఖాన్, బూత్ ఇన్‌చార్జి కోమటినేని పద్మావతి, అమ్ముల్లా, పలువురు పాల్గొన్నారు.

ఐ టీడీపీ నూతన కమిటీ నియామకం

తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఐ టీడీపీ నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల మంగళవారం నియమించారు. ఒంగోలు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన యువతకు కమిటీలో అవకాశం కల్పించారు. నియోజకవర్గ అధ్యక్షులుగా మన్నెపల్లి హరికృష్ణ, నగర అధ్యక్షులుగా సిఖాకొల్లి సత్యనారాయణ, రూరల్ అధ్యక్షులుగా పోకూరి సోమసుందరం, కొత్తపట్నం మండల అధ్యక్షులుగా వాయల మల్లికార్జున్ నియమించారు.

ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ రా బోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపులో ఐ టీడీపీ విభాగం చురుగ్గా పనిచేయాలని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా కష్టపడాలని సూచించారు.

నైపుణ్య శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : నైపుణ్య శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని కలెక్టర్ దినేస్‌కుమార్ అన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను మంగళవారం ముఖ్యమంత్రి విశాఖపట్నం నుంచి ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఐటీఐ బాలుర, బాలికల కళాశాల ప్రాంగణంలో నిర్మించిన శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌డీఈ ఏడీ శ్రీను, హెచ్‌ఆర్‌అండ్ ఎంఐఎస్ఈ శ్రీనివాసాచారి, ప్లేస్‌మెంట్ అధికారి ఈజ్ బాషా, నాన్ టెక్నికల్ ఆఫీసర్ సాయి ప్రణీత్, కో ఆర్డినేటర్లు అనూష, విద్యాసాగర్, రెహమాన్, రమేష్ నాగేశ్వరరావు, ప్రభుత్వ బాలుర, బాలికల ప్రిన్సిపాల్స్ పీ భాస్కర్‌బాబు, ఉమామహేశ్వరదేవి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న రాఘవరెడ్డి

వివిధ వర్గాలతో రాఘవరెడ్డి మమేకం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు, యువపారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి వివిధ వర్గాల ప్రజలతో మమేకమవుతున్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం రాఘవరెడ్డి ఒంగోలులోని తన కార్యాలయంలో మకాం వేసి వివిధ వర్గాల ప్రజలను కలుస్తున్నారు. ఒంగోలులో మంగళవారం రాఘవరెడ్డి వివిధ వర్గాల ప్రజలను కలిసి మాట్లాడారు. మంగమూరు రోడ్డులో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో భేటీ అయ్యారు. వారితో పలు అంశాలపై చర్చించారు. అనంతరం పలు కూడళ్లలో వివిధ వర్గాల ప్రజలను కలిసి టీ తాగుతూ సరదాగా గడిపారు. రాఘవరెడ్డి వెంట పలువురు మాగుంట అభిమానులు ఉన్నారు.

నాయకులను కలిసిన రాఘవరెడ్డి

కొండపి : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి మంగళవారం రింగ్‌రోడ్డులో పర్యటించారు. కొండపి, జరుగుమల్లి మండలాల్లో తమ కుటుంబంతో పరిచయం ఉన్న వివిధ పార్టీల నాయకులను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు సంపూర్ణ సహకారాలు అందించాలని ఆయన అభ్యర్థించినట్లు సమాచారం.

పొగాకు గరిష్ఠ ధర రూ.230

సంతనూతలపాడు, మార్చి 5: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం అమ్మకాలకు చీమకుర్తి నుంచి 371 పొగాకు బేళ్లు రాగా, 346 బేళ్లు అమ్ముడుకాగా, 25 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.230 పలకగా, కనిష్ఠ ధర రూ.208 ఉండగా, సరాసరి ధర రూ.229.94 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో 16 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ఆటల పోటీలు ప్రారంభం

ఒంగోలు(విద్య), మార్చి 5 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయంలో మహిళా అధ్యాపకులు, అధ్యాపకేతరులకు, బాలికలకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఏకేయూ వైస్ చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఎంతగానో పెంచుతాయన్నారు. వ్యక్తిలోని ఒత్తిడిని కూడా తగ్గించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం మ్యూజికల్ చైర్, షాట్‌పుట్, లెమన్ అండ్ స్పూన్, టెన్నికాయిట్ వంటి ఆటలను నిర్వహించారు. బాలికలకు పాటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈనెల 7న జరిగే మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ బీ హరిబాబు, ప్రిన్సిపాల్ జీ రాజమోహన్, డాక్టర్ అంచుల భారతిదేవి, డాక్టర్ నిర్మలామణి, డాక్టర్ఐ దేవీ వరప్రసాద్ ఉన్నారు.

8న మెగా వైద్య శిబిరం

మార్టూరు, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనె ల 8న మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా మహిళా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యా లయం ప్రతి నిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరి నాగే శ్వరరావు జ్ఞాప కార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిటెక్ లిమిటెడ్ సంయుక్తంగా విజయవాడకు చెందిన సెంటినీ, హెచ్‌సీజీ హాస్పిటల్ సహకా రంతో ఎమ్మెల్యే సాం బశివరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. మార్టూరు ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిజిటల్ చెల్లింపులపై విద్యార్థులకు అవగాహన

సంతనూతలపాడు, మార్చి 5: విద్యార్థులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన ఉండాలని ఆర్‌బీఐ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలో ని మైనంపాడు జడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏటీఎం వాడేటప్పుడు తీసుకోవాలిసిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ నరసింహారావు, డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

సూర్య నమస్కారాలతో సంకల్ప బలం

జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర

ఒంగోలు(కల్చరల్), మార్చి 5 : సూర్య నమస్కారాల సాధన ద్వారా విద్యార్థులలో సంకల్ప బలం పెరిగి వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహా సూర్య వందనం కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. హెచ్‌సీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో సుభద్ర మాట్లాడుతూ సూర్య నమస్కారాలు శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక శక్తిని కూడా ఇస్తాయని, నిరంతరం వాటి సాధన వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత్ టాలెంట్ వరల్డ్ రికార్డ్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం త్రోవగుంట, ఉలిచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఇంగ్లీష్ పరీక్షకు 918 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 5 : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన సీనియర్ ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు 918 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు మొత్తం 19027 మంది హాజరు కావాల్సి ఉండగా 18109 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 16456 మందికి గాను 15854 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2571 మంది 2255 మంది హాజరైనట్లు ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. అధికారులు మొత్తం 56 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు సైమన్ విక్టర్ తెలిపారు.

1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్ట ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో 1వ తరగ తిలో ప్రవేశానికి మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో పేదలు, అనాథలు, దివ్యాంగులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెం దిన విద్యార్థులు 25శాతం సీట్లు కేటాయించారు. జిల్లాలో మొత్తం 360 ప్రై వేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. ఒంగోలు నగరంలో అత్యధికంగా 81 పాఠశాలల్లో సీట్లు కేటాయిస్తారు. ఈ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. ఈనెల 25లోపు ఆశక్తిగల విద్యార్థు లు దరఖాస్తులు చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, నెట్ సెంటర్లు, మీసేవా కేంద్రాలు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సుభద్ర కోరారు.

ఎంఈవో కార్యాలయానికి కుర్చీల బహూకరణ



కుర్చీలను అందజేస్తున్న హనుమంతరావు

సంతనూతలపాడు, మార్చి 5: ఎంఈవో కార్యాలయానికి క్రిష్ణసాయి గ్రానైట్స్ అధినేత శిద్దా హనుమంతరావు రూ.30వేల విలువచేసే ప్లాస్టిక్ కుర్చీలను మంగళవారం ఎంఈవో వెంకారెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా మంతరావును హెచ్ఎం పి.రామారావు, ఉపాధ్యాయులు, జడ్పీటీసీ డి.రమణమ్మ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ రానున్న పదవతరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన వారికి నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు వీ నాగేంద్రప్రసాద్, వీవీ శేషారావు, చంద్రావతి, రాము పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను పరిశీలించాలి



సమావేశంలో పాల్గొన్న ఈఆర్వో కుమార్, తహసీల్దార్లు

కొండపి, మార్చి 5 : నియోజకవర్గంలో అర్హత ఉన్న కొత్త ఓటర్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్‌లను కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశానికి ప్రధాన పార్టీల నాయకులు ఎవరూ హాజరు కాలేదు. హాజరైన ఇతర పార్టీల నాయకులు మాట్లాడుతూ గతంలో చేసిన తీర్మానాలపై తీసుకున్న చర్యలు ఏమిటో తమకు చెప్పడం లేదని, అలాంటప్పుడు సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో తహసీల్దార్లు బి.కిరణ్‌కుమార్, సుధాకర్, పీఆర్ ఏఈ బి.ప్రసాదరావు, ఎన్నికల సిబ్బంది, డీటీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

చీరాల, మార్చి 5: జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, అందులో భాగంగా చీరాల సీటు చేనేతలకు కేటాయించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని ఈపురుపాలెంలో మంగళవారం జరిగిన ఐక్యవేదిక సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు అండగుండ నారాయణ, మునగాల గిరిధర్, గోలి శివయ్య, మునగపాటి నాగ మల్లేశ్వరరావు, పంచల శ్రీనివాసరావు, మాగం మురళి పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి

సంతమాగులూరు, మార్చి 5: ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని పీడీ బి.అర్జునరావు తెలిపారు. మంగళవారం మండలంలోని వెల్లలచెరువు పంచాయతీలో పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామి కూలీలం దరికి కనీస వేతనం రూ.272 పడేవిధంగా పనిచేయాలని అన్నారు. అనంత రం సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులపై సమీక్షించారు.

నారీశక్తి వందన్‌యాత్ర ర్యాలీ

అద్దంకి, మార్చి 5: నారీ శక్తి వందన్‌యాత్ర ర్యాలీని మంగళవారం అద్దంకి పట్ట ణంలో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో కేంద్రంలో బీజేపీ ప్రభు త్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నారిశక్తి వంద న్ జిల్లా ఇన్‌చార్జ్ సాధినేని, బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ పులి వెంకట కృష్ణారెడ్డి, యార్లగ డ్డ లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రావిపాటి కాశీదేవి, రామకృ ష్ణ, కాలేషాబాబు, విరాట్, శ్రీనివాసరావు, విష్ణువర్ధన్, వెంకటేశ్వర్లు, భావనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కదిలొచ్చిన కొండపి.!

- అట్టహాసంగా దామచర్ల సత్య జన్మదిన వేడుకలు
- భారీగా పాల్గొన్న టీడీపీ, జనసేన శ్రేణులు
- ఒంగోలు నుంచి సింగరాయకొండకు 5 గంటల సమయం
- అడుగడుగునా జననీరాజనం


భారీ గజమాలను సత్యను సత్కరిస్తున్న నాయకులు



సత్యను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, పెట్లూరులో కేక్ కట్ చేస్తున్న సత్య, పక్కన ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, మార్చి 5 : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య జన్మదిన వేడుకలు సింగరాయకొండలో మంగళవారం అట్టహాసంగా జరిగాయి. వేదిక అయిన స్థానిక దేవీ సీఫుడ్స్ ఎదురు ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కదిలొచ్చారు. వీరితోపాటు భారీ సంఖ్యలో జనసైనికులు హాజరయ్యారు. తొలుత ఒంగోలులోని తన నివాసం నుంచి బయల్దేరిన సత్య వల్లూరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయుడుపాలెం, టంగుటూరులో ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగరాయకొండ జాతీయ రహదారి వద్ద నుంచి భారీ జనసందోహంతో ర్యాలీగా అభివాదం చేసుకుంటూ సత్య ముందుకు సాగారు. బాలయోగినగర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కందుకూరు రోడ్డు కూడలిలోని జనసేన కార్యాలయంలో ఆపార్టీ నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేశారు. ఈసందర్భంగా సత్య మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పార్టీ జెండాలు పక్కనబెట్టి రాష్ట్ర అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్నారన్నారు. వారిస్ఫూర్తితో టీడీపీ, జనసేన నేతలు కలిసి వైసీపీపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కందుకూరు రోడ్డుకూడలిలోని ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు ఎమ్మెల్యే స్వామి, సత్య పూలమాలలు చేసి నివాళులర్పించారు. ర్యాలీగా వెళ్తున్న సత్యకు పలుచోట్ల క్రేన్‌సహాయంతో టీడీపీ నేతలు భారీ గజమాలలు వేసి సత్కరించారు. ఒంగోలు నుంచి ఉదయం 9 గంటలకు సత్య బయల్దేరితే సింగరాయకొండ సభాప్రాంగణానికి వచ్చే సరికి మధ్యాహ్నం 2 గంటలైంది. దారి పొడవునా టీడీపీ శ్రేణులు అడుగడుగునా స్వాగతం పలకడంతో 35 కి.మీ దూరానికి ఐదు గంటల సమయం పట్టింది. స్థానికంగా ఏర్పాటు చేసిన కొండపి నియోజకవర్గ ఆత్మీయసమావేశం అనంతరం టీడీపీ రాష్ట్ర నాయకులు షేక్ షరీఫ్, వర్ల రామయ్య, భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే స్వామి, మాజీ ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్ సమక్షంలో సత్య భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం మూలగుంటపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ వైపాలెం, కందుకూరు ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పోకూరి రవీంద్రబాబు, కామినేని విజయ్‌కుమార్, యలమందనాయుడు, నరసారెడ్డి, అనుమోలు సాంబయ్య, టీడీపీ నేతలు షేక్ సందానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, నక్కా బ్రహ్మేశ్వరరావు, గాంధీచౌదరి, చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, మించల బ్రహ్మయ్య, చీమకుర్తి కృష్ణ, నర్రా రాంబాబు, పాకల సర్పంచ్ చంద్రశేఖర్, పులి ప్రసాద్, భైరపనేని మోహన్‌రావు, సుదర్శి చంటి, వేల్పుల వెంకట్రావు, అజీం, సుభాన్, యస్థాని, సనావుల్లా, గౌస్, శేషారావు, ఆరు మండలాలల్లో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ (సత్య) పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తొలుత ఆయన వల్లూరమ్మ అలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ప్రాంగణంలోనే కేక్‌కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. అక్కడికి పలువురు టీడీపీ నాయకులు చేరుకొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సూరారెడ్డిపాలెం చేరుకొని అక్కడ రైల్వే గేటు మార్గంలోని రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సత్య పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ కేక్ కట్ చేసిన అనంతరం బయల్దేరి తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెం చేరుకున్నారు. ఎస్సీ కాలనీ ద్వారంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, చెరువు ఒడ్డునున్న ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ కార్యక్రమం ముగించుకొని టంగుటూరు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అక్కడ కేక్ కట్ చేసి నేరుగా స్థానిక అంగాళ పరమేశ్వరి అమ్మవారి గుడికి చేరుకున్నారు. గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ మండల నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, మక్కెన వెంకట్రావు, కొమ్మినేని వెంకట్రావు, బొజ్జా శ్రీనివాసరావు, కామని నాగశ్రీను, కొత్తపల్లి వెంకటేశ్వర్లు(గుణ), దూడల తిరుపతిస్వామి, ముత్తినేని హరిబాబు, కాకుమాని శ్రీకాంత్ ఉన్నారు. పుట్టిన రోజు వేడుకల కోసం సింగరాయకొండ చేరుకున్న సత్యకు సభావేదిక వద్ద మండలంలోని కొణిజేడు టీడీపీ నాయకులు దావులూరి వేణుగోపాల్, రామా నరేంద్ర ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. క్రేన్ సాయంతో సత్యకు వారు గజమాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు.




సత్యకు పూలమాలవేసి శుభాకాంక్షలు చెప్తున్న రామా గోపి, ప్రభాకర్..
సత్యకు గజమాలవేసి శుభాకాంక్షలు చెప్తున్న వేణుగోపాల్, దామా నరేంద్ర

పలువురు జన్మదిన శుభాకాంక్షలు

కొండపి : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ పుట్టినరోజు సందర్భంగా స్వగృహంలో ఉన్న ఆయన్ను పలువురు టీడీపీ నాయకులు మంగళవారం ఉదయం కలిసి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మరికొందరు సింగరాయకొండలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని సన్మానించారు. సత్యకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో పొన్నలూరు మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, జరుగుమల్లి మండల టీడీపీ నాయకులు ఏలూరి రాంబాబు, నాయకులు కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, బత్తిన పూర్ణ, టీడీపీ పొన్నలూరు మండల నాయకులు అనుమోలు సుధాకర్, పార్టీ కొండపి మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు తదితరులు ఉన్నారు. మండలంలోని పెట్లూరులో సత్య జన్మదిన వేడుకలను గ్రామ పార్టీ నాయకులు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్య, ఎమ్మెల్యే స్వామిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల నాయకుడు బత్తుల నారాయణస్వామి, నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, నన్నూరు సుబ్బరామయ్య, గ్రామ నాయకులు ఆరితోటి బాబూరావు, మూలే రామారావు, నరసింహం, కందిమళ్ల లక్ష్మీనారాయణ, బొల్లినేని రమణయ్య, వేముల మల్లికార్జున, తానికొండ అంజయ్య, గుజ్జుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తరలివెళ్లిన నాయకులు, శ్రేణులు

ఒంగోలు : తెలుగుదేశం పార్టీ యువనేత, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ(సత్య) జన్మదిన వేడుకలు మంగళవారం కోలాహలంగా జరిగాయి. ఒంగోలులోని సత్య నివాసంతో పాటు టంగుటూరు, సింగరాయకొండ, కొండపి మండలాల్లోని పలు చోట్ల శ్రేణులు, సత్య అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానులు, యువతతో భారీ ర్యాలీతో సింగరాయకొండకు బయలుదేరిన సత్య తొలుత వల్లూరమ్మ దేవాలయంలో పూజలు చేశారు. స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పించారు. నాయుడుపాలెం, టంగుటూరు, సింగరాయకొండ, కొండపి మండలాల్లోని పలు చోట్ల దేవాలయాల్లో పూజలు నిర్వహించి అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్‌లలో పాల్గొన్నారు. రాత్రి వరకు వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు కొనసాగాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, పలువురు పార్టీ రాష్ట్ర నేతలు ఫోన్ చేసి సత్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలోని న్యూయార్క్‌లోనూ తెలుగు తమ్ముళ్లు సత్య జన్మదిన వేడుకలు నిర్వహించారు.



ఆశల పల్లకిలో పొగాకు రైతులు

- ఊరిస్తున్న ధరలు
- పెరిగిన ఖర్చు
- నేటి నుంచి టంగుటూరులో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

టంగుటూరు, మార్చి 5 : పొగాకు రైతులను ధరలు ఊరిస్తున్నాయి. ఈ సీజన్‌లో కర్ణాటకలో మంచి ధరలు లభించడంతో ఇక్కడ కూడా అలాంటి పరిస్థితే ఉంటుందన్న ఆశాభావంతో ఉన్నారు. మండలంలో ఈ ఏడాది పొగాకు సాగుకు వాతావరణం అనుకూలించ లేదు. పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ఈనేపథ్యంలో బుధవారం నుంచి టంగుటూరులో పొగాకు వేలం ప్రారంభంకానుంది. దీంతో రైతులు ధరలపై నమ్మకంతో ముందుకు కదులుతున్నారు. బుధవారం చింతలపాలెం క్లస్టర్ పరిధిలోని చింతలపాలెం, దావగూడూరు గ్రామాల నుంచి 18 బేళ్లను అధికారులు అనుమతించ్చారు. రెండో రోజైన గురువారం అవే గ్రామాల నుంచి 27 బేళ్లకు అనుమతిచ్చారు. ఈసీజన్‌లో టంగుటూరు వేలం కేంద్రం పరిధిలోని 27 గ్రామాలను 12 క్లస్టర్లుగా విభజించారు. వేలం కేంద్రం పరిధిలో 13,276.92 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగుకు బోర్డు అనుమతివ్వగా రైతులు 17,868 ఎకరాల్లో సాగు చేశారు. 9.92 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికిగాను 15.00 మిలియన్ కిలోలు పండించినట్లు అంచనా. గత సీజన్ (2022-23)లో టంగుటూరు వేలం కేంద్రంలో 13.88 మిలియన్ కిలోల పొగాకు అమ్మకం జరిగింది. సరాసరి ధర కిలోకు రూ.222 లభించింది. మొత్తం 123 రోజులు వేలం కొనసాగింది. ఈఏడాది అంతకుమించి ధర లభిస్తేనే రైతులు గట్టెక్కే పరిస్థితి కనిపిస్తోంది. వేలం ప్రారంభంకానున్న నేపథ్యంలో సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన పొగాకును వేలం కేంద్రంలోనే అమ్ముకోవాలన్నారు. బయట అమ్మకాలు సరికాదన్నారు. పొగాకు సూర బేళ్లు సైతం వేలం కేంద్రంలోనే కొనుగోలు చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. పొగాకు బేళ్లు శీతల గిడ్డంగుల్లో పెట్టుకునే వారంతా ముందుగా వేలం కేంద్రంలో అనుమతి తీసుకోవాలన్నారు. వాటిని బయటకు తీసేరోజు కూడా బోర్డు అనుమతి కావాల్సిందేనన్నారు.

షాదీఖానా ప్రారంభం


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 5 : ఒంగోలులోని ఊరచెరువులో నూతనంగా ప్రారంభించిన ముస్లిం షాదీఖానాను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి మంగళవా రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం వైసీపీ పనిచేస్తుందన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించామ న్నారు. నగరంలోని ముస్లింలకు షాదీఖానా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావ డం శుభపరిణామం అన్నారు. షాదీఖానా నిర్మాణంలో గతంలో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్, తాను ఎమ్మెల్యేగా నిధులు కేటాయించి, కృషి చేశామన్నారు. భవిష్యత్‌లో కూడా ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటామని తెలిపారు. వైసీపీ ఒం గోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి మాట్లాడుతూ నగరంలో ముస్లింల కోసం అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం. జశ్వంత్ రావు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ముడిరాయి లారీ బోల్తా.. పది గొర్రెలు మృతి

బల్లికురవ, మా ర్చి 5: మండలం లోని ఉప్పుమాగు లూరు ఉన్నత పాఠశాల ముందు గ్రానైట్ ముడిరా యి లారీ బ్రేక్‌లు ఫెయిలై గొర్రెల మందపైకి దూసు కెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది గొర్రెల వరకు అక్కడికక్కడే మృతి చెం దాయి. అందిన సమాచారం మేరకు.. సంతమాగులూరు మండలం గురిజేపల్లి నుం చి ఉప్పుమాగు లూరు గ్రామ పరిధిలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలకు ముడిరాయిని తీసు కువస్తున్న ట్రాలీ లారీ ఉన్నత పాఠశాల వద్దకు వచ్చేసరికి బ్రేకుల్ ఫెయిలయ్యాయి. దీంతో వా హనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న సూరేపల్లి మల్లికార్జునకు చెందిన గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈక్రమంలో పది గొర్రెలు మృతి చెందగా, లారీ రో డ్డు మార్జిన్‌లో పడిపోయింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెం టనే లారీకి సంబంధించిన యజమానులు వచ్చి డ్రైవర్‌ను వైద్యశాలకు తరలించి, గొ ర్రెల యజమానులకు నష్టపరిహారం అందించే చర్యలు చేపట్టారు.

గంగపాలెంలో నాలుగు ఇళ్లలో చోరీ

తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు

తాళ్లూరు, మార్చి 5 : మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెంలో తాళాలు వేసిన ఇళ్లల్లో సో మవారం రాత్రి గు ర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే... గంగపాలేనికి చెందిన కొంతమంది వివిధ వృత్తుల్లో ఇతర ప్రాంతాల్లో ఉంటూ స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటారు. సయ్యద్ మౌలాలి, సయ్యద్‌మస్తాన్‌వలి, పఠాన్ మీరావలి, పఠాన్ మస్తాన్‌వలి ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో సోమవారం రాత్రి దుండగులు ప్రవేశించి కొన్ని గృహాల ద్వారాలను తగులబెట్టి బీభత్సం సృష్టించారు. ఆ నాలుగు కుటుంబాల వారు ఇతర ప్రాం తాల్లో ఉంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చి వెళుతుంటారు. తొలుత సయ్యద్ మౌలాలి ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు ఇంటిలోపల వస్తువులను తగులబెట్టారు. ఇంటిలోని వస్తువులను ఎత్తుకెళ్లారు. మిగిలిన ముగ్గురికి చెందిన ఇళ్లలోకి ప్రవేశించి బీరువా తాళాలు, అన్ని గ దుల తలుపులు పగలగొట్టి విలువైన ఆభరణాలను, చీరెలు ఇతరత్రా సామగ్రిని దొంగిలించుకెళ్లారు. సోమవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన గ్రామస్థులు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి తెలియజేశారు. బాధితులు ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఏ మాత్రం చోరీ జరిగిందనేది బాధితులందరూ వచ్చి ఇళ్లను పరిశీలిస్తేనే తెలిసే అవకాశం ఉంది.

బీసీ సదస్సుకు తరలిన నాయకులు


మంగళగిరికి తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు

చీమకుర్తి, మార్చి 5 : మంగళగిరిలో నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు చీమకుర్తి మండల టీడీపీ నాయకులు మంగళవారం భారీగా తరలివెళ్లారు. చీమకుర్తి నుంచి ర్యాలీగా బీసీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, అవనిగడ్డ శేషారావు, నర్రా నాగరాజు, ఆరుద్ర రామారావు, భువనగిరి వెంకాయమ్మ, వేల్పుల శ్రీనివాసరావు, అలవలపాటి బ్రహ్మజీ, డీ శ్రీను, నరసింహారావు, ఆంజనేయులు, తిరుమల రాయుడు పాల్గొన్నారు.

మీ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తా

- తుమ్మకుంట శంఖారావం కార్యక్రమంలో డాక్టర్ ఉగ్ర
- గ్రామంలో 36 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరిక
- సీఎస్‌పురం మండలం కొండబోయిన పల్లిలో సైకిలెక్కిన 13 కుటుంబాలు

కనిగిరి, మార్చి 5 : కనిగిరి ప్రాంత ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆదరించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. మండలంలోని తుమ్మకుంట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన శంఖారావం కార్యక్రమంలో మాట్లాడారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాల మాటున రాష్ట్రంలోని ఆదాయ వనరులను, సహజ సంపదను వైసీపీ నేతలు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. పాలనా దక్షత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రం దివాళా దిశగా పోతుందని జగన్ రుజువు చేశాడని విమర్శించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం కాంక్షించారన్నారు. అనంతరం 36 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే సీఎస్‌పురం మండలంలోని కొండబోయినపల్లి గ్రామానికి చెందిన 13 దళిత కుటుంబాల వారు వైసీపీని వీడి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా వేసి టీడిపి లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చల్లగాలి ఏసుపాదం, హనుమంతు, ఇజ్రాయేలు, చిన్నక్క, సుశీలమ్మ, ప్రశాంత్, గురవమ్మ, రామయ్య, పుల్లమ్మ, నాగయ్య, యేసు, మరియమ్మ ఉన్నారు.

సొంతగూటికి చేరిన 'దాసరి'

సత్య సమక్షంలో టీడీపీలో చేరిక

టంగుటూరు, మార్చి 5 : వైసీపీ నాయకుడు దాసరి సుబ్బారావు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఆయన మంగళవారం టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేసిన సుబ్బారావు అనంతరం వైసీపీలో చేరి కీలకంగా వ్యవహరించారు. ఆపార్టీ నాయకులతో ఏర్పడ్డ విభేదాలతో కొంత కాలం నుంచి వైసీపీకి దూరంగా ఉంటున్నారు. మంగళవారం టంగుటూరులో జరిగిన దామచర్ల సత్య జన్మదిన వేడుకల్లో ఆయన సమక్షంలో మళ్లీ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


సుబ్బారావుపై కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్య

ఆయుర్వేద సేవలకు గుర్తింపు

జాతీయ స్థాయిలో అవార్డ్ పొందిన డాక్టర్ మురళీకృష్ణ





ఫెలోఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేద అవార్డ్‌ను అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

మేదరమెట్ల, మార్చి 5: ఆయుర్వేద వై ద్యంలో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద వైద్యకళాశాలలో అధ్యాపకుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన డాక్టర్ మురళీకృష్ణకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ఆయూష్‌బోర్డు అటానమస్‌గా నిర్వహించే నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేద మురళీకృష్ణను ఫెలోషిప్‌తో గౌరవించింది. మంగళవారం న్యూఢిల్లీలోని కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ పి.మురళీకృష్ణకు ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమి ఆయుర్వేద అవార్డుతో సత్కరించారు. న్యూఢిల్లీలోని కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ అయిన నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేద న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన 27వ స్నాతకోత్సవంలో కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ కొటేచా, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షుడు పద్మభూషణ్ డాక్టర్ దేవేంద్ర త్రిగుణ, నేషనల్ ఆయుర్వేద అకాడమి డైరెక్టర్ డాక్టర్ వందన, ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఢిల్లీ డైరెక్టర్ తనూజా నెస్రీల చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. ఆయుర్వేద వైద్యంలో 36 సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మందుల తయారి యూనిట్‌కు ఇన్‌చార్జ్‌గా మురళీకృష్ణ మొన్నటివరకు బాధ్యతలు నిర్వహించారు. ఈ 36 ఏళ్ల సుదీర్ఘ అధ్యాపక జీవితంలో ఆస్ట్రేలియా, యూరప్ దేశాలు, సింగపూర్, దుబాయ్ వంటి దేశాలతోపాటు భారత్‌లోని ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్, జిప్‌మర్, పాండిచ్చేరిలోని వైద్యవిశ్వవిద్యాలయంతోపాటు పూణే, ఢిల్లీ వంటి చోట్ల ఆయుర్వేద వైద్యంపై ఆయన ప్రసంగాలు చేశారు. రోగుల పట్ల ఎంతో ఆదరణతో ఉండే మురళీకృష్ణ, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. వారు వృతిపరంగా ఆయన్ను నిరంతరం గుర్తు చేసుకోవడం ఆయనకు ఆయుర్వేద వైద్యం పట్ల నిబద్ధతకు నిదర్శనం. సెంట్రల్ ఆయూష్ రిసెర్చ్ బోర్డులో దక్షణాది నుంచి ఏకైక సభ్యునిగా సేవలందించారు. పలు ప్రతిష్ఠాత్మక కేంద్ర ఆయూష్‌బోర్డు నియమించిన కమిటీల్లో ఆయన ఎంపికై రాష్ట్రానికే గుర్తింపు తెచ్చారు. జాతీయ స్థాయిలో అతి తక్కువ మందికి లభించే ఈ పురస్కారం మురళీకృష్ణకు లభించడం ఆయన సేవలకు గుర్తింపు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవలరావూరులో ఈయన జన్మించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ఎంతోమంది నిత్యం ఆయన వద్ద వైద్య సేవలు పొందుతున్నారు. ఆయన ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల దైవాలరావూరు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతిలో స్థిరపడ్డ ఆయన రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ.., ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్నారు.


సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

పీసీపల్లి, మార్చి 5 : తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ఆ పార్టీశ్రేణులు మండలంలోని ముద్దపాడు పంచాయతీలో మంగళవారం రాత్రి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇల్లిల్లూ తిరిగిన శ్రేణులు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపనేని రత్తయ్య, మాల్యాద్రి, మాచర్ల, నానిబాబు, శివప్రసాదు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రహసనంగా నాడు-నేడు పనులు

మూడేళ్లుగా నిలిచిపోయిన వైనం

మౌలిక వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు


మూడేళ్లుగా మొండిగోడలతో వెక్కిరిస్తున్న తరగతి గదుల భవనం


అసంపూర్తిగా నిలిచిపోయిన టాయిలెట్స్ గదులు

దర్శి, మార్చి 5 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఆరంభించిన నాడు-నేడు పథకం ప్రహసనంగా మారింది. విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించేందుకు నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టింది. సక్రమంగా నిధులు విడుదల చేయకపోవటం వలన అధిక శాతం భవనాల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. మూడేళ్లుగా పనులు ముందుకు సాగకపోవటంతో మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. చాలినన్ని తరగతి గదులు లేక, పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శి మండలంలోని 37 పాఠశాలల్లో రూ.18.7 కోట్లతో 163 పనులు చేపట్టారు. ఇప్పటివరకు కేవలం రూ.9.65 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టి 57 పనులు మాత్రమే పూర్తిచేశారు. ఇంకా 106 పనులు అలాగే మధ్యలో నిలిచిపోయాయి. సుమారు రూ.9కోట్ల నిధులు విడుదల కాకపోవటంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఎన్నికలు వస్తున్నందున అసంపూర్తిగా నిలిచిన భవనాల నిర్మాణం పూర్తయ్యే అవకాశం లేదు. ప్రభుత్వ అసమర్థ పాలనపై విద్యార్థుల తల్లితండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు కూడా రాక ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోవటమే కాక అనేక పాఠశాలల్లో విద్యార్థులకు బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. టాయిలెట్స్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలే అమలుకు నోచుకోలేదు

నాడు-నేడు పనుల నిర్వహణలో స్వయంగా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలే అమలుకు నోచుకోలేదు. ఏడాది క్రితం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ దర్శిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సందర్భంగా మౌలిక వసతులు పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించారు. ఆ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బెంచీలు ఏర్పాటు చేయలేదు. నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పట్లో ఈ పనులు పూర్తయ్యే అవకాశం లేదని విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

పూర్తికాకుండానే ప్రారంభోత్సవమా..?

- టీడీపీ మార్కాపురం ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 5: వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండా ప్రారంభోత్సవం చేయడం ఏంటని మాజీ ఎమ్మెల్యే టీడీపీ మార్కాపురం నియోజక వర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలను మభ్య పెట్టేందుకు వైసీపీ నాయకులు ప్రాజెక్టు ప్రారంభోత్సవం అంటూ హడావుడి మొదలుపెట్టారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఇవ్వాలంటే రానున్న ఎన్నికలలో టీడీపీని ఖచ్చితంగా అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రాజెక్టు కోసం భూములను, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులకు ఒక్క రూపాయి పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. వారి నోట్లో మట్టి కొట్టి వెలుగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తున్నామంటూ సీఎం జగన్ వారిని మోసం చేస్తున్నారని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులలో 85 నుంచి 90శాతం వరకు పనులు టీడీపీ హయాంలోనే పూర్తి చేశారన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజలను మభ్యపెట్టాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని అన్నారు. ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసి విధ్వంసాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలురానున్న ఎన్నికలలో తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేయాలనుకుని చేస్తున్న వెలుగొండ ప్రాజెక్టు పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మౌలాలి, క్లస్టర్ ఇన్‌చార్జులు వక్కలగడ్డ మల్లికార్జున, కొప్పుల శ్రీనివాసులు, నాయకులు పటాన్ ఖాన్, జంకె రమణారెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

- వెలిగొండ నిర్వాసితుల సమస్యలపై రాజకీయపక్షాలు నిలదీత

చిత్తశుద్ధి ఏదీ: వ్యవసాయ కార్మికసంఘం

పొదిలి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మాట ఇచ్చిన ప్రకారం వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు పునరావాసం కల్పించి ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పెద్దబస్టాండ్ కూడలిలో వెలిగొండ నిర్వాసితులకు న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. వెలుగొండ ప్రాజెక్ట్ వెనుకబడిన పశ్చిమ ప్రాంతవాసులకు ఒక వరమన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్‌ను 17 ఏళ్లగా ప్రభుత్వాలు ప్రజలకు ఆశలు పెడుతున్నాయని, పూర్తి చేసి ఈ ప్రాంత వాసులకు న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వారి రాజకీయ స్వలాభం కోసం తూతూమంత్రంగా వెలిగొండ పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ పాదయాత్రలో నిర్వాసితులకు న్యాయం చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వాసితులకు న్యాయం చేయకుండా ప్రాజెక్ట్ ప్రారంభిస్తామని మరోసారి మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవ చేశారు. సుమారుగా 11 గ్రామాల్లో 8 వేల మందికిపైగా ఉన్న నిర్వసితులకు పునరావాసం కల్పించకపోవడం దారుణమన్నారు. 2019 నుండి బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయిస్తూ, ఎన్నోవాయిదాలు వేసుకుంటూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు కాలయాపన చేసిందన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలంటే సుమారుగా మూడువేల కోట్ల రూపాయలు అవసరమవుతాయన్నారు. కేవలం కంటితుడుపుగా వంద, రెండొందల కోట్లు విడుదల చేసి ప్రజలను దగా చేస్తోం దని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన కేవలం రూ.60 కోట్లు కేటాయించి రూ.32 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయడంతోపాటు అవసరమైన మేరకు నిధులు మంజూరు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కేజీ మస్తాన్, బడుగు వెంకటేశ్వర్లు, అంగలకుర్తి బ్రహ్మయ్య, కంకణాల వెంకటేశ్వర్లు, పారాబత్తిన శ్రీను, ఉబ్బా వెంకటేశ్వర్లు, బి.జనార్ధన్, ఈదర సుబ్బారావు, ఎస్ ఆదినారాయణ, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వ్యవసాయకార్మిక సంఘం నాయకులు

ప్రాజెక్టు ప్రారంభోత్సవం హాస్యాస్పదం: ఆప్

మార్కాపురం వన్‌టౌన్ : పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టును హడావుడిగా ప్రారంభించడం హాస్యాస్పదం అని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు బి.సుదర్శన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్ బుధవారం వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభో త్సవానికి రావడం అంటే నిర్వాసితుల గొంతు కోసి శవాలమీద నడవడమేనన్నారు. ప్రాజెక్టు పూర్తి కాకుండా నే, పరిహారం ఇవ్వకుండానే, ఇటువంటి బూటకపు కార్యక్రమాలు ఎవరూ హర్షించరన్నారు. జిల్లాలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల చేతకానితనమే ఈ దుస్థితికి కారణమన్నారు. ప్రభుత్వ అసమర్ధ పనుల వలన భవిష్యత్తులో ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు అమాయకులు కాదని, తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మార్కాపురం జిల్లా కూడా ఏర్పాటు చేయకపోవడం పాలకుల, ప్రజా ప్రతినిధుల అసమర్ధతే కారణమన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- పర్యవేక్షించిన ఎస్పీ పరమేశ్వరరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

పెద్ద దోర్నాల, మార్చి 5: వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నేడు ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ప్రాజెక్టు వద్దకు రానున్న నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులు, గుత్తేదారులు ఏర్పాట్లను మంగళవారం సిద్ధం చేశారు. ఈ క్రమంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి గత రెండు రోజులుగా పర్యవేక్షిస్తున్నారు. వందల సంఖ్యల్లో పోలీసు బలగాలను ఘటనా స్థలంలో మోహరించారు. హెలిప్యాడ్‌ను పునరుద్ధరణ, పైలాన్ నిర్మాణం, సీఎం పర్యటించే భాగాన్ని అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హెలీక్యాప్టర్ నుంచి హెలీప్యాడ్‌పై దిగినప్పటి నుంచి సుమారు 200మీటర్ల దూరం లో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని చూసి పక్కనే ఉన్న పైలాన్ వరకు నడిచి వెళ్లి ప్రారంభించిన అనంతరం అక్కడ నుండి వ్యూ పాయింటు ద్వారా సొరంగాలను చూస్తారు. తదనంతరం వాహనాల్లో 2వ సొరంగం నిర్మాణం వరకు వెళ్లి వచ్చే అవకాశముందని ఇంజనీరింగ్ శాఖాధికారులు తెలిపారు. ఈ తంతును పోలీసులు ముందుగానే మాక్ డ్రిల్ నిర్వహించారు. గంటపాటు పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు, మండల అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఈ ఏర్పాట్లను సాయంత్రం వైసీపీ సీనియర్ నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి తాటిపర్తి చంద్రశేఖర్ రావు పరిశీలించారు.

నేడు వెలిగొండ ప్రాజెక్ట్ జాతికి అంకితం

- దోర్నాల రానున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

మార్కాపురం, మార్చి 5: శ్రీ పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను బుధవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేయనున్నారు. సీఎం జగన్ బుధవారం ఉదయం ప్రకాశం జిల్లాలోని పర్యటన వివరాలను కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. సీఎం జగన్ ఉదయం 9.40కి హెలికాప్టర్‌లో తాడేపల్లి నుంచి బయలుదేరి 10.30 గంటలకు దోర్నాల మండలం ఎగువచెర్లోపల్లికి చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులతో కలిసిన అనంతరం నీటిపారుదలశాఖ అధికారులు వెలిగొండ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని చూస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభ టన్నెల్‌ను ఆవిష్కరించి జాతికి అంకితం చేస్తారు. అక్కడ వెలిగొండ ప్రాజెక్ట్ లబ్ధిదారులతో 10 నిమిషాలు మాట్లాడతారు. అనంతరం టన్నెల్-2ను సందర్శిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో తాడేపల్లికి తిరిగి వెళ్లారు.

ఆసరా చెక్కుల పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కంభం, మార్చి 5 : గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే, వైసీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం కంభంలో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లోని 2438 గ్రూపులకు రూ.15.56 కోట్లు విలువైన వైఎస్ఆర్ ఆసరా చెక్కులను నాగార్జునరెడ్డి అందజేశారు. కార్యక్రమానికి మూడు మండలాల ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతోపాటు గిద్దలూరు ఏరియా కో-ఆర్డినేటర్ అంబేద్కర్ కంభం ఏపీఎం ఎ.రంగనాయకులు, అర్ధవీడు ఏపీఎం రామయోగయ్య అర్ధవీడు ఏపీఎం రఘునాథబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలం వెళుతున్న భక్తులు

పెద్ద దోర్నాల, మార్చి 5: మహాశివరాత్రి పర్వది నాన్ని పురస్కరించుకుని భక్తులు శ్రీశైలానికి మంగ ళవారం పోటెత్తారు. దక్షిణాది పుణ్యక్షేత్రాలలో అత్యంత ప్రఖ్యాతి గాం చిన శ్రీశైలంలో కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికా ర్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా వేడుకలు వైభోపేతంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని కర్ణాటక, మహారాష్ట్ర, చెన్నై నుంచి భారీ సంఖ్యల్లో భక్తులు గౌరీశంకరుల దర్శనం కోసం వెళ్తున్న క్రమంలో దోర్నాలలో రద్దీ ఏర్పడింది.

అర్ధనారీశ్వరుడిగా నిర్మమహేశ్వరుడు



పొదిలి, మార్చి 5 : పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాలను దేవాలయ సాంప్రదాయంగా మేళతాలాలతో దేవాలయానికి తీసుకొచ్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టణంలో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. తీర్ధప్రసాదాలు పంచిపెట్టారు. బుధవారం స్వామివారు హంసవాహనంపై చతుర్ముఖబ్రహ్మ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

టీడీపీతోనే బీసీలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు

వై.పాలెం టీడీపీ-జనసేన అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మార్చి 5 : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే బీసీలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం మండలం పందివానిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం 'బాబుష్యూరిటి భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తాను పోటీలో ఉంటానని మీరు అందరు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 నుంచి 59 సంవత్సరాలలోపు మహిళలకు నెలకు రూ.1500 నగదు, సంవత్సరానికి మహిళలకు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు రైతులకు రూ.20 వేలు నగదు, అమ్మఒడి ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళ్లితే ఒక్కొక్కరికి రూ.15 వేలు నగదు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 నగదు, పంపిణీ చేస్తామని చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమిలేదన్నారు. వెలిగొండప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి చేయకుండానే ఎన్నికల కోసం ప్రాజెక్టును ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని ఇంతకంటే అపహస్యం ఏముందని అన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు చిట్యాల వెంగలరెడ్డి, ఒంగోలు ఆదిరెడ్డి, కాయకాకుల సుబ్బయ్య, తోట మహేష్, షేక్ ఇస్మాయిల్, షేక్ మస్తాన్ వలి, కందుల నారాయణరెడ్డి, డి వెంకట్రావు, చేదూరి లక్ష్మయ్య పాల్గొన్నారు. పందివానిపల్లె గ్రామ మహిళలు టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు.



టీడీపీ మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు



మన కోసం మన కందుల కార్యక్రమంలో నారాయణరెడ్డి

వచ్చేది, టీడీపీ ప్రభుత్వమే

మార్కాపురం రూరల్ : రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 17వ బ్లాక్‌లో మంగళవారం రాత్రి మన కోసం మన కందుల అనే కార్యక్రమానికి నాయకులతో కలిసి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆ వార్డులోని ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి ఆ ప్రాంత సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. అలాగే టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలు ద్వారా మహిళలకు, రైతులకు అన్ని వర్గాల వారికి మంచి లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మౌలాలి, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పుల శ్రీనివాసులు, పటాన్ ఖాన్, వార్డు టీడీపీ ఇంచార్జ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

వీవోఏల సమావేశంలో వైకేపీ ఏపీఎం

మార్కాపురం రూరల్, మార్చి 5: ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించాలని గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులను డీఆర్‌డీఏ వైకేపీ ఏపీఎం రమేష్‌బాబు సూచించారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో ప్రకృతి వ్యవసాయంపై వీవోఏలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఆరు గ్రామాలలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వారికి నాణ్యమైన పంటతో పాటు అధిక దిగుబడి వస్తోందన్నారు. మిగిలిన అన్ని గ్రామాలలో కూడా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పించారన్నారు. వారి అనుభవాలను ఉపయోగించుకోవాలన్నారు. ఏవో దేవి రెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పంటలను సాగు చేయటం వలన రసాయన రహిత కూరగాయలు, ఆకుకూరలు, గింజలు పొందే అవకాశం ఉందన్నారు. మహిళ రైతు గ్రూపులను ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వం అందించే పథకాలను, రాయితీలను ఉపయోగించు కోవాలని కోరారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ఝాన్సీరాణి, కమిటీ సభ్యులు గోవిందమ్మ, సీసీలు మనకుమారి, స్వామి, అకౌంటెంట్ నాగమణి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, వీవోఏలు, గ్రామ సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైకేపీ ఏపీఎం రమేష్‌బాబు

విద్యార్థులతో భవన నిర్మాణ పనులు

- పలుమార్లు హెచ్చరించిన తల్లిదండ్రులు
- పట్టించుకోని ప్రధానోపాధ్యాయురాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న గ్రామస్థులు

బేస్తవారపేట, మార్చి5 : విద్యార్థుల భవితను తీర్చిదిద్దాల్సిన పాఠశాలల్లో విద్యార్థులతో భవన నిర్మాణ పనులు చేయిస్తున్నారు. ఈ ఘటన మండలంలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకొంది. పాఠశాలలో నాడు-నేడు నిధులతో ఆదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. దీని కోసం రూ.92 లక్షలతో నిధులు వెచ్చిస్తున్నారు. అయితే అక్కడి ప్రధానోపాధ్యాయురాలు తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులతో భవన నిర్మాణ పనులు చేయిస్తున్నారు. పాఠశాల విద్యార్థులతో భవనం క్యూరింగ్, ఇతర పనులు చేయిస్తున్నారు. వారం రోజులుగా కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులతో మోటార్ ద్వారా పైపుతో విద్యార్థుల్లో ఒకరి తర్వాత మరొకరికి టైంటేబుల్ కేయటాయించి పనులకు వినియోగిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు తల్లిదండ్రులు హెచ్ఎంను హెచ్చరించినా ఆమె పట్టించుకోలేదు. ప్రస్తుతం విద్యార్థులతో పనులు చేయిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులతో కలసి సంబంధించిన ఉపాధ్యాయులను నిలదిసిన పట్టించుకోవడంలేదని దీంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పిల్లర్‌కు నీరు పెడుతున్న విద్యార్థులు

నానాటికీ తీవ్రమవుతున్న తాగునీటి సమస్య

- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- చేతులెత్తేసిన అధికారులు
- అమలుకాని ఎంపీడీవో హామీ

తర్లుపాడు, మార్చి 5: మండలంలో రోజు రోజుకు మంచినీటి సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. ఈ విషయంపై తామేమి చేయలేమని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులెత్తేశారు. ప్రజా ప్రతినిధులకు ప్రజలు మొరపెట్టుకున్నా కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎక్కువగా, తర్లుపాడులోని రైల్వే గేటు సమీపంలోని బీసీ కాలనీ, నాయుడుపల్లె కాలనీ, గానుగపెంట, కేతగుడిపి, మేకవారిపల్లెలో తీవ్ర మంచినీటి సమస్య తలెత్తింది. ఉన్న బోర్లు ఒట్టిపోవడంతో మంచి నీటి సమస్య నెలకొంది. తర్లుపాడులోని బీసీకాలనీ, నాయుడుపల్లె కాలనీ జలజీవన్ మిషన్ పథకంతో పైపులైన్‌లు వేసే క్రమంలో ఉన్న పైపులైన్లు ధ్వంసం అయ్యాయి. దీంతో నీటి సరఫరా నెల రోజుల నుంచి నిలిచిపోయింది. దీంతో ప్రజలు కి.మీ దూరంలో ఉన్న బస్టాండ్ కూడలిలోని చిన్నట్యాంకు వద్ద నుంచి తోపుడు బండ్లు, బైకులు, ఆటోలలో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వారం రోజుల క్రితం తర్లుపాడు-మార్కాపురం రోడ్డుపై బీసీ, నాయుడు పల్లె కాలనీవాసులు రాస్తారోకో చేశారు. వెంటనే మంచినీటి సమస్య ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ హామీ ఇచ్చి రాస్తారోకోను విరమింపజేశారు. ఆయన మాటలను ఒట్టి మాటలుగానే మిగిలిపోయాయి. నేటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన దాఖలాలు లేవు. కేతగుడిపి, గానుగపెంటల్లో కూడా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మేమేం చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలంటూ ప్రజలు వాపోయారు. గుక్కెడు నీరు ఇవ్వండి మహాప్రభో అంటూ మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు బీసీ కాలనీకి చెందిన చిట్టి వెంకటమ్మ మొరపెట్టుకుంటడంతో వైసీపీ నాయకులు ఆమెను గెంటేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతనిధులు స్పందించి మంచినీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు



ఆటోలో నీళ్లు తెచ్చుకుంటున్న వ్యక్తి

అవీ..ఇవీ..

ప్రైవేట్ పాఠశాలల్లో పేదల సీట్లకోసం దరఖాస్తులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 5: ఉచిత విద్యా హక్కు చట్టం- 2009 ప్రకారం పట్టణం, మండలంలోని ప్రైవేట్ పాఠశాలలల్లో ఒకటో తరగతిలో పేదలు, అనాథలు, దివ్యాంగులు, సామాజిక, ఆర్థిక వెనుకబడిన తరగతులకు 25శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు ఎంఈవోలు రాందాస్‌నాయక్, శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విద్యార్థులకు 25శాతం కోటా కింద ప్రైవేట్ పాఠశాలలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9 నుంచి మార్చి 1 వరకు 17 ప్రైవేట్ పాఠశాలలు విద్యాహక్కు చట్టం కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004258599కు సంప్రదించాలన్నారు.

8న శివరాత్రి వేడుకలు

గిద్దలూరు, మార్చి 5 : మండలంలోని సంజీవరాయునిపేట సమీపంలో నల్లమల అడవిలో వెలసిన శ్రీబోధీశ్వవర క్షేత్రంలో ఈనెల 8న శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు, జాగరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధి అల్లూరయ్యస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం, రాత్రి జాగరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ర్యాలీ చేస్తున్న డీఆర్‌డీఏ వైకేపీ సిబ్బంది

మార్కాపురం రూరల్, మార్చి 5: రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగంచుకోవాలని డీఆర్‌డీఏ వైకేపీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకేపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఎన్నికలలో ఓటు హక్కును వినియోగంచుకోవడం ప్రతి పౌరుడు బాధ్యత అన్నారు. సమాజంలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో సీసీలు మనోకుమారి, స్వామి, అకౌంటెంట్ నాగమణి, మండల సమాఖ్య కమిటీ సభ్యులు, మండలంలోని గ్రామ సంఘాల కమిటీ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

బీసీ సదస్సుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



బీసీ సదస్సుకు వెళుతున్న టీడీపీ నాయకులు

త్రిపురాంతకం, మార్చి 5: గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్శిటీ దగ్గర నిర్వహించిన టీడీపీ రాష్ట్ర బీసీ సదస్సుకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు మంగళవారం తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వలరాజు ఆధ్వర్యంలో 12 వాహనాలలో సుమారు 150 మంది కార్యకర్తలు సదస్సుకు తరలివెళ్లారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

పొదిలి, మార్చి 5 : పొదిలి పొగాకు వేలంకేంద్రం పరిధిలో కొనుగోళ్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమౌతాయని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. పొగాకు నాణ్యతను పరిశీలించుకొని రైతులు వేలానికి తీసుకురావాలని కోరారు. ఆముదాలపల్లి, అగ్రహారం, కెల్లంపల్లి గ్రామాల నుంచి వచ్చే 27 బేళ్లకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పంట కాలానికి రిజిస్టర్ అయిన రైతులు 4438మంది రైతుల వద్ద నుంచి 2626 బ్యారన్ల పరిధిలో 7413.80 హెక్టార్లలో సాగుకు అనుమతి ఇచ్చారన్నారు. అయితే 8213 హెక్టార్లలో సాగు చేశారన్నారు. ప్రస్తుతం 9.65మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లకు అనుమతించారు. 12మిలియన్ కిలోల పొగాకు రైతుల నుంచి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కనుక రైతులు హడావుడి లేకుం డా నాణ్యతలో ఎలాంటి తేడాలు లేకుండా చెక్కులు ఏర్పాటు చేసుకొని క్లస్టర్ల వారీగా ఇచ్చిన తేదీలలో వేలంకేంద్రానికి తీసుకురావాలని ఆయన కోరారు. గ్రేడింగ్‌లో మాత్రం మెళకువలు పాటించడం వలన మంచి ధరలు ఉంటాయన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎంఈవో ఆంజనేయులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం, మార్చి 5 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో ఆంజనేయులు పేర్కొన్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు కష్టపడి చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలన్నారు. మండలంలోని కొలుకుల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షల సమ యం తక్కువగానే ఉందని ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు 10వ తరగతి విద్యార్థులకు మంచి సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వాలని అన్నారు. పదో తరగతి పరీక్షలకు వెళ్లే 54 మంది విద్యార్థులకు హిందీ పండిట్ శాస్త్రి పరీక్షా కిట్‌లు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. వార్షికోత్సవ సభలో వేదికపై విద్యార్థినుల నృత్యప్రదర్శన, గేయాలాపన తల్లిదండ్రులను అలరింపజేశాయి. కార్యక్రమంలో సర్పంచి విరాజయ్య, హెచ్ఎం బాలునాయక్, ఉపాధ్యాయులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వపు విద్యార్థులు వెంకటరెడ్డి, శ్రీను, వారి మిత్రులు రూ.25 వేల విలువైన కంప్యూటర్‌ను హెచ్ఎం రమాదేవికి అందజేశారు.



అట్టలతో విద్యార్థులు

వెలిగొండ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

మార్కాపురం రూరల్, మార్చి 5: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు నష్టపరిహారాన్ని అందించి వారికి న్యాయం చేయాలని రైతు సంఘం నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. ప్రాజెక్టు ప్రారంభోత్సవం అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేస్తోందన్నారు. ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోతున్న ముంపు గ్రామాల ప్రజాలకు పునరావాసం అందించి న్యాయం చేయాలని కోరారు. ముంపు గ్రామాల ప్రజలు ప్రభుత్వం నుంచి అనేక సంక్షేమ పథకాలను లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. వారికి నష్టపరిహారాన్ని అందించి వెంటనే పునరావాస కాలనీలలో నివాస ఏర్పాట్లను చేయాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతుసంఘం నేతలు

గంగపాలెంలో నాలుగు ఇళ్లలో చోరీ

తాళాలు వేసిన గృహాలలో చోరీకి పాల్పడిన దుండగులు

తాళ్లూరు, మార్చి 5 : మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెంలో తాళాలు వేసిన ఇళ్లల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే... గంగపాలేనికి చెందిన కొంతమంది వివిధ వృత్తుల్లో ఇతర ప్రాంతాల్లో ఉంటూ స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటారు. సయ్యద్ మౌలాలి, సయ్యద్‌మస్తాన్‌వలి, పఠాన్ మీరావలి, పఠాన్ మస్తాన్‌వలి ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో సోమవారం రాత్రి దుండగులు ప్రవేశించి కొన్ని గృహాల ద్వారాలను తగులబెట్టి బీభత్సం సృష్టించారు. ఆ నాలుగు కుటుంబాల వారు ఇతర ప్రాంతాల్లో ఉంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చి వెళుతుంటారు. తొలుత సయ్యద్ మౌలాలి ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు ఇంటిలోపల వస్తువులను తగులబెట్టారు. ఇంటిలోని వస్తువులను ఎత్తుకెళ్లారు. మిగిలిన ముగ్గురికి చెందిన ఇళ్లలోకి ప్రవేశించి బీరువా తాళాలు, అన్ని గదుల తలుపులు పగలగొట్టి విలువైన ఆభరణాలను, చీరెలు ఇతరత్రా సామగ్రిని దొంగిలించుకెళ్లారు. సోమవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన గ్రామస్థులు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి తెలియజేశారు. బాధితులు ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఏ మాత్రం చోరీ జరిగిందనేది బాధితులందరూ వచ్చి ఇళ్లను పరిశీలిస్తేనే తెలిసే అవకాశం ఉంది.



చిందరవందరగా పడేసిన వస్తువులు

యారవ సహకారంతో చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పువ్వాడి

పామూరు, మార్చి 5 : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు టీడీపీ నాయకుడు యువ పారిశ్రామికవేత్త యారవ శ్రీను తన సొంత నిధులు వెచ్చించి పామూరులోని పలు కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. సీఎస్‌పురం రోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం హుసేన్‌రావు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, సయ్యద్ అమీర్‌బాబు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ దరిశి రాము, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాష, ఇర్రి కోటిరెడ్డి, పువ్వాడి వెంకట్‌చౌదరి పాల్గొన్నారు.

రైతులను ఆదుకొనేందుకే కందుల కొనుగోలు కేంద్రం

పామూరు, మార్చి 5 : కందులను సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకొనేందుకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత తెలిపారు. మండలంలోని వగ్గంపల్లిలోని రైతు భరోసా కేంద్రంలో సహకారసంఘం సహకారంతో ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. కందులు కింట్వాల్ ధర రూ.9470 ఉందని, ఏ రోజుధర ఎంత ఉంటే ఆ రోజు అదేధరకు కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రెక్కల అనిత, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కే రామిరెడ్డి, గోవిందయ్య, డైరెక్టర్ సలీం, అగ్రికల్చర్ అసిస్టెంట్ షహనాజ్, ఏజీఎం సుభాని, ఎం ఉమా, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీఈవో శేషిరెడ్డి, జీవి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

దేవస్థాన పునఃనిర్మాణ పనులకు శ్రీకారం

పామూరు, మార్చి 5 : కనిగిరి రోడ్‌లో ఎన్నో ఏళ్లుగా పాడుబడి ఉన్న కోనేరు వారి శివాలయం పునఃనిర్మాణానికి సంబంధించిన పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. గత ఏడాది నవంబరులో రెండున్నర అడుగు ఎత్తు గల పార్వతీ అమ్మవారి విగ్రహం ఆలయంలో బయటపడిన విషయం తెలిసిందే. 70 ఏళ్ల క్రితం కోనూరు ఆది శంకరయ్య కుటుంబానికి చెందిన పడమర వైపు దిక్కున ఆదిపరాశక్తి సమేత పార్వతీ పరమేశ్వర స్వామి శివాలయాన్ని నిర్మించారు. కాలక్రమేణా మరుగున పడిపోయింది. అప్పట్లో ఒక వెలుగు వెలిగిన శివాలయాన్ని కోనూరి వంశస్థులు దాతల సహకారంతో అఘోరా వెంకటరమణ, అనిత భక్తులు మళ్లి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. మార్చి 8న మహాశివరాత్రి పండుగ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని హోటల్ పద్మా, కోటేశ్వరరావు, వాసు కోరారు.

పేద మహిళలకు 200 చీరల పంపిణి

పామూరు, మార్చి 5 : స్థానిక పాత పోస్టాఫీసు ఎదురు షిరిడి సాయిబాబా దేవస్థానంలో భక్తులకు నిత్య అన్నదాన సౌకర్యం కల్పించిన కేసీపీ సిమెంట్ అధినేత్రి వీఎల్ ఇందిరాదత్తు తన 60వ వివాహ వేడుకల సందర్భంగా మరో సేవా కార్యక్రమం నిర్వహించారు. సుమారు రూ.50 వేలతో 200 మంది పేద మహిళలకు దేవస్థాన కమిటీ చైర్మన్ పబ్బర్తి వెంకట సుబ్బయ్య, ఉప సర్పంచ్ వైవీ సాయికిరణ్‌తో కలిసి మంగళవారం చీరలు పంపిణీ చేశారు.

ప్రహసనంగా నాడు-నేడు పనులు

మూడేళ్లుగా నిలిచిపోయినవైనం

మౌలిక వసతులు లేక విద్యార్థులకు ఇక్కట్లు

దర్శి మార్చి 5 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఆరంభించిన నాడు-నేడు పథకం ప్రహసనంగా మారింది. విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించేందుకు నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టింది. సక్రమంగా నిధులు విడుదల చేయకపోవటం వలన అధిక శాతం భవనాల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. మూడేళ్లుగా పనులు ముందుకు సాగకపోవటంతో మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. చాలినన్ని తరగతి గదులు లేక, పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శి మండలంలోని 37 పాఠశాలల్లో రూ.18.7 కోట్లతో 163 పనులు చేపట్టారు. ఇప్పటివరకు కేవలం రూ.9.65 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టి 57 పనులు మాత్రమే పూర్తిచేశారు. ఇంకా 106 పనులు అలాగే మధ్యలో నిలిచిపోయాయి. సుమారు రూ.9కోట్ల నిధులు విడుదల కాకపోవటంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఎన్నికలు వస్తున్నందున అసంపూర్తిగా నిలిచిన భవనాల నిర్మాణం పూర్తయ్యే అవకాశం లేదు. ప్రభుత్వ అసమర్ధ పాలనపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు కూడా రాక ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోవటమే కాక అనేక పాఠశాలల్లో విద్యార్థులకు బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. టాయిలెట్స్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



మూడేళ్లుగా మొండిగోడలతో వెక్కిరిస్తున్న తరగతి గదుల భవనం



అసంపూర్తిగా నిలిచిపోయిన టాయిలెట్స్ గదులు

జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలే అమలుకు నోచుకోలేదు

నాడు-నేడు పనుల నిర్వహణలో స్వయంగా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలే అమలుకు నోచుకోలేదు. ఏడాది క్రితం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ దర్శిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సందర్భంగా మౌలిక వసతులు పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించారు. ఆ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బెంచీలు ఏర్పాటు చేయలేదు. నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పట్లో ఈ పనులు పూర్తయ్యే అవకాశం లేదని విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయ లోపంతో కార్యకర్తలను విస్మరిస్తున్న నేతలు

కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దద్దాల ఎదుట

గోడు వెళ్లబోసుకున్న కొందరు ముఖ్యులు

పామూరు, మార్చి 5 : మొన్నటి వరకు పదవులు అనుభవించిన వారు నేడు కనిపించకపోగా, సమన్వయ లోపంతో కార్యకర్తలను విస్మరిస్తున్నారని వైసీపీకి చెందిన కొందరు నేతలు ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ ఎదుట వాపోయారు. వైసీపీ స్థానిక కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ వైసీపీని నుంచి టీడీపీలోకి వెళుతున్న వారిని నివారించాలని సూచించారు. వైసీపీ శ్రేణులకు భరోసా కల్పించే నాయకుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ గ్రామాన శ్రేణులతో కలిసి లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ వైవీ సాయి, ఏఎంసీ వైస్ చైర్మన్ చాంద్‌బాష, వైస్‌ఎంపీపీ గంధం ఏసురత్నం, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, జిల్లా నాయకులు కే రామిరెడ్డి, ఏ కొండారెడ్డి, జీవీ భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ముందుగా రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డితో దద్దాల కలిసి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చింతలచెరువు, దద్దాల

ఎన్నికల నిబంధనల ప్రకారమే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

దర్శి మార్చి 5 : నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశామని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. తొలగింపుల దరఖాస్తులు ఒక శాతానికి మించి వస్తే జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్లో స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు తహసీల్దార్లు సుజాత, సుధాకర్, సుజాత, మధుబాబు, ఎస్ఏ మహమ్మద్‌హుస్సేన్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లోకేశ్వరరావు

మీ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తా

తుమ్మకుంట గ్రామ శంఖారావం కార్యక్రమంలో డాక్టర్ ఉగ్ర

గ్రామంలో 36 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

సీఎస్‌పురం మండలం కొండబోయిన పల్లిలో

సైకిలెక్కిన 13 కుటుంబాలు

కనిగిరి, మార్చి 5 : కనిగిరి ప్రాంత ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆదరించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. మండలంలోని తుమ్మకుంట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన శంఖారావం కార్యక్రమంలో మాట్లాడారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాల మాటున రాష్ట్రంలోని ఆదాయ వనరులను, సహజ సంపదను వైసీపీ నేతలు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. పాలనా దక్షత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రం దివాళా దిశగా పోతుందని జగన్ రుజువు చేశాడని విమర్శించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం కాంక్షించారన్నారు. అనంతరం 36 కుటుంబాలు వైసీపిని వీడి టీడీపీలో చేరారు. అలాగే సీఎస్‌పురం మండలంలోని కొండబోయినపల్లి గ్రామానికి చెందిన 13 దళిత కుటుంబాల వారు వైసీపీని వీడి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా వేసి టీడిపి లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చల్లగాలి ఏసుపాదం, హనుమంతు, ఇజ్రాయేలు, చిన్నక్క, సుశీలమ్మ, ప్రశాంత్, గురవమ్మ, రామయ్య, పుల్లమ్మ, నాగయ్య, యేసు, మరియమ్మ ఉన్నారు.



ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడిపిలో చేరిన గ్రామస్థులు

ఒక్కచాన్స్‌తో రాష్ట్రం దివాళా

పామూరు, మార్చి 5 : పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొన్నానని, వాటి పరిష్కారానికి తనకు ఒక్కసారి అధికారం ఇవ్వాలంటూ ప్రజల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని టీడీపీ పట్టణ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్ చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి ఆదేశాల మేరకు పట్టణంలోని ఆకులవీధి, దేవాలయం బజార్, వడ్డేపాలెం, రాచూరివారివీధి, తదితర ప్రాంతాల్లో బాబుష్యూరిటి -భవిషత్తు గ్యారెంటి కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఆ కార్యక్రమంలో గడ్డం రామారావు, మెంటా నరసింహారావు, బండ్లా నారాయణ, వెంకట్రావు, ఎస్ నరసింహారావు, తెలుగు మహిళలు ఎం రమాదేవి, జాజం రమణమ్మ పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ పత్రాలను అందజేస్తున్న నేతలు

ప్రతి పేదోడి కుటుంబానికి సొంతింటి కల సాకారం

దొనకొండ, మార్చి 5 : ప్రతి పేదోడి సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్ సాకారం చేస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చెప్పారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో మంగళవారం ఇంటి స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. 504 మందికి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ సుజాత, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, ఎంపీడీవో వసంతరావునాయక్, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, మండల వైసీపీ మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి రమణారెడ్డి, నాయకులు బీఎస్ రాజు, తమ్మనేని సుబ్బారెడ్డి, ఐలూరి శ్రీనివాసులు రెడ్డి, షేక్ గఫార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా పేదల అభ్యున్నతి

దర్శి, మార్చి 5 : వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలు అభ్యున్నతి సాధించారని మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. దర్శి పట్టణంలోని 5వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందిని పాల్గొన్నారు.

6 ట్యాంకర్లతో నీటి సరఫరా..!

టీడీపీ నేత డాక్టర్ ఉగ్ర నిరసనతో కాలనీలకు నీరు అందజేత



నీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్లు

కనిగిరి, మార్చి 5 : కనిగిరి ప్రజలు నీటి కష్టాలు పడుతున్న నేపథ్యంలో మొక్కుబడిగా 6 ట్యాంకర్లచే వాడుక నీటి సరఫరాను తిరిగి మంగళవారం పునరుద్ధరించారు. ప్రజల నీటి ఇక్కట్లు పరిష్కరించాలని కోరుతూ టీడీపీ నేత డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద శ్రేణులతో కలసి నిరసనకు దిగిన విషయం తెలిసిందే. చేసేదేమీ లేక పాలకవర్గం మొక్కుబడిగా ఆరు ట్యాంకర్లుచే 36 ట్రిప్పులు నీటిని సరఫరా మొదలుపెట్టింది. ఇవి ఏమాత్రం సరిపోవటం లేదంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

నీటి కోసం వ్యథ చెందుతున్న నగర ప్రజలు

కనిగిరి మున్సిపాల్టీలో 20 వార్డులు ఉండగా 45వేలకు పైగా జనాభా ఉన్నారు. 14 వేల నివాస గృహాలు ఉన్నాయి. కొన్ని గృహాలకు చెందిన యజమానులు వారే స్వయంగా బోరును వేయించుకుని వినియోగించుకుంటూ ఉంటారు. ఆ బోర్లలోని నీరు కూడా అడుగంటిపోయాయి. దీంతో ట్యాంకర్ల నీరే దిక్కైంది. ప్రతిరోజూ మొన్నటివరకు 160 ట్రిప్పులు సరఫరా చేయగా, కాంట్రాక్టర్ల గడువు ముగియటంతో నీటి సరఫరా 10 రోజులుగా నిలిచిపోయింది. 160 ట్రిప్పులు నీటిని సరఫరా చేసిన పాలకులు ప్రస్తుతం కేవలం 36 ట్రిప్పులను కంటి తుడుపు చర్యగా సరఫరా చేయటం పట్ల ప్రజలు పాలక వర్గంపై మండిపడుతున్నారు. వేసవి కాలంలో ఇంకా అదనంగా ట్యాంకర్ల నీటి సరఫరా చేయాల్సింది పోయి కేవలం 6 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరో చోట వృథాగా పోతున్న నీరు

కనిగిరి నగర ప్రజలు నీటి కోసం వ్యథ చెందుతుంటే మరో చోట కనిగిరి మండలంలోని బాలవెంకటాపురం గ్రామ ప్రధాన రహదారి వద్ద తాగునీరు సరఫరా జరిగే సాగర్‌నీటిపైపు లైను పగిలి రోడ్లపైకి వృథాగా పోతున్నాయి. 10 రోజులుగా వృథాగా పోతున్నాయని ఆయా గ్రామానికి చెందిన ప్రజలు చెప్తున్నారు. రోడ్ల వెంబడి ఉన్న మురుగు గుంతలోకి సాగర్‌నీరు వెళ్లి వృథా పాలవుతున్నాయి. అధికారులు స్పందించి లీకుల సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

పీసీపల్లి, మార్చి 5 : తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ఆ పార్టీశ్రేణులు మండలంలోని ముద్దపాడు పంచాయతీలో మంగళవారం రాత్రి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇల్లిల్లూ తిరిగిన శ్రేణులు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపనేని రత్తయ్య, మాల్యాద్రి, మాచర్లు, నానిబాబు, శివప్రసాదు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పథకాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ శ్రేణులు

బటన్ నొక్కాడని నమ్మితే రాష్ట్రం అధోగతే..!

టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం

వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలు, బీసీలు, మైనారిటీలపై దాడులు

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

ప్రజాస్వామ్య పరిరక్షణకు

స్వాతంత్ర్య సమరయోధుల్లా పోరాడాలని పిలుపు

సింగరాయకొండ, మార్చి 5 : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బటన్ నొక్కుతున్నారని ప్రజలు మోసపోయి ఆదమరిస్తే రాష్ట్రం అథోగతి పాలవుతుందని శాసనమండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు మహ్మద్ షరీఫ్ అన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక దేవి సీఫుడ్స్ ఎదురుగా ఉన్న ఆవరణలో మంగళవారం నిర్వహించిన టీడీపీ కొండపి నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం సమరయోధులు ఏవిధంగా పోరాటం చేశారో.. అదేస్ఫూర్తితో ముందుకుసాగి దుర్మార్గపు వైసీపీను గద్దెదించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 1983కు ముందు ఎటువంటి పరిస్థితులు ఉన్నాయో ఇప్పుడు కూడా అవే పరిస్థితులు ఉన్నాయని షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సంక్షేమం ఉండేవి కాదన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖపు నిర్ణయాలతో అదే పరిస్థితిలోకి నేడు రాష్ట్రాన్ని నెట్టివేశారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నా ఎస్సీలు. నా బీసీలు, నా మైనారిటీలంటూ వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మైనారిటీల అభివృద్ధికి రూ.3వేల కోట్లు ఖర్చుచేస్తే ఈప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం 45 రోజులపాటు అకుంఠిత దీక్షతో టీడీపీ శ్రేణులు పనిచేయాలని తెలిపారు.

దళిత ద్రోహి జగన్‌రెడ్డి :

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

దళితుల ఓట్లతో గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చిన తరువాత వారిని దగా చేసిన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. దళితులకు మేనమామనని కల్లబొల్లిమాటలు చెప్పి కంసమామగా మరారని ఆయన ధ్వజమెత్తారు. మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపేశారన్నారు. ఇసుక అక్రమ రావాణాను ప్రశ్నిస్తే దళితుడైన వరప్రసాద్‌కు శిరోముండనం చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. చీరాలలో మాస్కు పెట్టుకోలేదని కిరణ్ అనే యువకుడిపై అతిక్రూరంగా దాడిచేశారన్నారు. దళితకాలనీల్లో ఆడబిడ్డలపై అఘాత్యాలకు పాల్పడుతూ వారి జీవితాలను కాలరాస్తున్నారని రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ దొంగల పార్టీ అని దానికి ఓటు వేయవద్దని దళితులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో కృష్ణుడిలా దామచర్ల సత్య ఎన్నికల రథాన్ని తోలుతుంటే, అర్జునిడిలా స్వామి ప్రత్యర్థులపై బాణాలు సంధించి విజయ బావుటా ఎగురవేస్తారని జోస్యం చెప్పారు.



స్వామి, సత్యలతో గెలిపించాలని కోరుతున్న రామయ్య

జగన్ చంపింది రెడ్లనే : ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి

వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగన్‌రెడ్డి రాష్ట్రంలో అధికంగా చంపింది రెడ్లనేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. రెడ్లపై ఉక్కుపాదం మోపి, ఊచకోత కోసి వారి రక్తపు ఏరులపై రాజకీయ సౌధాన్ని నిర్మించుకున్న నరరూప రాక్షసుడు జగన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రా బోయే ఎన్నికల కురుక్షేత్రంలో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతారని, వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఎర్రచందనం స్మగ్లర్, తుడా నిధులను దోచుకున్న దుర్మార్గుడు, టీటీడీ టికెట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్న నీచుడైన చెవిరెడ్డిని ప్రశాంతంగా ఉండే ప్రకాశం జిల్లా నుంచి తరిమికొట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే స్థానికేతరుడైన సురేష్‌ను కాకుండా నియోజకవర్గ ప్రజల సాధక బాధలు తెలిసిన స్థానికుడైన స్వామిని గెలిపించాలని కోరారు.

కుల, మత రాజకీయాలు కొండపిలో చెల్లవు : ఎమ్మెల్యే స్వామి

ఎన్నికల సమయంలో వలసవచ్చి కొండపి నియోజకవర్గంలో మంత్రి సురేష్ చేస్తున్న కుల, మత రాజకీయాలు ఇక్కడ చెల్లవని ఎమ్మెల్యే స్వామి అన్నారు. గత ఎన్నికల్లో గెలిపించిన వైపాలెం ప్రజలను గాలికొదిలేసి ఇక్కడికి వచ్చి రెండు నెలల్లో అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ఐదేళ్లు మంత్రిగా వెలగబెట్టి ఏంసాధించావని స్వామి ప్రశ్నించారు. రూ.40 కోట్ల అవినీతి కేసులు కోర్టు నుంచి స్టేలు తీసుకొని తిరుగుతున్న నీవు ఏదో రోజు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రజలను మభ్యపెట్టడానికి సీఎం జగన్ ప్రారంభోత్సవం చేస్తున్నారని స్వామి మండిపడ్డారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిసి ముందుగా తన పేరుతో శిలాఫలకం వేసుకోవడానికి జగన్ వస్తున్నారని ఎద్దేవా చేశారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : దామచర్ల సత్య

కొండపి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో టీడీపీని ఎదుర్కొనేందుకు వైసీపీ ఇప్పటికే నలుగురు అభ్యర్థులను మార్చిందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అన్నింటికీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని సత్య తెలిపారు.

వచ్చే 45 రోజులు అప్రమత్తంగా ఉండాలి : ఉగ్ర నరసింహారెడ్డి

టీడీపీ శ్రేణులు వచ్చే 45 రోజులు అప్రమత్తంగా ఉండాలని కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. ఓటమి తప్పదని భావించిన వైసీపీ నేతలు దొంగ ఓట్లను చేరుస్తున్నారన్నారు. వాటిని బూత్ స్థాయిలో గుర్తించాలన్నారు. వైసీపీ నేతలు ఓటమి భయంలో ఇప్పుడే జిల్లాలోని గనులను లీజుకు రాయించుకుంటున్నారని మండిపడ్డారు.

ఓటమి భయంతోనే నేతల బదిలీలు : బీఎన్

ఓటమి భయంతోనే వేమూరు నుంచి మంత్రి మేరుగు నాగార్జునను సంతనూతలపాడుకు, వైపాలెం నుంచి సురేష్‌ను కొండపికి పంపిందని టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆనియోజకవర్గాలలో చెల్లని వారు ఇక్కడ ఎలా చెల్లుతారని ఆయన ప్రశ్నించారు. ఏళ్ల తరబడి స్థానికంగా రాజకీయం చేసే తమను ప్రజలు ఆశీర్వదించాలన్నారు.



బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్,అచ్చెన్నాయుడు, యనమల, రవీంద్ర తదితరులు

పోటెత్తిన జనం

పెదకాకాని: టీడీపీ, జనసేన చేపట్టిన జయహో బీసీ సభకు జనం పోటెత్తారు. జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. హైవే నుంచి నాగార్జున రైల్వే హాల్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా జనసంద్రంగా మారింది. జాతీయ రహదారిపై కంతేరు అడ్డరోడ్డు నుంచి టోల్‌గేట్ వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ప్రజలు హైవేపైనే వాహనాలు దిగి సభా ప్రాంగణం వద్దకు నడుచుకుంటూ వచ్చారు.

మంగళగిరి బీసీలకు హామీలు

జయహో బీసీ సభ వేదికగా చంద్రబాబును మంగళగిరి ప్రజల తరఫున లోకేశ్ కొన్ని హామీలు అడిగారు. దీంతో చంద్రబాబు స్పందించి హామీ ఇచ్చారు. మంగళగిరిలో అటవీ భూముల్లో ఉండే ప్రతీ ఒక్కరికి పూర్తి హక్కులు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. పేదలకు 20 వేల టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. మంగళగిరి చేనేతకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చే విధంగా చేస్తామని, ఆదాయం పెంచుతామన్నారు. టాటా సంస్థ భాగస్వామ్యంతో చేనేత శాల పెట్టి ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు, తాడేపల్లి పరిధిలో యూ-1 జోన్ ఎత్తేస్తామన్నారు.





బీసీల.. జయహో



జయహో.. బీసీ నినాదం మారుమోగింది. 153 కులాలతో 56 సాధికార కమిటీలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించిన అనంతరం రూపొందించిన టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గుంటూరు సమీ పంలో మంగళవారం జరిగిన బీసీ డిక్లరేషన్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది తరలి వచ్చారు. ఏపీఎస్ఆర్‌టీసీ బస్సులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం అడ్డంకులు కల్పించినా ప్రైవేటు వాహ నాలు, తెలంగాణ ఆర్‌టీసీ బస్సుల ద్వారా లక్షలాదిగా ప్రజలు సభకు తరలి వచ్చారు. ఎండని ఏమాత్రం లెక్క చేయ లేదు. సభ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. బీసీలను జగన్‌రెడ్డి ఊచకోత కోశాడని చంద్రబాబు, వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని సూటీగా, స్పష్టంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారు. బీసీలపై జగన్ ప్రభు త్వం చేసిన హత్యాకాండలు గురించి నేతలు వివరిస్తున్నప్పుడు సభకు హాజరైన వారిలో పలువురు రగలిపోయారు.



ట్రాక్టర్‌పై తరలివచ్చిన మహిళలు

- వర్సిటీ ఎదుట జనసంద్రం
- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన బీసీలు
- విజయవంతంగా బీసీ డిక్లరేషన్ సభ
- ఐక్యత చాటిన టీడీపీ - జనసేన శ్రేణులు

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని నాగార్జున యూనివర్సిటీ పరిసరాలు జయహో.. బీసీ నినాదం మారుమోగింది. బైబిల్ మిషన్ గ్రౌండ్ బీసీలతో నిండిపోయింది. సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ- జనసేన కూటమి నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది వెనుకబడిన తరగతుల వర్గాలు తరలివచ్చాయి. బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు.. బ్యాక్‌బోన్ క్లాసెస్ అని నిరూపిస్తామని నేతలు స్పష్టం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలపై జరిగిన దాడులను రెండు పార్టీల నేతలు తమ ప్రసంగాల్లో కళ్లకు కట్టారు. బీసీలను జగన్‌రెడ్డి ఊచకోత కోశాడని చంద్రబాబు అన్నారు. మాచర్లలో చంద్రయ్యని చంపే ముందు జై జగన్ అంటే వదిలేస్తామన్నా జై టీడీపీ... జైచంద్రబాబు అనడంతో ఆయన్ని హతమార్చారన్నారు. ఇలాంటివి ఏ విధంగా మరిచిపోగలమన్నారు. ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య అనే టీడీపీ నాయకుడిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దారుణంగా చంపించాడని, అయినా ఆయనకు ఎమ్మెల్యే సీటు ఇచ్చారన్నారు. బీసీలంటే తన పల్లకీని మోసే బోయిలని జగన్ భావిస్తున్నాడన్నారు. జగన్ అధికారంలోకి వస్తూనే ఇసుక లేకుండా చేసి బీసీలను కోలుకోలేని దెబ్బ తీశాడని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. వడ్డెరలకు పనులు లేకుండా చేసి వారికి జీవనోపాధి లేకుండా ఇబ్బంది పెట్టాడని చెప్పారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో నూ బీసీలకు పనులు దక్క కుండా తనకు చెందిన బడా సంస్థకు దక్కేలా చేసుకున్నాడన్నారు. ఇసుక, ఇతర గనులనూ కూడా సొంత మనుషులకు కట్ట బెట్టుకున్నాడన్నారు. అన్యాయం గురించి ప్రశ్నించినందుకు పలువురు బీసీలను హతమార్చారని వివరించారు. ఏ తప్పు చేయకపోయిన అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర వంటి వారిని జైలులో పెట్టించాడని, అక్రమ కేసులు బనాయించాడని చెప్పారు. అలానే పదోతరగతి విద్యార్థి తన సోదరిని వేధిస్తున్నందుకు ప్రశ్నించాడని పెట్రోలు పోసి నిప్పంటించి తగలబెట్టి హత్య చేసిన తీరు దారుణమని లోకేశ్ తెలిపారు. బాధిత కుటుంబాలను తన తల్లి భువనేశ్వరి ఆదుకుంటున్నారని లోకేశ్ చెప్పినప్పుడు చప్పట్లు కొట్టి హర్షధ్వానాలు చేశారు.



తెలంగాణ నుంచి ప్రత్యేక బస్సుల్లో

ఏపీ ప్రభుత్వం జయహో బీసీ సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించకపోవడంతో ప్రత్యామ్నాయంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసుకుని తిరువూరు తదితర నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలి వచ్చారు.



మంగళగిరి సిటీ: 'బీసీలంటే బలహీన వర్గాలు కాదు.. బీసీ అంటే ఒక భరోసా, ఒక బాధ్యత, ఒక భవిష్యత్. ఎంతో మంది బీసీ యువకులకు రాజకీయ అవకాశమిచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే. ఆ తర్వాత అన్ని రంగాల్లో బీసీలను ప్రోత్సహిస్తూ వారి సంక్షేమం కోసం చంద్రబాబు పాటుపడుతున్నారు. కానీ, సైకో జగన్ సీఎం అయ్యాక బీసీల వెన్నువిరిచి రాజకీయాలకు, రాజ్యాంగ బద్ధమైన పదవులకు బీసీలను దూరం చేస్తున్నారు..' అని జయహో బీసీ సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లు తగ్గించి 16 వేల మంది బీసీలను పదవులకు దూరం చేశారన్నారు. బీసీలకు చెందిన 8 వేల ఎకరాల ఎసైన్డు భూములను వెనక్కి తీసుకున్న పార్టీ వైసీపీ అన్నారు. ఆదరణ పథకాన్ని రద్దు చేయడంతోపాటు రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నేతలు ఏ కార్పొరేషన్‌కు కూడా

బీసీల వెన్ను విరిచిన సైకో

- 300 మంది హత్య.. 26 వేల మందిపై కేసులు
- జయహో బీసీ సభలో నారా లోకేశ్

కనీసం ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. చైర్మన్లు కూర్చోడానికి కుర్చీలు కూడా లేవని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక 300 మంది బీసీలను పొట్టన పెట్టుకున్నారన్నారు. 26 వేల మందిపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపిందన్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ సింగరి సంజీవ్‌కుమార్, పార్థసారధి మాటలను బట్టి వైసీపీలో బీసీల పరిస్థితి ఏమిటో అర్థమవుతుందని తెలిపారు. చేనేతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, ఆ ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. 53 వేల మెజార్టీతో గెలిచి మంగళగిరి సీటును అప్పగిస్తానని ఈ సందర్భంగా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.

ముందుకొచ్చిన లోకేశ్

బీసీ డిక్లరేషన్ సభని రాష్ట్రంలో ఎక్కడ నిర్వహించాలా అని అంత తర్జనభర్జన పడుతున్న సమయంలో మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ముందుకొచ్చి తన నియోజకవర్గం మంగళగిరి వద్ద సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తక్కువ సమయం అయినా శరవేగంగా ఏర్పాట్లు చేయించారు. భారీ ఏర్పాట్లతో పాటు సభను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే సభకు వివిధ జిల్లాల నుంచి బీసీలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

డిక్లరేషన్‌పై.. హర్షధ్వానాలు

జయహో... బీసీ బహిరంగ సభలో విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ లో పొందుపరిచిన 10 హామీలపై బీసీల నుంచి విశేష స్పందన లభిస్తోన్నది. బీసీలలో అందరికీ మేలు కలిగేలా ఎంతో కసరత్తు చేసి రూపొందించిన డిక్లరేషన్‌పై ఆ వర్గాల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమౌతోన్నాయి. చేతివృత్తులు, విద్యార్థులకు ఎంతో భరోసని కల్పిస్తోన్నది. పారిశ్రామిక ప్రోత్సాహకాల వల్ల కొత్త పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయని పలువురు విశ్లేషిస్తున్నారు. గత ఎన్నికల్లో బీసీలు చాలామంది వైసీపీకి అండగా నిలవడంతో ఆ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకొన్నది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను అణగదొక్కడం, దాడుల తో ఆ వర్గాలు ఇప్పటికే వైసీపీకి దూరమయ్యాయి. తాజాగా మంగళ వారం టీడీపీ - జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో వైసీపీకి ఆయా వర్గాలు పూర్తిగా దూరమయ్యే పరిస్థితి ఉత్పన్నమైంది. బీసీ డిక్లరేషన్‌లో తొలి హామీ 50 సంవత్సరాలకే పింఛన్ అమలు. అంతేకాకుండా నెలకు రూ.4 వేలకు పెంపు. దీని వల్ల లక్షలాది మంది బీసీలకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుంది. అభద్రతాభావంలో ఉన్న బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్న హామీ కొండంత భరోసాని కల్పిస్తోన్నది. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా 5 ఏళ్లలో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చంద్రబాబు ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ని వైసీపీ ప్రభుత్వం 34 నుంచి 24 శాతానికి తగ్గించింది. దీని వలన 16,800 మంది పదవులకు దూరమయ్యారు. తాము అధికారంలోకి వచ్చా 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని డిక్లరేషన్‌లో పొందు పరిచారు. చట్టసభల్లోనూ బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపతామన్నారు. తక్కువ జనాభాతో ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ల పేరిట జగన్ అవమానించగా జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు. ఆదరణ లాంటి 30 పథకాలు పునరుద్ధరించి రూ.5 వేల కోట్ల విడుదల. మండల/నియోజకవర్గ కేంద్రాల్లో కామన్ వర్క్‌షెడ్‌లు, పెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు, పారిశ్రామిక ప్రోత్సాహకాలను పునరుద్ధరిస్తామన్నారు. చట్టబద్ధంగా కులగణన నిర్వహించి బీసీలకు దక్కాల్సిన నిధులు కేటాయిస్తామన్నారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరణ. పెళ్లి కానుక రూ. 50 వేల నుంచి లక్షకు పెంచుతామన్నారు. శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందించి తరచుగా దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేకుండా చూస్తామన్నారు. విద్యా పథకాలన్నీ బీసీలకు పునరుద్ధరించేందుకు చంద్రబాబు హామీ ఇచ్చారు. స్టడీ సర్కిల్, విద్యోన్నతి పథకాల పునరుద్ధరణ ద్వారా బీసీ విద్యార్థులు త్వరితగతిన ఉద్యోగాలు పొందేలా చేస్తామన్నారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పారు.





హాజరైన బీసీ నాయకులు

భక్తిశ్రద్ధలతో.. నగరోత్సవం

వేటపాలెం(చీరాల), మార్చి 5: మండలంలోని పందిళ్లపల్లిలో శ్రీశైల మల్లన్న తలపాగా నగరోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో వేంచేసిన శ్రీగంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి ఆలయంలో గత 40 రోజులుగా శివదీక్షలో ఉన్న మాలధారులు నియమ, నిష్ఠలతో చేతిమగ్గంపై మల్లన్న తలపాగా వస్త్రాన్ని తయారుచేశారు. ఈనేపథ్యంలో దేవాంగ సంక్షేమ సంఘం, దేవల మనోబ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులు, శివస్వాములు నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ దేవాంగపురి పంచాయతీ హస్తినాపురానికి చెందిన పృధ్వీ వెంకటేశ్వర్లు కుమారుడు వెంకటసుబ్బారావు ఆశీస్సులతో మల్లన్న తలపాగాను తయారు చేసినట్లు తెలిపారు. నగరోత్సవంలో కర్రసాము, కోలాటం, చౌడేశ్వరి అమ్మవారి దండకం పారాయణం తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూజా కార్యక్రమాల అనంతరం పెద్దసంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవాంగ ప్రముఖులు సత్రం మల్లేశ్వరరావు, బీరక సురేంద్ర, జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి, డాక్టర్ సజ్జా హేమలత, గుత్తి విశ్వేశ్వరరావు, బండ్ల బాబు, రాహుల్, అరుణ్‌బాబు, శ్రీనివాసరావు, బ్రహ్మం, పద్మజ, నందనరావు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపులో శివస్వాములు, భక్తులు



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

బాపట్ల, మార్చి 5: ఇంటర్మీడియట్ పరీక్షల్లో అవాంతరాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పట్టణంలోని బాపట్ల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. 368మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్ఐవో యర్రయ్య, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

58 ఆవాసాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : జిల్లాలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా 58 హ్యాబిటేషన్లకు నీటిని అందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ ఆలీ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో నీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, ఏఈఈలు, ఏఈలు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నీటి సరఫరా చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కరెంటోళ్లపై రైతుల కన్నెర్ర

శంకరాపురం సబ్‌స్టేషన్ ముట్టడి



సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

ముండ్లమూరు, మార్చి 5 : వ్యవసాయ విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయడం లేదంటూ రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. మంగళవారం రాత్రి మండలంలోని శంకరాపురం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ త్రీఫేజ్‌లో ఇవ్వకపోవడంతో మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం వ్యవసాయానికి కేవలం గంట మాత్రమే ఇవ్వడంపై నిరసన తెలిపారు. వ్యవసాయానికి బుధవారం నుంచి నిరంతరం తొమ్మిది గంటలపాటు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేదరమెట్ల రామాంజనేయులు, జాస్తి చిన్నా, గంగినేని సత్యం, పోలవరపు నాగేశ్వరరావు మరో 30 మంది రైతులు పాల్గొన్నారు.

ఆయుర్వేద సేవలకు గుర్తింపు

జాతీయ స్థాయిలో ఘనత పొందిన డాక్టర్ మురళీకృష్ణ



కేంద్రీయ ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఫెలోఆఫ్ నేషనల్ అకాడమి ఆఫ్ ఆయుర్వేద అవార్డు అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

మేదరమెట్ల, మార్చి 5: ఆయుర్వేద వైద్యంలో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద వైద్యకళాశాలలో అధ్యాపకుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన డాక్టర్ మురళీకృష్ణకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ఆయూష్‌బోర్డు అటానమస్‌గా నిర్వహించే నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేద మురళీకృష్ణను ఫెలోషిప్‌తో గౌరవించింది. మంగళవారం న్యూఢిల్లీలోని కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ పి.మురళీకృష్ణకు ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమీ ఆయుర్వేద అవార్డుతో సత్కరించారు. న్యూఢిల్లీలోని కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ అయిన నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేద న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన 27వ స్నాతకోత్సవంలో కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ కొటేచా, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షుడు పద్మభూషణ్ డాక్టర్ దేవేంద్ర త్రిగుణ, నేషనల్ ఆయుర్వేద అకాడమి డైరెక్టర్ డాక్టర్ వందన, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఢిల్లీ డైరెక్టర్ తనూజా నెస్రీల చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. ఆయుర్వేద వైద్యంలో 36 సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మందుల తయారి యూనిట్‌కు ఇన్‌చార్జ్‌గా మురళీకృష్ణ మొన్నటివరకు బాధ్యతలు నిర్వహించారు. ఈ 36 ఏళ్ల సుదీర్ఘ అధ్యాపక జీవితంలో ఆస్ట్రేలియా, యూరప్ దేశాలు, సింగపూర్, దుబాయ్ వంటి దేశాలతోపాటు భారత్‌లోని ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్, జిప్‌మర్, పాండిచ్చేరిలోని వైద్యవిశ్వవిద్యాలయంతోపాటు పూణే, ఢిల్లీ వంటి చోట్ల ఆయుర్వేద వైద్యంపై ఆయన ప్రసంగాలు చేశారు. రోగుల పట్ల ఎంతో ఆదరణతో ఉండే మురళీకృష్ణ, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. వారు వృతిపరంగా ఆయన్ను నిరంతరం గుర్తు చేసుకోవడం ఆయనకు ఆయుర్వేద వైద్యం పట్ల నిబద్ధతకు నిదర్శనం. సెంట్రల్ ఆయూష్ రిసెర్చ్ బోర్డులో దక్షణాది నుంచి ఏకైక సభ్యునిగా సేవలందించారు. పలు ప్రతిష్టాత్మక కేంద్ర ఆయూష్‌బోర్డు నియమించిన కమిటీల్లో ఆయన ఎంపికై రాష్ట్రానికే గుర్తింపు తెచ్చారు. జాతీయ స్థాయిలో అతి తక్కువ మందికి లభించే ఈ పురస్కారం మురళీకృష్ణకు లభించడం ఆయన సేవలకు గుర్తింపు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవలరావూరులో ఈయన జన్మించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ఎంతోమంది నిత్యం ఆయన వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. ఆయన ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల దైవాలరావూరు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ని కల్లలో..



గొట్టిపడియ ముంపు గ్రామం

వెలిగొండ ప్రాజెక్టుపై వింత పోకడ

జాతికి అంకితం పేరుతో ఆర్భాటం

జనాన్ని మోసగించేందుకు జగన్ సిద్ధం

చుక్కనీరు లేకుండానే ప్రారంభానికి సన్నాహాలు

పూర్తికాని టన్నెళ్లు, అప్రోచ్, ఫీడర్ కెనాల్, హెడ్ రెగ్యులేటర్ పనులు

పరిహాసంగా మారిన పునరావాసం

నేడు సీఎం చేతులమీదుగా ప్రారంభోత్సవం

కృష్ణా నదిలో నీళ్లే లేవు. ప్రారంభించాలనుకున్న ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వలేదు. పునరావాసం ఏర్పాటు చేయలేదు. రెండో సొరంగంలో టన్నెల్ బోరింగు మిషన్(టీబీఎం) అలాగే ఉండిపోయింది. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉన్నా, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును హడావుడిగా ప్రారంభించడానికి సిద్ధపడిపోయారు. అంతా తామే పూర్తిచేశామని చెప్పుకోవడంలో భాగంగా ఇలా ఆర్భాటం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రతిపక్షాలు మండిపడుతుండగా, ముంపువాసులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగానే ఇలా చేస్తున్నారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మార్కాపురం/పెద్ద దోర్నాల, మార్చి 5: పశ్చిమ ప్రకాశంతోపాటు నెల్లూరు, కడప జిల్లాల వరప్రదాయిని అయిన వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేస్తున్నానంటూ సీఎం జగన్ జనాన్ని మరోమారు మోసం చేయడానికి సిద్ధమయ్యాడు. గత ఎన్నికల హామీగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదికి వెలిగొండ ప్రాజెక్ట్‌ను నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆ హామీని గాలికి వదిలేశాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా నాలుగుసార్లు తేదీలు మారుస్తూ వాయిదాలు వేశాడు. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించిన పాపాన పోలేదు. ప్రాజెక్ట్ నిర్మాణ పనులు, పునరావాస చర్యలను పరిశీలిస్తే మరో రెండేళ్ల సమయం పడుతుందని ఇంజనీరింగ్ అధికారులే చెబుతున్నారు. కానీ ఎన్నికల వేళ సీఎం జగన్ మాత్రం హడావుడిగా ప్రాజెక్టును జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసగించడానికి సిద్ధమయ్యారు.

ప్రతిపాదనలకే పరిమితమైన పరిహారం

వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస చర్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సుంకేసుల డ్యాం ముంపు గ్రామాలైన కలనూతల, చింతలముడిపిల నిర్వాసితులకు ఇడుపూరు-1లో 951, ఇడుపూరు-2లో 386 మందికి నివేశన స్థలాల పట్టాలు మంజూరు చేశారు. కానీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించలేదు. వీరికి సంబంధించి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినప్పటికీ, వారి నుంచి స్పందన కరువైంది.

ముంపుగ్రామమైన సుంకేసుల నిర్వాసితులకు తోకపల్లిలో 310 మందికి, గోగులదిన్నెలో 1,193 మందికి నివేశన స్థలాలకు పట్టాలు మంజూరు చేశారు. కానీ మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది.

గుండంచర్ల, కాటంరాజుతాండ నిర్వాసితులకు దేవరాజుగట్టు వద్ద పునరావాస కాలనీ ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. మౌలిక వసతుల కల్పన పనులు ప్రారంభం కాలేదు. గుండంచెర్లలో 1,210మంది నిర్వాసితులకుగాను ఆర్‌అండ్ఆర్ కింద 634మంది, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 576 మంది ఉన్నారు. కాటంరాజుతాండలో ఆర్‌అండ్ఆర్ కింద 19 మంది, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 24మంది ఉన్నారు. ఇందుకు సంబంధించి తదుపరి చర్యల నిమిత్తం కిందిస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా తదుపరి చర్యలు శూన్యం.

గొట్టిపడియ డ్యాం పరిధిలో...

గొట్టిపడియ డ్యాం ముంపు గ్రామాలైన గొట్టిపడియ, అక్కచెరువుతాండ నిర్వాసితులకు మార్కాపురం మండలం వేములకోట సమీపంలో 83.54 ఎకరాల భూమిని పునరావాస కాలనీకి ఎంపిక చేశారు. గొట్టిపడియలో 735మంది, అక్కచెరువులో 86 మంది నిర్వాసితులకు నేటికీ నివేశన స్థలాలకు లబ్ధిదారులు మొగ్గుచూపలేదు. దీంతో నేటికీ పట్టాలు తయారు చేయలేదు. పునరావాస కాలనీలో మౌలిక వసతులు పూర్తికాలేదు.

కాకర్ల డ్యాం పరిధిలో...

అర్ధవీడు మండలం కాకర్ల డ్యాం పరిధిలోని సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం, కృష్ణానగర్, లక్ష్మీపురంలలో 341మంది నిర్వాసితులున్నారు. వీరికి బేస్తవారపేట మండలం ఒందుట్ల వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది. ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కింద క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతస్థాయి అధికారులకు ప్రతిపాదనలు వెళ్లాయి కానీ ఎప్పుడు నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో అర్థం కాని పరిస్థితి.

పెండింగు పనులున్నా ప్రారంభానికి సిద్ధం

ప్రాజెక్టు పరిధిలో రెండు సొరంగాల అంతర్భాగంలో సుమారు 7 కిలోమీటర్ల మేర సిమెంటు కాంక్రీటుతో లైనింగ్ చేయాల్సి ఉంది. రెండు సొరంగాలను కలుపుతూ ఫీడర్ కెనాల్‌కు అనుసంధానించే కాలువ పనులు పూర్తిగా చేయలేదు. టన్నెళ్ల నుంచి వచ్చే నీరు ఫీడర్ కెనాల్‌కు పోవడం మాట పక్కన పెడితే ఫీడర్ కెనాళ్ల నుంచే నీళ్లు టన్నెళ్ల లోపలికి వెళ్లే విధంగా నిర్మించారు. దీంతో సొరంగాల నుంచి వచ్చే ఊట నీటిని మోటార్లతో బయటకు పంప్ చేస్తున్నారు. అయితే అప్రోచ్ కాలువ అసంపూర్తిగా ఉండటంతో ఆ నీరు సొరంగాల్లోకి వస్తుండటంతో అడ్డుగా కట్ట వేశారు.

దశాబ్దం క్రితం నిర్మించిన ఫీడర్ కెనాల్

ఫీడర్ కెనాల్‌ను దశాబ్దం క్రితం నిర్మించారు. అప్పట్లో కట్టలు మట్టితో వేయడం, నిర్వహణ లేకపోవడంతో అవి బలహీనపడ్డాయి. ఎక్కడచూసినా కోతలు కనిపిస్తాయి. కొద్దిపాటి వర్షాలకు వచ్చే వరద నీటినే ఈ కట్టలు తట్టుకునే పరిస్థితిలో లేదు. కడపరాజుపల్లె, కటకానిపల్లె సమీపంలో గండ్లు పడి కట్టలు తెగి సమీప పంట పొలాల్లోకి నీరు ప్రవహించిన ఘటనలు ఉన్నాయి. గతంలో ఏకంగా కడపరాజుపల్లెలోకి వరదనీరు చేరింది. రెండు హెడ్ రెగ్యులేటర్ల వద్ద కూడా కొంత పనులు పెండింగులో ఉన్నాయి. ఫీడర్ కెనాల్‌పై బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది.

ఎక్కడి పనులు అక్కడే

ప్రస్తుతం తీగలేరు కాలువ పనులు చిల్లకంప పెరిగి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మొదటి విడతలో భాగంగా కేవలం నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించాలన్నా, రెండు సొరంగాలు పటిష్టంగా నిర్మించాల్సి ఉంది. మొదటి సొరంగంలో కిలోమీటరుకుపైగా, రెండో సొరంగంలో 6కిలోమీటర్లకుపైగా లైనింగు చేయాలి. ఈ పనులు చేయాలన్నా కనీసం ఏడాదిన్నర కాలం పడుతుందని ఆ శాఖాధికారులే తెలిపారు. రెండో సొరంగంలోని టీబీఎంను బయటకు తరలించాలంటే కుదరని పనిగా చెబుతున్నారు. అప్పటి కోస్టల్ కాంట్రాక్టర్లను అర్ధంతరంగా నిర్మాణం నుండి తొలగించారు. దీంతో తమకు నష్టం వాటిల్లిందని నష్టపోయిన సొమ్మును ఇప్పించాలని వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ సమస్య కోర్టులోనే పెండింగ్‌లో ఉంది. వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు రెండో సొరంగంలో తవ్విన మట్టి రాళ్లను మొదటి సొరంగం పొడవునా రెండు, మూడు అడుగుల మేర నింపేశారు. తొలగింపు చర్యలు చేపట్టలేదు. దీంతో నీటి ప్రవాహానికి కొంత అంతరాయం ఏర్పడుతుంది. సొరంగాల నిర్మాణాలు ప్రభుత్వం ఒప్పందం ప్రకారం గుండ్రంగా ఉండాలి. ప్రస్తుతం 'డీ' ఆకారంలో నిర్మించినట్లు తెలిసింది. దీంతో ఖర్చు తగ్గుతుంది. సొరంగం వ్యాసం తగ్గుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అయినా ఆ పనులు జరగాలన్నా రెండేళ్లు పట్టే అవకాశం ఉంది. గతంలో ఇనుము, సిమెంటుతో తయారుచేసిన సెగ్మెంట్లను ఎప్పటికప్పుడు టీబీఎంతో లైనింగు చేసేవారు. ప్రస్తుతం మాన్యవల్‌గా బాంబులతో పేల్చి సొరంగాలను తవ్వారు. లైనింగ్ చేయకుండా నీళ్లు ఇచ్చే అవకాశం లేదని ఇంజనీరింగ్ అధికారులే చెబుతున్నారు. ఇన్నీ పెండింగు పనులున్నా సీఎం ప్రారంభానికి సిద్ధం కావడం గమనార్హం.

వెలిగొండపై జగన్ హామీలు

- 2021 అక్టోబరు 7న ఒంగోలులో: వెలిగొండ ప్రాజెక్ట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసే విధంగా అడుగులు వేస్తున్నాం. మొదటి టన్నెల్‌ను 2022 ఆగస్టు నాటికి పూర్తిచేసి దానికి ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తాం. 2023 ఫిబ్రవరి నాటికి రెండవ టన్నెల్‌ను కూడా పూర్తిచేసి 9000 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టుకు అందిస్తాం.
- 2022 ఆగస్టు 23న చీమకుర్తిలో: 2023 సెప్టెంబరు నాటికి వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తాం. ప్రాజెక్ట్‌కు నీళ్లిచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళతాం.
- 2023 ఏప్రిల్ 12న మార్కాపురంలో: వెలిగొండ ప్రాజెక్ట్‌లో భాగమైన మొదటి టన్నెల్ తవ్వకం ఇప్పటికే పూర్తయింది. రెండవ టన్నెల్‌ను సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి పూర్తి చేస్తాం. మళ్లీ జిల్లాకు వచ్చి ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేస్తాం.
- 2023 సెప్టెంబరు 20న నంద్యాల జిల్లా లక్షవరంలో: ఈ ఏడాది అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయనున్నాం.
- 2024 మార్చి 6న పనులు, పరిహారం, పునరావాసం పట్టించుకోకుండానే, అటు ప్రాజెక్ట్ పూర్తికాకుండానే జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యాడు.



గొట్టిపడియ డ్యాం



టన్నెల్ వద్ద నిర్మించిన పైలాన్



అసంపూర్తిగా ఫీడర్ కాలువను కలిపే అప్రోచ్ కాలువ

గంగపాలెంలో నాలుగు ఇళ్లలో చోరీ

తాళాలు వేసిన గృహాలలో చోరీకి పాల్పడిన దుండగులు

తాళ్లూరు, మార్చి 5 : మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెంలో తాళాలు వేసిన ఇళ్లల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే... గంగపాలేనికి చెందిన కొంతమంది వివిధ వృత్తుల్లో ఇతర ప్రాంతాల్లో ఉంటూ స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటారు. సయ్యద్ మౌలాలి, సయ్యద్‌మస్తాన్ వలి, పఠాన్ మీరావలి, పఠాన్ మస్తాన్‌వలి ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో సోమవారం రాత్రి దుండగులు ప్రవేశించి కొన్ని గృహాల ద్వారాలను తగులబెట్టి బీభత్సం సృష్టించారు. ఆ నాలుగు కుటుంబాల వారు ఇతర ప్రాంతాల్లో ఉంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చి వెళుతుంటారు. తొలుత సయ్యద్ మౌలాలి ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు ఇంటిలోపల వస్తువులను తగులబెట్టారు. ఇంటిలోని వస్తువులను ఎత్తుకెళ్లారు. మిగిలిన ముగ్గురికి చెందిన ఇళ్లలోకి ప్రవేశించి బీరువా తాళాలు, అన్ని గదుల తలుపులు పగలగొట్టి విలువైన ఆభరణాలను, చీరెలు ఇతరత్రా సామగ్రిని దొంగిలించుకెళ్లారు. సోమవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన గ్రామస్థులు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి తెలియజేశారు. బాధితులు ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఏ మాత్రం చోరీ జరిగిందనేది బాధితులందరూ వచ్చి ఇళ్లను పరిశీలిస్తేనే తెలిసే అవకాశం ఉంది.

బటన్ నొక్కాడని నమ్మితే రాష్ట్రం అధోగతే..!

టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం

వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలు, బీసీలు, మైనారిటీలపై దాడులు

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వాతంత్ర్య సమరయోధుల్లా పోరాడాలని పిలుపు

సింగరాయకొండ, మార్చి 5 : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బటన్ నొక్కుతున్నారని ప్రజలు మోసపోయి ఆదమరిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని శాసనమండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు మహ్మద్ షరీఫ్ అన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక దేవి సీఫుడ్స్ ఎదురుగా ఉన్న ఆవరణలో మంగళవారం నిర్వహించిన టీడీపీ కొండపి నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్యం కోసం సమరయోధులు ఏవిధంగా పోరాటం చేశారో.. అదే స్ఫూర్తితో ముందుకుసాగి దుర్మార్గపు వైసీపీను గద్దెదించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 1983కు ముందు ఎటువంటి పరిస్థితులు ఉన్నాయో ఇప్పుడు కూడా అవే పరిస్థితులు ఉన్నాయని షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సంక్షేమం ఉండేవి కాదన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖపు నిర్ణయాలతో అదే పరిస్థితిలోకి నేడు రాష్ట్రాన్ని నెట్టివేశారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నా ఎస్సీలు. నా బీసీలు, నా మైనారిటీలంటూ వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మైనారిటీల అభివృద్ధికి రూ.3వేల కోట్లు ఖర్చుచేస్తే ఈప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం 45 రోజులపాటు అకుంఠిత దీక్షతో టీడీపీ శ్రేణులు పనిచేయాలని తెలిపారు.

దళిత ద్రోహి జగన్‌రెడ్డి : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

దళితుల ఓట్లతో గద్దెనెక్కి అధికారంలోకి వచ్చిన తరువాత వారిని దగా చేసిన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. దళితులకు మేనమామనని కల్లబొల్లిమాటలు చెప్పి కంసమామగా మరారని ఆయన ధ్వజమెత్తారు. మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపేశారన్నారు. ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నిస్తే దళితుడైన వరప్రసాద్‌కు శిరోముండనం చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. చీరాలలో మాస్కు పెట్టుకోలేదని కిరణ్ అనే యువకుడిపై అతిక్రూరంగా దాడిచేశారన్నారు. దళితకాలనీల్లో ఆడబిడ్డలపై అఘాత్యాలకు పాల్పడుతూ వారి జీవితాలను కాలరాస్తున్నారని రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ దొంగల పార్టీ అని దానికి ఓటు వేయవద్దని దళితులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో కృష్ణుడిలా దామచర్ల సత్య ఎన్నికల రథాన్ని తోలుతుంటే, అర్జునిడిలా స్వామి ప్రత్యర్థులపై బాణాలు సంధించి విజయ బావుటా ఎగురవేస్తారని జోస్యం చెప్పారు.



స్వామి, సత్యలతో గెలిపించాలని కోరుతున్న రామయ్య

జగన్ చంపింది రెడ్లనే : ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి

వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగన్‌రెడ్డి రాష్ట్రంలో అధికంగా చంపింది రెడ్లనేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. రెడ్లపై ఉక్కుపాదం మోపి, ఊచకోత కోసి వారి రక్తపు ఏరులపై రాజకీయ సౌధాన్ని నిర్మించుకున్న నరరూప రాక్షసుడు జగన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతారని, వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఎర్రచందనం స్మగ్లర్, తుడా నిధులను దోచుకున్న దుర్మార్గుడు, టీటీడీ టికెట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్న నీచుడైన చెవిరెడ్డిని ప్రశాంతంగా ఉండే ప్రకాశం జిల్లా నుంచి తరిమికొట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే స్థానికేతరుడైన సురేష్‌ను కాకుండా నియోజకవర్గ ప్రజల సాదక బాధలు తెలిసిన స్థానికుడైన స్వామిని గెలిపించాలని కోరారు.

కుల, మత రాజకీయాలు కొండపిలో చెల్లవు : ఎమ్మెల్యే స్వామి

ఎన్నికల సమయంలో వలసవచ్చి కొండపి నియోజకవర్గంలో మంత్రి సురేష్ చేస్తున్న కుల, మత రాజకీయాలు ఇక్కడ చెల్లవని ఎమ్మెల్యే స్వామి అన్నారు. గత ఎన్నికల్లో గెలిపించిన వైపాలెం ప్రజలను గాలికొదిలేసి ఇక్కడికి వచ్చి రెండు నెలల్లో అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ఐదేళ్లు మంత్రిగా వెలగబెట్టి ఏంసాధించావని స్వామి ప్రశ్నించారు. రూ.40 కోట్ల అవినీతి కేసులు కోర్టు నుంచి స్టేలు తీసుకొని తిరుగుతున్న నీవు ఏదో రోజు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రజలను మభ్యపెట్టడానికి సీఎం జగన్ ప్రారంభోత్సవం చేస్తున్నారని స్వామి మండిపడ్డారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిసి ముందుగా తన పేరుతో శిలాఫలకం వేసుకోవడానికి జగన్ వస్తున్నారని ఎద్దేవా చేశారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : దామచర్ల సత్య

కొండపి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో టీడీపీని ఎదుర్కొనేందుకు వైసీపీ ఇప్పటికే నలుగురు అభ్యర్థులను మార్చిందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అన్నింటికీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని సత్య తెలిపారు.

వచ్చే 45 రోజులు అప్రమత్తంగా ఉండాలి : ఉగ్ర నరసింహారెడ్డి

టీడీపీ శ్రేణులు వచ్చే 45 రోజులు అప్రమత్తంగా ఉండాలని కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. ఓటమి తప్పదని భావించిన వైసీపీ నేతలు దొంగ ఓట్లను చేరుస్తున్నారన్నారు. వాటిని బూత్ స్థాయిలో గుర్తించాలన్నారు. వైసీపీ నేతలు ఓటమి భయంలో ఇప్పుడే జిల్లాలోని గనులను లీజుకు రాయించుకుంటున్నారని మండిపడ్డారు.

ఓటమి భయంతోనే నేతల బదిలీలు : బీఎన్

ఓటమి భయంతోనే వేమూరు నుంచి మంత్రి మేరుగు నాగార్జునను సంతనూతలపాడుకు, వైపాలెం నుంచి సురేష్‌ను కొండపికి పంపిందని టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆనియోజకవర్గాలలో చెల్లని వారు ఇక్కడ ఎలా చెల్లుతారని ఆయన ప్రశ్నించారు. ఏళ్ల తరబడి స్థానికంగా రాజకీయం చేసే తమను ప్రజలు ఆశీర్వదించాలన్నారు.

రోడ్డున పడుతున్న సర్పంచ్‌లు

ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకోకుండా ఆంక్షలు

ఇప్పటికే భారీగా దారిమళ్లింపు

సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ అదే పరిస్థితి

నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం వెనుకాడటం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఏమైనా మాకేంటి అన్న విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంతో పంచాయతీ పాలకవర్గాలు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రోడ్డు మీదకు రావాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ నిధులను రాత్రికి రాత్రే దారిమళ్లించింది. ప్రస్తుతం కూడా అదే విధానాలను అవలంభిస్తుంటడంతో సర్పంచ్‌లు మళ్లీ ఆందోళన బాట పడుతున్నారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థికసంఘం నిధులను సుమారు రూ.8,629 కోట్లను దారిమళ్లించింది. అందులో మన జిల్లాలో కూడా సుమారు రూ.450 కోట్లకుపైగా దారిమళ్లాయి. తాజాగా కేంద్రప్రభుత్వం రెండు నెలల క్రితం 15వ ఆర్థికసంఘం నిధులను సుమారు రూ.40కోట్లు మంజూరుచేయగా, వివిధ పన్నుల రూపంలో మరో ఏడేనిమిది కోట్లు పంచాయతీ అకౌంట్లకు చేరాయి. ఆ నిధులను కూడా ప్రభుత్వం దారిమళ్లించేందుకు ప్రయత్నం చేయడంతో పాలకవర్గాలు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం అవేమి పట్టించుకోలేదు. ప్రస్తుతం కూడా పంచాయతీ నిధులను విద్యుత్ బకాయిలు, కార్మికుల జీతాల పేరుతో దారిమళ్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు పంచాయతీ పాలకవర్గాలు చేసిన ప్రయత్నాలను ప్రభుత్వం అడ్డుకుంటుండటంతో చేసేదేమీ లేక పంచాయతీ సర్పంచ్‌లు ఆందోళనలకు మరోసారి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పంచాయతీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



సార్వత్రిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

- గ్రామాలలో పోలీసు సిబ్బంది పర్యటన



బల్లికురవలో మాట్లాడుతున్న సీఐ నరసింహారావు, ఎస్ఐ నాగశివారెడ్డి

బల్లికురవ, మార్చి 5: రానున్న సార్వత్రిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు తెలిపారు. మంగళవారం బల్లికురవ కూడలిలో యువకులతో సీఐ నరసింహారావు, ఎస్ఐ నాగశివారెడ్డి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎలాంటి అల్లర్లకు పాల్పడొద్దని చెప్పారు. గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపడితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రతిరోజు పోలీసులు గ్రామాలలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఏవైన సమస్యలు ఉంటే వారికి తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. గ్రామాలకు పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేసి ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాలలో సంచరిస్తుంటే అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీలు జరగకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

ముడిరాయి లారీ బోల్తా.. పది గొర్రెలు మృతి



బ్రేకులు ఫెయిలై బోల్తాపడిన గ్రానైట్ ముడిరాయి లారీ

బల్లికురవ, మార్చి 5: మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాల ముందు గ్రానైట్ ముడిరాయి లారీ బ్రేకులు ఫెయిలై గొర్రెల మందపైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది గొర్రెల వరకు అక్కడికక్కడే మృతి చెందాయి. అందిన సమాచారం మేరకు.. సంతమాగులూరు మండలం గురిజేపల్లి నుంచి ఉప్పుమాగు లూరు గ్రామ పరిధిలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలకు ముడిరాయిని తీసుకువస్తున్న ట్రాలీ లారీ ఉన్నత పాఠశాల వద్దకు వచ్చేసరికి బ్రేకుల్ ఫెయిలయ్యాయి. దీంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న సూరేపల్లి మల్లికార్జునకు చెందిన గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈక్రమంలో పది గొర్రెలు మృతి చెందగా, లారీ రోడ్డు మార్జిన్‌లో పడిపోయింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే లారీకి సంబంధించిన యజమానులు వచ్చి డ్రైవర్‌ను వైద్యశాలకు తరలించి, గొర్రెల యజమానులకు నష్టపరిహారం అందించే చర్యలు చేపట్టారు.

నారీశక్తి వందన్‌యాత్ర ర్యాలీ



నారిశక్తి వందన్ యాత్రలో బీజేపీ నేతలు

అద్దంకి, మార్చి 5: నారీశక్తి వందన్‌యాత్ర ర్యాలీని మంగళవారం అద్దంకి పట్టణంలో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నారిశక్తి వందన్ జిల్లా ఇన్‌చార్జ్ సాధినేని, బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ పులి వెంకట కృష్ణారెడ్డి, యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రావిపాటి కాశీదేవి, రామకృష్ణ, కాలేషాబాబు, విరాట్, శ్రీనివాసరావు, విష్ణువర్ధన్, వెంకటేశ్వర్లు, భావనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో సంకల్ప బలం

ఒంగోలు(కల్చరల్), మార్చి 5 : సూర్య నమస్కారాల సాధన ద్వారా విద్యార్థులలో సంకల్ప బలం పెరిగి వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహా సూర్య వందనం కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. హెచ్‌సీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో సుభద్ర మాట్లాడుతూ సూర్య నమస్కారాలు శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక శక్తిని కూడా ఇస్తాయని, నిరంతరం వాటి సాధన వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత్ టాలెంట్ వరల్డ్ రికార్డ్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం త్రోవగుంట, ఉలిచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

నైపుణ్య శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : నైపుణ్య శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని కలెక్టర్ దినేస్‌కుమార్ అన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను మంగళవారం ముఖ్యమంత్రి విశాఖపట్నం నుంచి ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఐటీఐ బాలుర, బాలికల కళాశాల ప్రాంగణంలో నిర్మించిన శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌డీఈ ఏడీ శ్రీను, హెచ్‌ఆర్‌అండ్ ఎంఐఎస్‌ఈ శ్రీనివాసాచారి, ప్లేస్‌మెంట్ అధికారి ఈజ్‌బాషా, నాన్ టెక్నికల్ ఆఫీసర్ సాయి ప్రణీత్, కో ఆర్డినేటర్లు అనూష, విద్యాసాగర్, రెహమాన్, రమేష్. నాగేశ్వరరావు, ప్రభుత్వ బాలుర, బాలికల ప్రిన్సిపాల్స్ పీ భాస్కర్‌బాబు, ఉమామహేశ్వరదేవి ఉన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

ఒంగోలు(విద్య), మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయంలో మహిళా అధ్యాపకులు, అధ్యాపకేతరులకు, బాలికలకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఏకేయూ వైస్ చాన్స్‌లర్ మారెడ్డి అం జిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఎంతగానో పెంచుతాయన్నారు. వ్యక్తిలోని ఒత్తిడిని కూడా తగ్గించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం మ్యూజికల్ చైర్, షాట్‌పుట్, లెమన్ అండ్ స్పూన్, టెన్నికాయిట్ వంటి ఆటలను నిర్వహించారు. బాలికలకు పాటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈనెల 7న జరిగే మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, డాక్టర్ అంచుల భారతిదేవి, డాక్టర్ నిర్మలామణి, డాక్టర్‌ఐ దేవీ వరప్రసాద్ ఉన్నారు.

అద్దంకిలో నిలిచిన మంచినీటి సరఫరా

అద్దంకి, మార్చి 5: అద్దంకి పట్టణంలో మంచినీటి సరఫరా నిలిచిపోయింది. పట్టణానికి మంచినీటి సరఫరా చేసేందుకు గుండ్లకమ్మ నదిలో ఊటబావుల నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని పంపింగ్ చేసి విడుదల చేస్తుంటారు. గతంలో మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉండగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరి కులేందుకు సిద్ధంగా ఉండటంతో నీటి పంపింగ్ నిలిపి వేశారు. దీంతో రామ్‌నగర్, కాకానిపాలెం లలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నుంచి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీటి విడుదల జరుగుతుంది.

సోమవారం రాత్రి గుండ్లకమ్మ నది లోని ఊటబావుల వద్ద నుంచి రామ్‌నగర్ ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే మోటార్ మరమ్మతులకు గురైంది. దీంతో నీటి పంపింగ్ జరగలేదు. మంగళవారం ఉదయం నుంచి అద్దంకి పట్టణంలో సుమారు సగభాగానికి నీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం మధ్యాహ్నానికి మోటార్ ఊడదీసి షెడ్ తరలించటం మాత్రమే చేశారు. మరమ్మతులకు కనీసం రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రెండు రోజుల పాటు సగం పట్టణానికి నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. తరచూ మోటార్లు మరమ్మతులకు గురవుతున్నా స్పేర్ మోటార్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించటం పై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

వేసవి ప్రారంభం కావటంతో నీటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో పాటు మోటార్‌లు కూడా మరిన్ని ఎక్కువ సార్లు మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పేర్ మోటార్ అందుబాటులో ఉంచితే కొంతమేర సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు.

తిరునాళ్లకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయాలకతీతంగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసుకోవాలి
- అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి
- ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



తిరుణాళ్ల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

అద్దంకి, మార్చి 5: శింగరకొండ తిరుణాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 69వ వార్షిక తిరుణాళ్ల ఉత్సవాలు ఈనెల 23 నుంచి 25 వరకు జరగనున్నాయి. ఈనేపథ్యంలో పలుశాఖల అధికారులతో మంగళవారం శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ త్వరలో మరోసారి జరిగే కోఆర్డినేషన్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పక్కా ప్రణాళికతో హాజరుకావాలన్నారు. భక్తులకు త్వరితగతిన స్వామి వార్ల దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. చెత్త తొలగింపులో అలసత్వం వహిస్తే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ మాట్లాడుతూ తిరుణాళ్ల నాటికి ఎన్నికల కోడ్ అమలు ఉంటున్నందున రాజకీయాలకతీతంగా తిరుణాళ్లకు విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల జెండాలు ఏర్పాటు చేయరాదన్నారు. బాణసంచాలు కాల్చేందుకు, అనుమతికి మించి మైక్‌లు ఏర్పాటును సహించేది లేదన్నారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు దేవాలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

సమావేశంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఈవో కోటిరెడ్డి, తహసీల్దార్ మహబూబ్ సుభాని, సీఐ కృష్ణయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈ సత్యనారాయణ, ఏఈ శివప్రసాద్, ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు తరలివెళ్లిన శ్రేణులు

అద్దంకి, మార్చి 5: జయహో బీసీ సభకు అద్దంకి పట్టణ, మండల బీసీ నేతలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. స్థానిక పోతురాజుగండి వద్ద టీడీపీ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన వాహనాలకు టీడీపీ నేత కామేపల్లి బ్రహ్మనాయుడు జెండా ఊపారు. బీసీ సభకు తరలివెళ్ళినవారిలో టీడీపీ అద్దంకి మండల అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు యర్రాకుల రామాంజనేయులు, బచ్చల వాసు, కొటికలపూడి మౌలాలి, జిలాని మాబు, రసూల్ శ్రీను, మొహిద్దీన్‌వలి, సుబ్బారావు, రావులపల్లి వెంకటరావు, పాపారావు, తదితరులు ఉన్నారు.



జయహో బీసీ సభకు వెళ్తున్న అద్దంకి మండల, పట్టణ నేతలు

చీరాల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయం ఎదురు మంగళవారం టీడీపీ, జనసేపార్టీలు ఉమ్మడిగా చేపట్టిన జయహో బీసీ మహాసభకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాల్లో కొండయ్యతో కలిసి వెళ్లారు.



చీరాల: జయహో బీసీ సభకు తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు



పర్చూరు: బీసీ సభకు తరలివెళుతున్న కార్యకర్తలు

ఇంకొల్లు: జయహో బీసీ సదస్సుకు ఇంకొల్లు మండలం నుంచి భారీగా నేతలు తరలివెళ్లారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మండలం నుంచి 15 వాహనాలలో తరలివెళ్లారు. నాయకులు జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, వలేరు మార్క్, వీరగంధం ఆంజనేయులు, గుంజి వెంకట్రావు, బోడెంపూడి సుబ్బారావు, సాంబయ్య నాగయ్య, రాంబాబు, కరి వీరాంజనేయులు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: జయహో బీసీ సభకు మండల పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. మండల పరిధిలోని సంతరావూరు, గొనసపూడి, కడవకుదురు, చినగంజాం, పల్లెపాలెం, మోటుపల్లి, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని బీసీ నేతలు జయహో బీసీ సభకు వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో బీసీ నాయకులు నక్కల వీరరాఘవులు, వాటుపల్లి ఏడుకొండలు, వడ్లమూడి వెంకయ్య, ఎన్‌వీ నారాయణ, దండుప్రోలు తిరుపతిరావు, గొల్లపోతు వెంకటేశ్వర్లు, అతిన సురేష్, కొత్తగర్ల అశోక్, పోకల అంజయ్య, పాలడుగు రవి, కొక్కిలిగడ్డ రామాంజనేయులు, తదితరులు తరలివెళ్లారు.

మార్టూరు: మండలంలోని వివిధ గ్రామాలనుంచి టీడీపీ శ్రేణులు పలు వాహనాలలో జయహో బీసీ సభకు తరలి వెళ్లారు. వలపర్ల, నాగరాజుపల్లి, మార్టూరు, జొన్నతాళి, కోలలపూడి, ద్రోణాదుల తదితర గ్రామాల నుండి వాహనాలలో కార్యకర్తలు వెళ్లారు. మార్టూరులో పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి తరలి వెళ్లారు. అలాగే, యద్దనపూడి మండలంలోని పలుగ్రామాల నుంచి కార్యకర్తలు వాహనాలలో తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, గుడే తారక రామారావు, కోయ సతీష్, రావి పాటి సీతయ్య, బోయపాటి సాంబయ్య తదితరుల పర్యవేక్షణలో కార్యకర్తలు వాహనాలలో వెళ్లారు.

పంగులూరు: మండలంలోని పలుగ్రామాల నుంచి బీసీ నేతలు, కార్యకర్తలు మంగళవారం జయహో బీసీ సదస్సుకు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ముప్పవరం నుంచి బయలుదేరిన ర్యాలీని టీడీపీ మండల నేత కుక్కపళ్ళి ఏడుకొండలు స్థానిక నేతలతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు పునాది వేశారని గౌడ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దాసరి హనుమంతరావు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమి గెలుపునకు తామంతా కృషిచేస్తామని చెప్పారు.

పర్చూరు: తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారత కమిటీ ఆధ్వర్యంలో గుంటూరులోని అచార్యనాగార్జున విశ్వవిద్యాలయం సమీప ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జయహో బీసీ సభకు పర్చూరు నియోజవర్గం నుండి తెలుగు తమ్ముళ్ళు, జనసైనికులు భారీగా తరలివెళ్ళారు. ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేసుకొని సభకు తరలివెళ్ళి బీసీ ఐక్యతను చాటారు.

స్వచ్ఛందంగా స్పందించారు..

- రోడ్లను కమ్మేసిన చిల్లచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు



పర్చూరు - యద్దనపూడి రోడ్డు మార్జిన్‌లో చిల్లచెట్లు, ముళ్ళపొదల తొలగింపు

పర్చూరు, మార్చి 5: ఓవైపు రహదారి అధ్వానం, మరోవైపు రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో తరచూ వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రమాదాల బారిన పడి ప్రజలు మత్యువాత పడుతుండటంతో యద్దనపూడి మండలం జాగర్లమూడికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు దూళ్లిపల్లి వెంకటస్వామి స్పందించారు. తన సొంత నిధులు వెచ్చించి, రహదారిని కమ్మేసిన చిల్లచెట్లు, ముళ్ళపొదలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు పట్టించుకోకపోయినా స్వచ్ఛందంగా ముళ్లచెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టడంతో ప్రజలు హర్షం చేస్తున్నారు. ఇదే రహదారిలో గడిచిన నెల వ్యవధిలో ఇద్దరు మృతి చెందారు.

పర్చూరు - యద్దనపూడి ఆర్ అండ్‌బీ రోడ్డును చిల్లచెట్లు కమ్మేయటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే ఆర్‌అండ్‌బీ రోడ్డులో రెండు నెలల క్రితం పర్చూరు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో పూజా కార్యక్రమం నిర్వహించుకొని తిరిగి ఇంటికి వెళుతున్న పూజారి పర్చూరు నుండి జాగర్లమూడి వెళ్ళే రహదారిలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రదాన రోడ్లను కమ్మేసిన చిల్లచెట్లను తొలగించటంతో పాటు గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- బాపట్ల ఆర్డీవో రవీందర్



మాట్లాడుతున్న ఆర్‌డీవో రవీందర్

పర్చూరు, మార్చి 5: ఎన్నికలను పారదర్శకంగా ఎలాంటి వివాదాలు, విద్వేషాలకు తావులేకుండా నిర్వహించాలని బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జి.రవీందర్ అన్నారు. అందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై ఆర్‌డీవో అధ్యక్షత రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా హాజరైన ప్రతినిధులకు నామినేషన్ల ప్రక్రియ గురించి, వివిధ యాప్‌ల పని పద్ధతుల గురించి పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.వెంకటేశ్వర్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులు, వ్యయ పరిశీలకులు, వివిధ టీం పోలీస్ అధికారులకు సహకారం అందించాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించటమే ధ్యేయంగా కమిటీలలోని అధికారులు, పోలీసులు పనిచేయాలన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు తావులేకుండా ఎన్నికలను నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఏఈఆర్‌వోలు సీహెచ్ సుబ్బయ్య, కె.సంధ్యశ్రీ, వై.నాగరాజు, మెహర్‌బాబు, ప్రమీల, ఎం.ఫణీంద్ర, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా వెలగని వీధి దీపాలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కొత్తపేట పంచాయతీ ప్రసాదనగరంలో వెలగని వీధిదీపం

చీరాల, మార్చి 5: చీరాల నియోజకవర్గంలోని పంచాయితీలలో వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకర్గంలో చీరాల, వేటపాలెం మండ లాల పరిధిలో 24 పంచాయతీలు ఉన్నాయి. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీకి మాత్రమే సర్పంచ్, వార్డు సభ్యుల పాలకవర్గం ఉంది. మిగిలిన 23 పంచాయతీలకు గతంలో కొన్ని కారణాలతో కొన్ని గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించటంతో ఎన్నికలు ఆగాయి. దీంతో పాలకవర్గాలు లేవు. అధికారులే బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 35కు పైగా గ్రామాలు ఉన్నాయి. ఇవి కాక కరకట్టలపై జీవించేవారు పలు ప్రాం తాల్లో ఉన్నారు.

ఈనేపథ్యంలో గ్రామాలలో వీధి దీపాలు సక్రమంగా వెలగక ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో శివారు ప్రాంతాలు, కరకట్టలపై జీవనం సాగించేవారికి వీధిదీపాలే వారికి వెలుగు. అవి వెలగకుంటే అంధకారమే. ఇదేమని అడిగిన వారికి నిధుల కొరత అనే సమాధానం వస్తుందని చెప్తున్నారు.



పగలు వెలుగుతున్న వీధి దీపం

ఇదిలాఉంటే కొన్నిచోట్ల పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఒకవైపు నిధుల కొరత అంటూ సక్రమంగా నిర్వహణ చేపట్టక పగలు కూడా వీధి దీపాలు వెలుగుతుంటే ఆ బిల్లులు తడిసిమోపెడు కావా అని ఆయ ప్రాంతాల ప్రజలు మండిపడు తున్నారు. సరైన రీతిలో నిర్వహణ చేపట్టి వీధి దీపాలు ప్రతిరోజు రాత్రివేళల్లో సక్రమంగా వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, మార్చి 5: స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వ్యాయామంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనటం అభినందనీయమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము చేపడుతున్న కార్యక్రమాలను అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేష్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ముందున్నాం

వేటపాలెం(చీరాల), మార్చి 5: నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ముందున్నామని, ప్రాధాన్యత క్రమంలో దాదాపు అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నట్టు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలో గత ఐదేళ్ల కాలంలో రూ.10.13 కోట్లు వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. తాజాగా రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన దేశాయిపేట-1 సచివాలయం భవనం, రూ.17.50లక్షల వ్యయంతో నిర్మించిన శ్మశాన ప్రహరీగోడను ప్రారంభించారు.

దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

చీరాల, మార్చి 5: జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, అందులో భాగంగా చీరాల సీటు చేనేతలకు కేటాయించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని ఈపురుపాలెంలో మంగళవారం జరిగిన ఐక్యవేదిక సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు అండగుండ నారాయణ, మునగాల గిరిధర్, గోలి శివయ్య, మునగపాటి నాగ మల్లేశ్వరరావు, పంచల శ్రీనివాసరావు, మాగం మురళి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి పట్ల ఏలూరి సంతాపం

ఇంకొల్లు, మార్చి 5: మండలంలోని హనుమోజిపాలెంకు చెందిన మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బ్రహ్మయ్య మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రహ్మయ్య మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

8న మెగా వైద్య శిబిరం

మార్టూరు, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా మహిళా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యాలయం ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిటెక్ లిమిటెడ్ సంయుక్తంగా విజయవాడకు చెందిన సెంటినీ, హెచ్‌సీజీ హాస్పిటల్ సహకారంతో ఎమ్మెల్యే సాంబశివరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. మార్టూరు ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం

పేరాల(చీరాలటౌన్), మార్చి 5: పుస్తక పఠనంతో విజ్ఞానం వస్తుందని పేరాల ఎఆర్ఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాల్మన్‌రాజు పేర్కొన్నారు. ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఆర్గనైజేషన్ వారు పాఠశాలకు సుమారు రూ.30 వేలు విలువగల విలువైన పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దాతలు పాఠశాలకు విలువైన పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోట నాగేశ్వరరావు, పవని భానుచంద్రమూర్తి, గాంధీ, రాజేంద్రప్రసాద్, కృష్ణమోహన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

రామాపురం(చీరాలటౌన్), మార్చి 5: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రామాపురం గ్రామస్థులతో ఎన్నికల నేపథ్యం, నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏదయినా సమస్య ఉంటే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సత్యనారాయణ, ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి

సంతమాగులూరు, మార్చి 5: ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని పీడీ బి.అర్జునరావు తెలిపారు. మంగళవారం మండలంలోని వెల్లలచెరువు పంచాయతీలో పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామి కూలీలందరికి కనీస వేతనం రూ.272 పడేవిధంగా పనిచేయాలని అన్నారు. అనంతరం సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులపై సమీక్షించారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

సంతమాగులూరు, మార్చి 5: వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాలల్లోను స్త్రీలు సమున్నత స్థానాల్లో విశేష కృషి చేస్తున్నారని సీడీపీవో డి.సుధ తెలిపారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాల్యవివాహాలపై, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బేటీ బచావో, బేటీ పడావో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి దినేష్‌కుమార్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

అద్దంకి, మార్చి 5: వరకట్న వేధింపులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణానికి చెందిన విద్యారాణికి ఇంకొల్లు మండలం పావులూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రతాప్‌తో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో విద్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 5 : బాలల ఉచిత నిర్బంద విద్యా హక్కు చట్ట ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశానికి మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో పేదలు, అనాథలు, దివ్యాంగులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు 25శాతం సీట్లు కేటాయించారు. జిల్లాలో మొత్తం 360 ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. ఒంగోలు నగరంలో అత్యధికంగా 81 పాఠశాలల్లో సీట్లు కేటాయిస్తారు. ఈ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. ఈనెల 25లోపు ఆశక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, నెట్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సుభద్ర కోరారు.

నేడు ఎమ్మెల్యే రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మార్చి 5: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు కశ్యాపురం, 10.30కి రాచపూడి, మధ్యాహ్నం ఒంటి గంటకు మల్లాయపాలెం, సాయంత్రం 6 గంటలకు కల్లంవారిపాలెం, రాత్రి 8.30కి కొరిశపాడు, 9.30 గంటలకు శింగరకొండలోని కమ్మ సత్రంలో జరిగే కార్య క్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

బుధవారం 6 మార్చి 2024



లక్ష్యం.. శత శాతం!

● పది విద్యార్థులకు సకల సౌకర్యాలు ● పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు ● 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో రామారావు

ఇంటర్వ్యూ

'పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యార్థుల్లో నిగూఢంగా దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసి వారిని చక్కని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు నూతన ప్రణాళికలను అనుసరిస్తూ ఉపాధ్యాయులను సమాయత్తం చేశాం. భయం వీడి ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా సకల ఏర్పాట్లు చేశాం' అని జిల్లా విద్యాశాఖాధికారి పీజేవీ.రామారావు స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీన ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న తీరు, నిర్వహణకు చేపడుతున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..



ఆత్మకూరులోని బీసీ బాలికల హాస్టల్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థినులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ఏడాది 34,078 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికోసంగా జిల్లావ్యాప్తంగా కేంద్రాలను పరిశీలించి ఏ సెంటర్లు 94, బీ సెంటర్లు 57, సీ సెంటర్లు 25 కలిపి 176 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశాము. వీటిలో 14 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి అందులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. అలాగే 48 స్టోరేజీ పాయింట్లలో ప్రశ్నపత్రాలను ఉంచడంతో పాటు ఫ్లయింగ్‌స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌లను సిద్ధం చేస్తున్నాము.

● **పక్కా ప్రణాళికతో ముందుకు..**

ఈ ఏడాది పరీక్షలు రాసే విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికతో చదివిస్తున్నాం. ప్రత్యేకంగా పురోగమి పేరుతో స్టడీ మెటీరియల్ తయారు చేసి ప్రతి విద్యార్థికి అందచేశాం. ప్రతిరోజూ ఏదో ఒక పరీక్ష నిర్వహించి అభ్యసనా సామర్థ్యాలను పెంపొందిస్తున్నాము. వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి సిలబస్‌ను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. అలాగే పరీక్ష కేంద్రాలకు అనుగుణంగా 16 నుంచి 20 మంది విద్యార్థులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నాము. అన్ని పాఠశాలలను తనిఖీ చేసి అవసరమైన చోట బెంచీలు ఉండేలా హెచ్‌ఎంలు చర్యలు చేపడుతున్నారు.

● **ప్రశ్నపత్రంపై కోడ్**

టెన్త్ ప్రశ్నపత్రంపై ఈసారి కోడ్ అమలు చేస్తున్నాం. దీనివల్ల ప్రశ్నపత్రం లీక్ కావడం వంటి సంఘటనలు ఉండవు. ఒకవేళ ఏదైనా తప్పు జరిగినా అది ఎక్కడ జరిగిందో తెలిసిపోతుంది. అలాగే మాస్ కాపీయింగ్ నివారణకు ఇది దోహద పడుతుంది. పరీక్ష సమయంలో విద్యార్థులకు



అందజేసే 24 పేజీల బుక్‌లెట్‌లోనే సమాధానాలు రాయాలి. ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణలోనే విద్యార్థులకు పబ్లిక్‌పై అవగాహన కలిగింది. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడల్లా టెన్త్ విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్నాము. ఎఫ్‌ఏ, ఎస్‌ఏలలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను ప్రధాన పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాము. సబ్జెక్ట్ నిపుణులు ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.

● **అన్ని శాఖల అధికారులతో సమన్వయం**

విద్యా, రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్, వైద్యం, పోస్టల్ తదితర శాఖ అధికారులను సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నాము. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి గదిలో ఫ్యాన్, మంచినీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము. గదిలో గాలి వెలుతురు ఉండేలా చూడటంతోపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాము. మెడికల్ కిట్లతో ఏఎన్‌ఎంలనూ కేంద్రాల వద్ద నియమిస్తున్నాము.

● **విద్యార్థులూ కంగారు పడొద్దు!**

విద్యార్థులు ఎలాంటి ఆందోళన, కంగారు పడకుండా ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలకు హాజరవ్వాలి. పరీక్షల భయం వీడి పాఠశాలల్లో ప్రీ పబ్లిక్ పరీక్షలకు హాజరైన రీతిలోనే ప్రధాన పరీక్షలకూ హాజరు కావాలి. అయితే ఇవి కీలకమైన పరీక్షలు కనుక పరీక్ష సమయానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరి వారికి కేటాయించిన గదుల్లో కూర్చోవాలి. మెరుగైన ఫలితాలు సాధించేందుకు సంసిద్ధం కావాలి.

- నెల్లూరు (విద్య)

● **మాస్‌కాపీయింగ్ కట్టడికి**

జంబ్లింగ్ విధానంలో జరుగుతున్న పరీక్షల్లో విద్యార్థులు చూచిరాతలకు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు దృష్టి సారిస్తారు. గదిలో తక్కువమంది ఉంటారు కాబట్టి కాపీయింగ్‌కు పాల్పడే అవకాశాలు ఉండవు. దీనికోసంగా ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి హెచ్‌ఎంలకు సూచనలు జారీ చేశాం. చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇస్తున్నాము. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే గతంలో ఫోన్ అనుమతి ఉండేది. ప్రస్తుతం సీఎస్‌కు కూడా అనుమతి లేదు. 2వేల మంది ఇన్విజిలేటర్లతో పాటు 176 మంది సీఎస్‌లు, 176 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాము. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

● పురుషామృగ వాహనంపై త్రినేత్రుడు



నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు, చప్పర ఉత్సవం జరిగాయి. సాయంత్రం విశేష పూలంగిసేవ, పూజలు చేశారు. పురుషామృగ వాహనంపై ఆదిదేవుడు దర్శనమిచ్చాడు. ఈ ఉత్సవాన్ని ఆలయ చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, ధర్మకర్తలు, ఉభయ కర్తలు, ఈవో వేణుగోపాల్ పర్యవేక్షించారు. గురువారం ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి శేషవాహన సేవ జరగనున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)

నేడు ప్రభుత్వ వైద్యకళాశాల స్నాతకోత్సవం

● పాల్గొననున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం, మార్చి 5 : మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం నెల్లూరు నగరంలో జరిగే ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారు. 7వ తేదీ ఉదయం 11.30 గంటలకు వరిష్ఠ రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని నెల్లూరు కస్తూరిదేవి హైస్కూల్ ప్రాంగణంలోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్‌భవన్‌లో ఆవిష్కరిస్తారు. అదేరోజు సాయంత్రం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే మహిళకు వందనం కార్యక్రమంలో పాల్గొంటారు. 8వ తేదీ రాత్రి 8 గంటలకు శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి కాకినాడకు వెళ్తారు.

19 నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

● తూ తూ మంత్రంగా ఉభయకర్తల సమావేశం

బిట్రగుంట, మార్చి 5: బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. ఎంతో ఆర్భాటంగా జరిగే ఈ ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి భక్తజనం తరలివస్తుంది. అలాంటి ఉత్సవాలపై పాలక వర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏర్పాట్లు తదితర అంశాలపై సోమవారం సాయంత్రం ఉభయకర్తలతో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించి మమ అనిపించారు. ఆలయ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి అందుబాటులో లేని కారణంగా ఈవో రాధాకృష్ణ, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం తదితరులు మాత్రమే ఈ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఉత్సవాలకు 13 రోజులే గడువున్నా ఇప్పటిదాకా కరపత్రాలు, గోడపత్రికలు పంపిణీ చేయక పోవడంపైనా భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మద్దతివ్వండి.. లేదు పోటీలో ఉంటా!

● మంత్రి కాకాణికి తేల్చి చెప్పిన విష్ణు

అల్లూరు, మార్చి 5 : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మంగళవారం రాత్రి అల్లూరులోని విష్ణు నివాసంలో కలిసి చర్చించారు. అరగంటసేపు వారిద్దరూ ఏకాంతంగా చర్చించారు. అనంతరం బయటకు వచ్చిన మంత్రి ఎవరితో మాట్లాడకుండా వెళ్లిపోయారు. విలేకరులతో విష్ణు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి మాట మార్చారన్నారు. ఇప్పుడు కూడా ఎమ్మెల్సీ ఇస్తానని మంత్రి కాకాణి తన వద్ద ప్రస్తావించారని, ఇందుకు తాను పోటీలో ఉండటమే తుది నిర్ణయంగా తన అభిప్రాయాన్ని చెప్పానన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బుధవారం సమాధానం ఇస్తానని కాకాణి చెప్పినట్లు విష్ణు తెలిపారు. ప్రజల చేత ఎన్నుకోబడిన పదవులు తప్ప దొడ్డిదారిన తీసుకునే ఈ పదవులు తనకు వద్దని ఆయన కరాఖండీగా చెప్పారు. అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, విష్ణు అభిమానులు తదితరులు ఉన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

వైసీపీలో గుర్తింపు ఏదీ!?

● పార్టీలో కొనసాగడంపై త్వరలో నిర్ణయం

● కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు

కావలి, మార్చి 5 : '2014లో అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు మేరకు వైసీపీలో చేరి కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో వైసీపీ అభ్యర్థుల విజయం కోసం పని చేశాను. దాదాపు పదేళ్లు గడుస్తున్నా పార్టీలో నాకు గుర్తింపు ఇవ్వలేదు. ఆత్మీయుల అభిప్రాయం మేరకు వైసీపీలో కొనసాగాలా!? లేదా టీడీపీలో చేరాలా అనే దానిపై త్వరలో నా నిర్ణయం చెబుతా'నని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కావలి ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లలోని తన కార్యాలయంలో మంగళవారం కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని తన అనుచరులతో వంటేరు సమావేశమయ్యారు. వైసీపీ రాజకీయ సలహాదారులుగా కొనసాగుతున్న వంటేరు తన అనుచరులతో సమావేశం కావడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. తాను కావలి ఎమ్మెల్యేగా పని చేసినపుడు చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ఆత్మీయుల సలహా మేరకు త్వరలో తన నిర్ణయం వెల్లడిస్తానని ఆయన అన్నారు. కాగా, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితోపాటు కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డితో ఆయన టచ్‌లో ఉన్నట్టు సమాచారం.

12న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

నెల్లూరు (జడ్పీ), మార్చి 5 : జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి ఈ సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రణాళిక, ఆర్థిక విషయాలు, పనులు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

'సోమశిల'లో 15.239 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి జలాశయంలో 15.239 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

100.36 శాతం పల్స్‌పోలియో

నెల్లూరు (వైద్యం), మార్చి 5 : పల్స్‌పోలియో కార్య క్రమం లక్ష్యాన్ని మించి విజయవంత మైంది. మంగళవారం 1485 మందికి పోలియో చుక్కలు వేశారు. జిల్లా వ్యాప్తం గా 2,93,536 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వే యాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించగా 100.36 శాతం పూర్తిచేసి 2,94,575 మందికి చుక్కల మందు వేశారు. మొదటి రోజు ఆదివారం 98.02 శాతం, సోమవారం 1.83 శాతం, మంగళవారం 0.51 శాతం పోలియో వ్యాక్సిన్ పం పిణీ జరిగింది.

స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలు గుర్తించండి

● రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ రత్నకుమారి



మాట్లాడుతున్న రత్నకుమారి

నెల్లూరు (సిటీ), మార్చి 5 : స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలను గుర్తించి ఆ మేరకు నివేదికలు తయారు చేయాలని ఏపీ 5వ ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ ఎస్ రత్నకుమారి ఆదేశించారు. మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాల యంలో విభాగాధిపతులతో ఆమె సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి, జవాబుదారీతనం పెంచడానికి, ప్రణా ళికేతర వ్యయాన్ని తీర్చడానికి తగు అంచనాలను సూచించాలన్నారు. స్థానికంగా ఆర్థికపరమైన వ్యయాలను నివేదికల్లో పేర్కొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కృపాకర్‌రావు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న ఆర్వోయూ ట్యాంకులు

● మూత పడుతున్న మదర్‌ప్లాంట్లు

● కాంట్రాక్టర్‌కు రూ.4కోట్ల వరకు పెండింగ్

● ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో తీరని దాహం

బకాయిలు రాక..
శుద్ధజలం అందక!

ఉదయగిరి రూరల్, మార్చి 5 : జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో తిండి, ఉపాధి కొరతే కాదు. తాగునీటికీ తిప్పలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి ఫ్లోరైడ్ సమస్యతో ఉదయగిరి నియోజకవర్గంలోని అనేక గ్రామాలు సతమతమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజలస్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులు అప్పట్లోనే 90 శాతం పూర్తి చేసుకున్నాయి. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వైఎస్‌ఆర్ సుజల స్రవంతిగా పేరు మార్చింది. పథకం పనులు పూర్తి చేసి అరకొరగా నీటి సరఫరాకు చర్యలు చేపట్టింది. అయితే, పనులు చేసిన కాంట్రాక్టర్‌కు సుమారు రూ.4 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉండటంతో పథకం నిర్వహణకు చేతులెత్తా శారు. దీంతో పథకం మూలకు చేరింది. కోట్ల రూపాయలు విలువ చేసే పరికరాలు, వాహనాలు, ఆర్వోయూ యూనిట్‌లు నిరుపయోగంగా మారాయి.

పేదలపై నీటిభారం

పథకం లక్ష్యం నీరుగారడంతో ప్రజలు శుద్ధజలం కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొంది. పథకం పని చేస్తుంటే రూ.5లకే 20 లీటర్ల శుద్ధజలం అందేది. శుద్ధజలం అందుబాటులో లేకపోవడంతో బయట 20 లీటర్ల క్యాన్‌ను రూ.10 నుంచి 15 చొప్పున కొనుగోలు చేయాల్సి ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి శుద్ధజలం అందేలా చర్యలు చేపట్టాలని మెట్టప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఉదయగిరి : కుర్రపల్లిలో మూతపడ్డ వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంట్

● **రూ.19.81 కోట్లతో**

ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలతోపాటు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లోని అన్ని పంచాయతీలకు శుద్ధజలం అందించేందుకు సుమారు 19.81 కోట్లతో పథకాన్ని ప్రారంభించారు. ప్రతి మండలంలో మదర్‌ప్లాంట్ నిర్మించి బోర్లు సైతం ఏర్పాటు చేశారు. మదర్‌ప్లాంట్ నుంచి పంచాయతీలో ఏర్పాటు చేసిన రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఆర్వోయూ)లకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా ప్రణాళిక రూపొం దించారు. నీటి సరఫరాకు సంబంధించి ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు పొందిన వ్యక్తి కొన్ని రోజుల పాటు ఆయా మండలాల్లో అరకొరగా ఆర్వోయూలకు నీటిని సర ఫరా చేశారు. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండ టంతో ప్రస్తుతం మదర్‌ప్లాంట్‌లు మూతప డుతున్నాయి. ఉదయగిరి మండలంలో కుర్రపల్లి గ్రామ పిల్లాపేరు వాగు సమీపంలో సుమారు గంటకు 10 వేల లీటర్ల నీటిని ఫిల్టర్ చేసే మదర్ ప్లాంట్ మూతపడింది. దీంతో మండలంలో పలు గ్రామాలకు శుద్ధజలం సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ మూతపడడంతో అందులో పని చేస్తున్న సిబ్బంది ఉపాధి కోల్పోయారు.

ఇంటింటా 'సోలార్' వెలుగులు

● విద్యుత్ వినియోగదారుల కోసం కేంద్ర పథకం

● 150 యూనిట్లు వాడుతున్న వారికి అవకాశం

● రూ.30వేల నుంచి 78వేల వరకు సబ్సిడీ



నెల్లూరు (జడ్పీ), మార్చి 5 : సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలోలా కాకుండా పేద కుటుంబాల నుంచి ప్రతి కుటుంబం సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక సబ్సిడీ కూడా అందించనున్నారు. గతంలో భారీ భవంతులు ఉంటే తప్ప సోలార్ విద్యుత్ పరికరాల ఏర్పాటుకు అవకాశం ఉండేది కాదు. అయితే ఈ దఫా ఒక కిలోవాట్ నుంచే సోలార్ విద్యుత్ తయారు చేసుకునేలా చిన్న ఇంటిపైనా పరికరాలు ఏర్పాటు చేసుకునేలా వీలు కల్పించారు.

● **పథకం వివరాలు..**

జిల్లాలో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీని ప్రకటించింది. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా సోలార్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో ఒక కిలోవాట్ నుంచి 5, 6కిలోవాట్స్ వరకు విద్యుత్‌ను ఉత్పత్తిని చేసుకోవచ్చు. నెలకు 150 యూనిట్ల మేర వాడకం ఉన్న వినియోగదారుడు తన ఇంటిపై 1 నుంచి 2 కిలోవాట్స్ వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. ఇంటి శ్లాబుపైన కేవలం పది చదరపు మీటర్ల స్థలం ఉంటే సరిపోతుంది. 1 కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.75వేల మేర ఖర్చవుతుండగా రూ.30వేల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. దీనిద్వారా నెలకు 100 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే 2కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఏర్పాటుకు రూ.1.4 లక్షలు ఖర్చవుతుండగా రూ.60 వేలు సబ్సిడీగా ఉంటుంది. 3 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.1.92 లక్షలు ఖర్చవుతుండగా రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. దీనిద్వారా 300 యూనిట్లు మేర విద్యుత్ ఉత్పత్తి చేసుకునే వీలు కలుగుతుంది.

● **దరఖాస్తు ఇలా చేసుకోవాలి**

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోదలచిన వారి కోసం విద్యుత్ సంస్థ రెండు యాప్‌లను రూపొందించింది. పీఎం సూర్య ఘర్ యాప్, క్యూఆర్‌టీపీఎం సూర్య ఘర్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని అందులో పొందుపరిచిన వివరాల మేరకు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే వినియోగదారుడి ఇంటి స్లాబ్ పటిష్టతను ప్రత్యేక ఇంజనీర్ ద్వారా ధ్రువీకరించిన పత్రాన్ని, ప్రస్తుతం వినియోగిస్తున్న విద్యుత్ బిల్లును (ఆరు నెలలు) అందజేయాల్సి ఉంటుంది. అలాగే నెట్ మీటర్ ఏర్పాటు తర్వాత ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభిస్తే కేంద్రం అందించే సబ్సిడీ మొత్తం ఆ ఖాతాలో జమ అవుతుంది.

కొరవడిన పారిశుధ్యం

- ఆత్మకూరులో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచుల వాడకం
- మురుగు కాలువల్లో పడి నిండుతున్న వైనం
- రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ఆత్మకూరు: పట్టణంలో పాలిథిన్ కవర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కాల్చివేస్తే విషవాయువుగా మారి పరిసరాలను కలుషితం చేస్తున్నాయి. పాలిథిన్ కవర్లను వాడవద్దని మున్సిపల్ అధికారులు చెప్తున్నా... ప్రజలు వాడుతూనే ఉన్నారు. ప్రభుత్వం నిషేధించినా సక్రమంగా అమలు జరగడంలేదు. ప్లాస్టిక్ సంచులను వ్యాపార్లు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆత్మకూరులోని వీధుల్లో చెత్తాచెదారంతో పాటు పాలిథిన్ కవర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాతావరణం కాలుష్యంతోపాటు పారిశుధ్యం అధ్వానస్థితికి చేరుకోవడానికి ఇవి కారణమవుతున్నాయి. పాలిథిన్ సంచులను వీధుల్లో, కాలువల్లో పారేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తు న్నాయి. కొన్నిచోట్ల మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. దోమలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. పాలిథిన్ సంచుల వాడ కాన్ని నిషేధించినా ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో వాటి వాడకా న్ని మానడం లేదు.

వింజమూరు: స్థానిక వీఆర్ పంక్షన్ ప్లాజా ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డులోని మురుగుకాలువ పూడికతో నిండిపోయింది. ఈ సమస్యతో మురుగు నీరు రోడ్డు మీదకు పారుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తోంది. దుర్వాసన వస్తుండటం వల్ల జనాలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యను పరిష్కరించాలని చుట్టుపక్కల షాపు యజమానులు అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇంటి, షాపు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ అవసరాలను తీర్చడంలో లేదన్నారు.



మురుగు కాలువలో పేరుకుపోయిన పాలిథిన్ సంచులు

అభివృద్ధి పనుల ప్రారంభం

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి నడిగడ్డ అగ్రహారం, మాముడూరులో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, సుధాకరరెడ్డి, సొసైటీ చైర్మన్ వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు కమిషనర్ షేక్ ఫజుల్లులా మంగళవారం స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. స్థానిక 17వ వార్డులో కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని వాటితో వ్యాధుల బారినపడతామో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మురుగుకాలువలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయని చెప్పారు. అన్నివార్డుల్లో క్రమంతప్పకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పారిశుధ్య పనులు చేప ట్టాలని కమిషనర్‌ను స్థానికులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, గందళ్ల వేణు, నాయకులు, మున్సిపల్ అధికారి ఖాసీం, సిబ్బంది పాల్గొన్నారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ ఫజుల్లులా

ప్రత్యేక బస్సులు నడిపేందుకు సహకరించండి



నాయకులతో చర్చిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

ఉదయగిరి, మార్చి 5: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయగిరి డిపో నుంచి సిద్ధేశ్వరం, భైరవకోన, కోయిలంపాడులకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ యూనియన్ నాయకులు సహకరించాలని డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం స్థానిక డిపోలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగ భూషణం, గ్యారేజీ ఇన్‌చార్జి నాగరత్నం, యూనియన్ నాయకులు కాశీవిశ్వనాథం, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి నియోజకవర్గ పాస్టర్ల కమిటీ ఎంపిక

ఉదయగిరి రూరల్, మార్చి 5: స్థానిక బర్డిడ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో మంగళవారం నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా బీ.అహరోన్, ఉపాధ్యక్షుడిగా థామస్, ప్రధాన కార్యదర్శిగా జాషువా, జాయింట్, ఆర్గనైజింగ్ కార్యదర్శు లుగా ప్రేమానందం, జోసఫ్, ట్రెజరర్‌గా డేవిడ్, గౌరవాధ్య క్షుడిగా రమేష్, గౌరవ ఉపాధ్యక్షుడిగా ముత్తయిలను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా బోయజు, అబ్రహం, మోషే, మైకేల్, చంద్రయ్య, సంపత్‌కుమార్, ప్రసాద్, యోసేలు ఉన్నారు.



ఎంపికైన పాస్టర్ల కమిటీ

నాడు-నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి

ఉదయగిరి రూరల్ : మనబడి నాడు-నేడు పథకం కింద మండలంలో జరుగుతున్న రెండోవిడత పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యమైన వస్తువులను వాడాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, వాటర్, ఎలక్ట్రిషన్, కిచెన్‌షెడ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమైనట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

నూతన బస్టాండ్‌లో ఆగని సర్వీసులు

అనంతసాగరం, మార్చి 5: మండలకేంద్రం అనంతసాగరంలో నూతనంగా నిర్మించిన బస్టాండ్ ప్రాంగణంలోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 7గంటలకు ఆత్మకూరు నుంచి అనంతసాగరం మీదుగా బెంగళూరుకు వెళ్లే సర్వీసులు పాత పద్ధతిలో గతంలో ఆపేచూటే ప్రయాణికులను దించి వెళుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రయాణికులు మూత్రవిసర్జనకు వెళ్లాలంటే ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. రాపూరు డిపోకు చెందిన తిరుపతి బస్సు కూడా ఉదయం సమయంలో బస్టాండ్ ప్రాంగణంలో నిలపడం లేదని అధికారులు చొరవ చూపి బస్సులు ఆపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

సంగం, మార్చి 5: జండాదిబ్బలోని 0.65 సెంట్ల ప్రభుత్వ భూమిని మంగళవారం ఆర్డీవో మధులత పరిశీలించారు. పంచేడు గ్రామానికి చెందిన శివకోటయ్య అనే రైతు కొన్ని సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న ఈ భూమిని తనకు హక్కులు కల్పించాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఆర్డీవో గ్రామనికి వెళ్లి భూమిని పరిశీలించారు. బీడుగా ఉన్న భూమిని పరిశీలించి గ్రామస్థులతో విచారించారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. తహసీల్దారు రమాదేవి, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో

భీమేశ్వరుడికి హంసవాహన సేవ

సంగం, మార్చి 5: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం (రెండోరోజు) అర్ధరాత్రి భీమేశ్వరస్వామి హంస వాహనంపై గ్రామోత్సవంలో ఊరేగారు. అంతకుముందు పూజారులు కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేం చేసి గజమాలలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. గామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు పూలంగిసేవ ఏర్పాటు చేశారు. ఆలయ పూజారి కిషోర్ కుమారశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



హంస వాహనంపై భీమేశ్వరుడు

8న పార్వతీపరమేశ్వరుల కల్యాణం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్థానిక కొండపై వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కంభం సిద్దారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు కల్యాణోత్సవం పాటు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

పోలింగ్ సెక్టార్ అధికారులకు శిక్షణ

ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి సెక్టార్ అధికారి తమకు కేటాయించిన బూత్‌లను ప్రతిరోజు పరిశీలించాలన్నారు. కేంద్రాల వద్ద ఓటర్లకు, సిబ్బందికి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంపులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమ స్యాత్మక గ్రామాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకె ళ్లాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధి లోని ఓటర్లతో సంబంధాలు ఏర్పర్చుకోవాలన్నారు. సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు, ఎనిమిది మండలాల సెక్టార్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్

విజయసాయిరెడ్డి పర్యటనను విజయవంతం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 5: వైసీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మాట్లాడారు. తొలిసారిగా విజయసాయిరెడ్డి నెల్లూరుకు వస్తున్న సందర్భంగా కావలిలో ఆయనకు ఘనస్వాగతం పలుకుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, మల్యాద్రిరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్లు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఓబులరెడ్డి, తిరుపతినాయుడు, సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనం, కోటంరెడ్డిలను కలిసిన కాకర్ల

ఉదయగిరి, మార్చి 5: నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మంగళవారం మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలను నెల్లూరులోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఉదయగిరి రాజకీయ స్థితిగతులపై చర్చించి తన గెలుపుకు సహకరించాలని కోరారు.



మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సన్మానిస్తున్న కాకర్ల

ఓటుపై అవగాహన ఉండాలి

అల్లూరు : యువతకు ఓటుపై అవగాహన ఉండాలని తహసీల్దారు దుర్గేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం యువతకు ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, రామకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ఉండటం బాధాకరం

- సీపీఐ రాష్ట్ర నేత రావుల వెంకయ్య

కందుకూరు, మార్చి 5: రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల పాలన కొనసాగించడం బాధాకరమని, రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టుపెట్టి తీరని అన్యాయం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు రావుల వెంకయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కేంద్రం మెడలువంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రజలకు నమ్మబలికిన జగన్ అధికార పీఠం ఎక్కాక తన స్వప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఊసే ఎత్తకుండా ప్రధాని నరేంద్ర మోదీ వద్ద మోకరిల్లాడని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయాడని, విశాఖ రైల్వేజోన్ కోసం పోరాటం లేదని, పోలవరం పురోగతి లేకుండా చేశాడని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి తీవ్ర విఘాతం కలగించటంలో కేంద్రంలోని బీజేపీ పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారడంతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం జరగాలన్నారు. ఈ సమావేశంలో ఆపార్టీ నాయకులు బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు పలువురు నేతల నివాళి

చిట్రగుంట, మార్చి 5: బోగోలు పంచాయతీకి చెందిన కాపు నేత మెతుకు రమేష్ బాబు సోమవారం మృతి చెందగా మంగళవారం పలువురు నేతలు రమేష్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, స్థానిక నేతలు నాగేశ్వరావు, మాధవరావు, సుధీర్‌బాబు, అహ్మద్ బాషా, పిచ్చయ్య, నరసింహారావు, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, నాయకులు టీ.వెంకయ్య, శ్రీనివాసులు, సీపీఎం నేత వెంకయ్య నివాళర్పించారు. ఆర్వీఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామిశెట్టి వెంకటసుబ్బారావు, కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు రవిప్రకాష్, కాపు సంఘ నాయకులు శ్రీనివాసులు, రాఘవయ్య, శ్రీహరిరాయులు చలపతి, కేశవరావు తదితరులు ఆయన అంత్యక్రియలలో పాల్గొన్నారు.



రమేష్‌బాబుకు నివాళర్పిస్తున్న కృష్ణారెడ్డి

ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు, మార్చి 5: మండలంలోని జి.మేకపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ యు.దాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 21న 5వ తరగతి సిలబస్‌పై ఆబ్జెక్టివ్ విధానంలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో వేర్వేరుగా ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 8106433746ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు, మార్చి 5: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న దాతల సహకారం మరువలేనిదని ఎంఈవోలు ఎంవీవీ ప్రసాదరావు, కే.సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని కోవూరుకు చెందిన మాల్యాద్రి మంగళవారం పట్టణంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ చేశారు.చిన్నారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్పీ కె.ఉదయలక్ష్మి, కావ్య, ఏసుదాసు, సీఆర్ఎంటీలు రమణారెడ్డి, శ్రీను, కిరణ్, కీర్తి, రాగమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

వలేటివారిపాలెం, మార్చి 5 : మండలంలోని శాఖవరం ఎస్సీ కాలనీ సమీపంలోని ప్ర ధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడి అనుమానాస్పదంగా మృతి చెందాడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గుడ్లూరు సీఐ సుబ్బారావు, లింగసముద్రం ఎస్ఐ బాజీబా బు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు శాఖవరంకు చెందిన చుంచు శివకృష్ణ (32)గా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. ఎస్సీ కాలనీలోని పోకూరు వీఆర్‌కోట రోడ్డులో గడ్డం గోవిందమ్మ ఇంటి ముందు రోడ్డు పక్కన శివకృష్ణ మృతి చెంది ఉన్నాడు. మృతుడు మద్యం సేవించి పోకూరు నుంచి శాఖవరం వెళ్తూ మద్యం మత్తులో ముందుకు పడిపోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే మృతడి శరీరంపై గాయాలు ఉండడంతో అనుమానాలు వ్యక్తం అవుతోన్నాయి. మృతుడు తల్లిదండ్రులు సుబ్బారావు, వెంకటరమణమ్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

పేద కళాకారుడికి డోలు, సన్నాయి బహూకరణ

కందుకూరు, మార్చి 5: నిరుపేద నాయీ బ్రాహ్మణ కళాకారులకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు మంగళవారం డోలు, నాదస్వరం బహూకరించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తాను, తన సోదరుడు సాంబశివరావు కలిసి వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాకల శ్రీహరి, కొత్తకోట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ డిక్లరేషన్ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

కందుకూరు, మార్చి 5: మంగళగిరిలో టీడీపీ చేపట్టిన జయహో బీసీ డిక్లరేషన్ బహిరంగ సభకు కందుకూరు నియోజకవర్గం నుంచి తెలుగుతమ్ముళ్లు మంగళవారం అధికసంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపగా ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ముందుగా పట్టణంలోని స్వర్గీయ ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, ముచ్చు శ్రీను, ముచ్చు వేణు, సవిడిబోయిన వెంకటకృష్ణ, వివిధ మండలాల బీసీ నాయకులు పాల్గొన్నారు.



జయహో సభకు తరలివెళ్తున్న తెలుగు తమ్ముళ్లు

- తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య అన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 25వ వార్డు కల్లూరి ప్రశాంతి నగర్, కల్లూరి కోటయ్య నగర్‌లలో మంగళవారం సాయంత్రం ఆమె ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆమె వెంట నాయకులు, మహిళలు ఉన్నారు.

రైల్వేస్టేషన్ స్వీపర్లకు జీతభత్యాలు చెల్లించాలి

కావలిటౌన్, మార్చి 5: రైల్వే స్టేషన్‌లో సుమారు 6ఏళ్ల నుంచి స్వీపర్లుగా పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతభత్యాలు చెల్లించాలని సీఐటీయూ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె రెహనాబేగం డిమాండ్ చేశారు. మంగళవారం కావలి రైల్వేస్టేషన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 6 ఏళ్ల నుంచి స్వీపర్లకు కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయలేదని, 3 నెలల నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. ఇదే విషయమై రైల్వే అధికారులను అడగగా కాంట్రాక్టర్ గడువు పూర్తయిందని తమకు సంబంధం లేదనడండం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులచే పనులు చేయించుకునే అధికారులకు కార్మికుల సమస్యలు పట్టవా ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

కావలిటౌన్, మార్చి 5: మహిళల ఆర్థిక సాధికారత కోసం స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలోని అన్నా క్యాంటీన్ భవనంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను మంగళవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మెప్మా ఏపీ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మిలు ప్రారంభించారు. అనంతరం విజయలక్ష్మి జూమ్ యాప్ ద్వారా కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ మహిళల అభిప్రాయాలు సేకరించారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, ఆహా క్యాంటీన్, మహిళా మార్ట్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర, ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

హంస వాహనంపై మల్లన్న దర్శనం

కావలిటౌన్, మార్చి 5: కావలి పట్టణ పాతూరులోని ప్రాచీన శివాలయంలో శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు (కుంభమాస తిరునాళ్లు) భాగంగా సోమవారం మల్లన్నకు హంసవాహన సేవలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న బ్రహోత్సవాలలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమం పూజలు, బలిహరణ, పల్లకీ సేవలు నిర్వహించారు. రాత్రి మల్లన్న హంస వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

దివ్యాంగ యువకుడికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న నళినీదేవి

లింగసముద్రం, మార్చి 5 : మండలంలోని ఎర్రారెడ్డి పాలెంకు చెందిన చీమలదిన్నె వెంగళరావు అనే దివ్యాంగ యువకుడికి కందుకూరులోని రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్, టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి వీల్‌చైర్ అందజేశారు. మంగళవారం ఎర్రాఎడ్డిపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పొడపాటి నరసింహం, స్థానిక టీడీపీ నాయకులు ఉట్లపల్లి పెద్ద మాధవ, ఉప్పుటూరి రమణయ్య, దండేబోయిన పెద నరసింహ, కామినేని ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

వలేటివారిపాలెం, మార్చి 5 : విద్యార్థులు బాగా చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జడ్పీటీసీ ఇంటూరి భారతి సూచించారు. మండలంలోని పోకూరు హైస్కూల్‌లో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల సభ జరిగింది. ముందుగా సరస్వతిదేవికి పూజ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక, కందుకూరు ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, ఎంఈవో మల్లికార్జునరావు, హెచ్‌ఎంలు కమల్‌కుమార్, చిన్నయ్య టీచర్లు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి వీ.మంజుల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెంలో ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు ఎన్.వేణి, అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణారెడ్డిని కలసిన అలేఖ్య

కావలి, మార్చి 5: తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య మంగళవారం ముసునూరులోని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. తనకు అప్పగించిన ఈ పదవికి న్యాయం చేస్తూ కావలిలో టీడీపీ జెండా ఎగుర వేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమె భర్త పోతుగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 15 మందికి ఉద్యోగాలు

కందుకూరు, మార్చి 5: ఆర్కే ఇన్ఫోసిస్టమ్స్ కార్పొరేట్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 15మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుందని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో తీవ్రమైన సంక్షోభం నెలకొని ఉన్న తరుణంలో యూఏఈ కేంద్రంగా ఉన్న కంపెనీ తమ విద్యార్థులను రూ.3.55 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసుకోవటం హర్షదాయకమని కరస్పాండెంట్ రామయ్య తెలిపారు. మెయిల్ ద్వారా ఉద్యోగ నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు.

పేద మహిళకు ఆర్థిక సాయం



మహిళకు నగదు అందజేస్తున్న సభ్యులు

కావలిటౌన్, మార్చి 5: కేన్సర్‌తో బాధపడుతున్న పేద మహిళ బీబీజాన్ వైద్య ఖర్చుల కోసం మంగళవారం వాకర్స్ అసోసియేషన్ రూ.10,500 ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ శేషయ్య, సభ్యులు నల్లపరెడ్డి శ్రీనివాసులు, మంద వెంకటేశ్వర్లు, రమేష్, భాస్కర్‌నాయుడు, బత్తిన శ్రీనివాసులు, గోపాల్, సత్యానందం, ప్రేమ్‌కుమార్, ఆర్టీసీ బాషా తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పల్స్ పోలియో

వలేటివారిపాలెం, మార్చి 5 : మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం మంగళవారంతో నూరుశాతం పూర్తయినట్లు వైద్యాధికారి మణిదీపిక తెలిపారు. మండలంలోని 3,963 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, శివ, ఏఎన్ఎంలు అంగ్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.